Pubilshed from Vijayawada

PRGI NO : APTEL/2011/41440

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



మనిషి మనుగడలో అతిముఖ్యమైనది
శాంతి సుఖం సంతోషం ఆర్థికాభివృద్ధిఎదుగుదల,
ఇలాంటివి సాధించుకోవటానికి ఎదురయ్యే సమస్యలకు
గృహవాస్తు. జాతకదోషాలు,
అనేక రకాల సందేహాల నివృత్తి కోసం
చక్కటి పరిష్కారం కోసం సంప్రదించగలరు.

వాస్తు - జ్యోతిష పండితులు
మహామంత్రోపాసకులు
శ్రీ లలితాంబికా పీఠం వ్యవస్థాపకులు
బ్రహ్మశ్రీ మాడుగుల శివప్రసాద్ గురూజీ
79970 39039

విజయవాడ VIJAYAWADA | సంపుటి : 15 Vol.No : 15 | సంచిక : 139 Issue No : 139 | శనివారం Saturday | సెప్టెంబర్ 5, 2026 5 SEPTEMBER 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## నింగిలోకి ఈవోఎస్-05..

**ఇస్రో ఖాతాలో మరో భారీ విజయం!**

- ఈవోఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో
- జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ద్వారా శ్రీహరికోట నుంచి ప్రయోగం
- భూస్థిర కక్ష్య నుంచి పనిచేయనున్న తొలి భారత ఇమేజింగ్ శాటిలైట్
- భారత ఉపఖండంపై నిరంతరం నిఘా పెట్టే సామర్థ్యం
- ఐదేళ్ల క్రితం విఫలమైన మిషన్‌కు ప్రత్యామ్నాయంగా ఈ ప్రయోగం

ప్రజాభూమి ప్రతినిధి, శ్రీహరికోట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. శుక్రవారం తెల్లవారుజామున 2:55 గంటలకు, శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ద్వారా ఈవోఎస్-05 (జిశాట్-1ఎ) ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది.

2 పేజిలో..

## సాగు నీటి సంరక్షణ.. పర్యావరణ పరిరక్షణ..

# అహ్లాదకరణ వాతావరణం



**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో పల్లె చెరువులకు కొత్త కళ**

- రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ. 50 కోట్లతో 105 చెరువుల ఆధునీకరణ
- ఇప్పటికే 26 చెరువులకు పునరుజ్జీవం - భూగర్భ జలాల పెంపు.. సమగ్ర అభివృద్ధే ధ్యేయం
- ఆధునిక హంగులతో ఆహ్లాదకర కేంద్రాలుగా చెరువులు - వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ ఎయిర్ జిమ్‌లు, చిల్డ్రన్ పార్కులతో కొత్త రూపు
- సెప్టెంబర్ నెలాఖరుకల్లా పనులు పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం



ప్రజాభూమి ప్రతినిధి అమరావతి : సాగు నీటి వనరుల సంరక్షణ నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల వరకు సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక కృషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధిపై లక్ష్యంగా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉప ముఖ్యమంత్రివర్యుల చొరవకు 'ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన' పథకం తోడవడంతో రాష్ట్రవ్యాప్తంగా మంచినీటి చెరువులు, సరస్సుల పునరుజ్జీవనానికి కొత్త ఊపు వచ్చింది.

వివరాలు 2లో..



ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలతో

## చంద్రబాబు నేడు కీలక భేటీ

- పీఆర్సీ, కరవు భత్యం తదితర అంశాలపై చర్చించనున్న సీఎం
- నిన్న చంద్రబాబును కలిసిన ఏపీ జేఏసీ నేతలు
- ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న ముఖ్యమంత్రి

ప్రజాభూమి ప్రతినిధి. అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నేడు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.


- మిగతా 2లో..

## ఇథనాల్ శానిటైజర్ల దుర్వినియోగంపై ఆందోళన

- లైసెన్స్ మినహాయింపు ఎత్తివేయాలి
- కేంద్రానికి రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ లేఖ

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి : ఇథనాల్ ఆధారిత హ్యాండ్ శానిటైజర్లను కొందరు మద్యం ప్రత్యామ్నాయంగా వినియోగిస్తున్న నేపథ్యంలో.. వాటి విక్రయాలపై నియంత్రణ అవసరమని రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ పీ. అరుణ్‌బాబు, ఐఏఎస్ పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో శానిటైజర్ల నిల్వ, విక్రయాలకు ఇచ్చిన లైసెన్స్ మినహాయింపును ఇథనాల్ ఆధారిత శానిటైజర్లకు వర్తించకుండా ఉపసంహరించాలని కోరుతూ డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ (ఇండియా)కు లేఖ రాశారు. కొవిడ్ సమయంలో శానిటైజర్ల సులభ లభ్యత కోసం కేంద్ర ప్రభుత్వం 27-07-2020న ఎస్.ఓ.245(ఈ) నోటిఫికేషన్ ద్వారా వాటి నిల్వ, విక్రయాలకు సేల్ లైసెన్స్ నుంచి మినహాయింపు ఇచ్చిందని అరుణ్‌బాబు తెలిపారు.

2 పేజీలో..



## ఎపి మున్సిపాలిటీల్లో వార్డుల పునర్విభజనకు షెడ్యూల్ విడుదల

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఎపి లో మున్సిపల్ కార్పొరేషన్ల వార్డుల పునర్విభజన ప్రక్రియకు పురపాలక శాఖ షెడ్యూల్ విడుదల చేసింది. శుక్రవారం వార్డుల పునర్విభజన ప్రతిపాదనలు పంపాలని సంబంధిత కార్పొరేషన్లను ఆదేశించింది.

- మిగతా 2లో..

## సరికొత్తగా హస్త కళలు

**ఆధునిక డిజైన్లతో సంస్కృతీ సంప్రదాయల కళారూపాలు**

- కళారూపాల తయారీలో 770 మంది కళాకారులకు శిక్షణ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహణ
- రూ.1.35 కోట్లు విడుదల చేసిన కేంద్రం
- క్లస్టర్ల వారీగా శిక్షణ కార్యక్రమాలు
- 200 మందికి శిక్షణతో పాటు టూల్ కిట్లు అందజేస్తాం
- ఆదాయం, ఉపాధే లక్ష్యంగా హస్త కళాకారులకు శిక్షణ
- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

వివరాలు 2లో..



ప్రజాభూమి ప్రతినిధి. అమరావతి : మారుతున్న అభిరుచులు, హస్త కళలకు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హస్త కళాకారులకు మెరుగైన జీవనం, ఆర్థిక భరోసా కలిగించేలా చర్యలు చేపట్టాయి. హస్త కళారూపాల తయారీలో మరింత ప్రావీణ్యం పెంపొందించడంతో పాటు ఆధునిక డిజైన్ల తయారీలో శిక్షణా కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.1.35 కోట్లను వెచ్చించనుంది.

## పోలీసు క్రీడలకు ఇక ప్రత్యేక అకాడమీ

**పోలీసు క్రీడాకారులకు ప్రొఫెషనల్ శిక్షణ**

- పతకాలే లక్ష్యంగా పోలీస్ స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు
- ఏపీ పోలీస్ స్పోర్ట్స్ కార్యకలాపాల కోసం విఐటీ-అమరావతితో అవగాహన ఒప్పందం
- ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్ ముగింపు.. - ఒకే టీమ్‌గా పనిచేయాలి: డీజీపీ హరీష్ కుమార్ గుప్తా
- ఫిట్‌నెస్‌తోనే భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోగలం: డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా
- తొలి రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌కు ఘనంగా ముగింపు..
- ఓవరాల్ ఛాంపియన్‌గా విశాఖ రేంజ్

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: రాష్ట్ర పోలీసు క్రీడాకారులను జాతీయస్థాయిలో తీర్చిదిద్దే లక్ష్యంతో 'ఏపీ పోలీస్ స్పోర్ట్స్ అకాడమీ' ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ప్రకటించారు. క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ, ఆధునిక క్రీడా పరికరాలు, అవసరమైన మౌలిక వసతులు కల్పించి ప్రొఫెషనల్ స్థాయిలో తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇందులో భాగంగా వీఐటీ--ఏపీ, అమరావతితో పోలీసుశాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఏపీ పోలీస్ స్పోర్ట్స్ అకాడమీ లోగోను డీజీపీ ఆవిష్కరించారు.



- మిగతా 2లో..



## కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ఊరట..

**మంత్రి సత్యకుమార్ ఆదేశాలతో కీలక ఉత్తర్వులు జారీ**

- రేడియోగ్రాఫర్లు, నర్సులు, పీహెచ్‌సీ సిబ్బంది సమస్యలకు పరిష్కారం
- ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా ప్రోత్సాహకాలు

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాంట్రాక్ట్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) విజ్ఞప్తులపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు.

మంత్రి ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాం డియన్, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు సమీక్షలు నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులు కాంట్రాక్టు ఉద్యోగులకు ఊరట నిచ్చేలా కీలక ఉత్తర్వులు జారీ చేశారు. రేడియేషన్ ముప్పును ఎదుర్కొంటున్న కాంట్రాక్ట్ రేడియోగ్రాఫర్లు, రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్లకు ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించింది.

వివరాలు 2లో..



## ద్రవ్యోల్బణం, లిక్విడిటీ ఒత్తిడి..

**రెపో రేటు పెంపునకు సిద్ధమవుతున్న ఆర్బీఐ?**

- ఏప్రిల్ 2027 నాటికి రెపో రేటును 6 శాతానికి పెంచే అవకాశం
- మార్కెట్లలో పేరుకుపోయిన అదనపు నగదు ప్రవాహంతో విధానపరమైన సవాళ్లు
- పెరుగుతున్న ద్రవ్యోల్బణ ఒత్తిళ్లతో ఆర్బీఐపై పెరుగుతున్న ఒత్తిడి
- త్వరలో ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే దిశగా ఆర్బీఐ అడుగులు
- బంధన్ ఏఎంసీ నివేదికలో వెల్లడైన కీలక ఆర్థిక అంచనాలు

2 పేజీలో..

# నింగిలోకి ఈవోఎస్-05..

ఈ ప్రయోగంతో భారత అంతరిక్ష సామర్థ్యం మరో మెట్టు పైకెక్కినట్లయింది. భూస్థిర కక్ష్య నుంచి పనిచేయనున్న భారత్ తొలి ఇమేజింగ్ శాటిలైట్ ఇదే కావడం ఈ ప్రయోగం ప్రత్యేకత. భూమికి దాదాపు 36,000 కిలోమీటర్ల ఎత్తులో ఉంటూ, భూభ్రమణంతో పాటే ఇది తిరుగుతుంది. దీనివల్ల భారత ఉపఖండం, పరిసర ప్రాంతాలపై నిరంతరం ఒక కన్ను వేసి ఉంచడం సాధ్యమవుతుంది. సాధారణంగా లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లోని ఉపగ్రహాలు ఒక ప్రాంతంపై నుంచి పరిమిత సమయం మాత్రమే వెళ్తాయి. కానీ, ఈవోఎస్-05 స్థిరంగా ఒకే ప్రాంతాన్ని పర్యవేక్షించగలదు. ఈ ఉపగ్రహం ప్రతి 30 నిమిషాలకు ఒకసారి మొత్తం భారత భూభాగాన్ని చిత్రీకరించగలదు. ప్రకృతి వైపరీత్యాలైన తుఫానులు, వరదలు, అడవుల్లో కార్చిచ్చులను ముందుగా పసిగట్టడంలో, వాతావరణ మార్పులను గమనించడంలో ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. వ్యవసాయం, జలవనరుల నిర్వహణ, సరిహద్దు ప్రాంతాల పర్యవేక్షణలో కూడా ఇది కీలక పాత్ర పోషించనుంది. ఐదేళ్ల క్రితం, అంటే 2021 ఆగస్టులో, జీఎస్ఎల్‌వీ-ఎఫ్10 రాకెట్ సాంకేతిక వైఫల్యం కారణంగా జిశాట్-1 (ఈవోఎస్-03) మిషన్ విఫలమైన విషయం తెలిసిందే. ఆ లోటును పూడ్చుతూ, ఇప్పుడు ఈవోఎస్-05ను విజయవంతంగా ప్రయోగించి ఇస్రో తన సత్తా చాటింది. ప్రస్తుతం ఉపగ్రహం సబ్-జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లో ఉందని, దాని సోలార్ ప్యానెళ్లు తెరుచుకొని పనిచేస్తున్నాయని ఇస్రో తెలిపింది. రాబోయే రోజుల్లో దశలవారీగా కక్ష్యను పెంచుతూ, దానిని తుది భూస్థిర కక్ష్యలో ప్రవేశపెడతారు. ఈ ప్రయోగం భారత భూపర్యవేక్షణ రంగంలో ఒక కీలక మైలురాయిగా నిలవనుంది.

# ఉద్యోగ, ఉపాధ్యాయ నేతలతో చంద్రబాబు నేడు కీలక భేటీ

కొత్త పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ అమలుతో పాటు కరవు భత్యం బకాయిలు తదితర కీలక అంశాలపై ఈ భేటీలో సమగ్రంగా చర్చించనున్నారు. నిన్న సచివాలయంలో ఏపీ జేఏసీ నాయకులు ఎ. విద్యాసాగర్, డీవీ రమణ, భారతీ ప్రసాద్ తదితరులు సీఎం చంద్రబాబును కలిశారు. ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న ఆందోళనలను, ఆర్థికేతర సదుపాయాల పెండింగ్ అంశాలను విద్యాసాగర్ సీఎంకు వివరించి, తక్షణ పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి... ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అత్యంత కట్టుబడి ఉందో స్పష్టం చేశారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగులకు అందాల్సిన న్యాయమైన ప్రయోజనాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు.
ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి సానుకూలంగా చర్చలు జరుపుతున్న తరుణంలో, ఉద్యోగ సంఘాలు తొందరపడి ఆందోళన బాట పట్టడంపై సీఎం చంద్రబాబు కొంత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సమగ్ర చర్చల వేదిక అందుబాటులో ఉన్నప్పుడు కొద్దిగా ఓర్పు వహించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రితో భేటీపై హర్షం వ్యక్తం చేసిన ఏపీ జేఏసీ నేతలు... ప్రభుత్వం వైపు నుంచి సానుకూల చర్చల ప్రక్రియను స్వాగతిస్తున్నామని, సీఎం స్థాయిలోనే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

# ఎపి మున్సిపాలిటీల్లో వార్డుల పునర్విభజనకు షెడ్యూల్ విడుదల

సెప్టెంబర్ 5 నుంచి 11 వరకు ప్రతిపాదనలపై అధికారులు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 12 న తుది ప్రతిపాదనలను పురపాలక శాఖ డైరెక్టరేట్‌కు పంపనుండగా, 13 న డిలిమిటేషన్ వార్డులను ప్రకటించి, 14 న ఎపి గెజిట్‌లో ప్రచురించనున్నారు. జివిఎంసి, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి, కడప, ఏలూరు, అనంతపురం, ఒంగోలు, చిత్తూరు, మచిలీపట్నం కార్పొరేషన్లకు ఈ ఆదేశాలు జారీ అయ్యాయి.

# కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ఊరట..

బోధనాస్పత్రుల్లో ఎక్స్‌రే, రేడియాలజీ విభాగాల్లో విధులు నిర్వహించే అర్హులైన సిబ్బందికి ప్రతి 11 నెలల విధి పూర్తయిన తర్వాత 30 రోజుల తప్పనిసరి ప్రత్యేక సెలవు మంజూరు చేయాలని ఆదేశించింది. ఈ సెలవును సాధారణ లీవ్ ఖాతా నుంచి మినహాయించరాదని స్పష్టం చేసింది. పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత, విధుల సర్దుబాటుపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. స్థానిక అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని ఆదేశించింది. పగటి సమయంలో ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓల సేవలను, రాత్రి సమయంలో అవసరానికి అనుగుణంగా ఎస్ఏడబ్ల్యూల సేవలను వినియోగించాలని సూచించింది. ముఖ్యంగా రాత్రి విధులు నిర్వహించే సిబ్బందికి సహాయకంగా వీరి సేవలను ఉపయోగించుకోవాలని పేర్కొంది. నర్సులపై ఉన్న 12 గంటల నిరంతర విధి భారం తగ్గించేలా కూడా చర్యలు తీసుకున్నారు. పీహెచ్‌సీలో ముగ్గురు నర్సులు పనిచేస్తున్న సందర్భంలో ఒకరు సెలవులో ఉన్నా, మిగిలిన సిబ్బందితో రొటేషన్ పద్ధతిలో విధులు సర్దుబాటు చేయాలని ఆదేశించారు. పగటి సమయంలో ఒక నర్సుపై 12 గంటల నిరంతర విధి భారం పడకుండా చూడాలని స్పష్టం చేశారు. స్థానికంగా అందుబాటులో ఉన్న ూచీవీ సేవలను సమర్థంగా వినియోగించుకుని విధులు సర్దుబాటు చేయాలని సూచించారు. డీఎంఎల్‌టీ, బీఎస్సీ (ఎంఎల్‌టీ) విద్యార్థులకు కూడా పీహెచ్‌సీల్లో క్లినికల్ శిక్షణకు అవకాశం కల్పించారు. 6 లేదా 12 నెలల క్లినికల్ శిక్షణలో భాగంగా నెలరోజుల పాటు పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో శిక్షణ పొందేలా మార్గదర్శకాలు జారీ చేశారు. విద్యార్థులకు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారులు శిక్షణ కేంద్రాలను కేటాయించనున్నారు. శస్త్రచికిత్సలు, ప్రొసీజర్లకు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా అందే ప్రోత్సాహకాల్లో డాక్టర్లతో పాటు వాటిలో పాల్గొనే కాంట్రాక్ట్ పారామెడికల్ సిబ్బందికీ వారి క్యాడర్‌కు అనుగుణంగా నిర్ణయించిన వాటా ఇవ్వాలని ఆదేశించారు. స్టాఫ్ నర్సులు, ూ టెక్నీషియన్లు, అనస్థీషియా టెక్నీషియన్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఇతర సంబంధిత సిబ్బందిని కూడా అర్హత మేరకు చేర్చాలని స్పష్టం చేశారు. ప్రతి నెల శస్త్రచికిత్సలు, పాల్గొన్న సిబ్బంది, వారికి అందే ప్రోత్సాహక మొత్తాల వివరాలను నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్‌బాబు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.




# సాగు నీటి సంరక్షణ..పర్యావరణ పరిరక్షణ..అహ్లాదకర వాతావరణం

శ్రీ పవన్ కళ్యాణ్ గారి దార్శనికత, అభివృద్ధి పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతతో చెరువులకు కొత్త జీవం పోయడమే కాకుండా, వాటిని మరింత సమర్థవంతమైన సాగునీటి వనరులుగా తీర్చిదిద్దే దిశగా విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. చెరువుల ఆధునీకరణ ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడం, పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడటం, సాగునీటి సామర్థ్యాన్ని బలోపేతం చేయడంతోపాటు గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన, ఆహ్లాదకరమైన జీవన వాతావరణాన్ని అందించాలన్న సమగ్ర లక్ష్యంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయి.
రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కోసం మొత్తం రూ.50 కోట్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 26 చెరువులను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. అనంతపురం, పల్నాడు, శ్రీ సత్యసాయి, చిత్తూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో ఇప్పటికే చెరువుల అభివృద్ధి పూర్తయ్యి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో శరవేగంగా కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చెరువుల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ, ఆయా ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా పనులను చేపడుతున్నారు. ఈ కార్యక్రమం పూర్తయితే చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతోపాటు సాగు నీటి వనరులు మరింత బలోపేతం కానున్నాయి. అలాగే భూగర్భ జలాల వృద్ధికి తోడ్పడనున్నాయి. చెరువుల ఆధునీకరణ ప్రక్రియలో భాగంగా చెరువు గట్ల బలోపేతం, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు, ప్రవేశ ద్వారాల నిర్మాణం, సోలార్ లైట్ల ఏర్పాటు, సిట్టింగ్ బెంచ్‌ల ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నారు. పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా



పార్కుల ఏర్పాటు చేయడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఓపెన్ ఎయిర్ జిమ్ పరికరాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు చెరువుల సుందరీకరణ పనులకు ప్రాధాన్యం ఇస్తూ, వాటిని ప్రజల విశ్రాంతి, ఆరోగ్యం, వినోదానికి అనువైన కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే చిత్తూరు జిల్లా, కుప్పం నియోజకవర్గం పరిధిలోని వెదుళ్ల చెరువు, కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని పండూరు చెరువు, గుంటూరు జిల్లా వెంగళాయపాలెం చెరువు, అనంతపురం జిల్లాలో గుడిశెలపల్లి చెరువు, నెల్లూరు జిల్లాలోని వింజమూరు, శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం తదితర చెరువులు పూర్తి స్థాయి అభివృద్ధి పనులు పూర్తి చేసుకుని ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఈ పనుల ద్వారా చెరువులు కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే పరిమితం కాకుండా బహుళ ప్రయోజన కేంద్రాలుగా రూపుదిద్దుకోనున్నాయి. చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరగడం వల్ల సాగునీటి వనరులు బలోపేతం కావడంతో పాటు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో రైతులకు సాగునీటి పరంగా ప్రయోజనం చేకూరడంతో పాటు గ్రామీణ ప్రజలకు దీర్ఘకాలికంగా మెరుగైన ఫలితాలు అందనున్నాయి. పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ కార్యక్రమం దోహదపడనుంది.
అభివృద్ధి పనుల వేగంతో పాటు వాటి నాణ్యతపై కూడా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ, ప్రతి పని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సాగుతున్నాయో లేదో పరిశీలిస్తున్నారు. పనులను సెప్టెంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. అభివృద్ధి పనుల్లో వేగం, నాణ్యత రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి, రాష్ట్రంలో అమలుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు తెలియజేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కి, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కి కృతజ్ఞతలు తెలిపారు. సాగు నీరు, పర్యావరణం, గ్రామీణ మౌలిక సదుపాయాలు, ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలు వంటి అన్ని అంశాలను సమన్వయం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పవన్ కళ్యాణ్ దార్శనికత ఈ చెరువుల ఆధునీకరణ కార్యక్రమంలో ప్రతిబింబిస్తోంది.

# ద్రవ్యోల్బణం, లిక్విడిటీ ఒత్తిడి..




**న్యూఢిల్లీ :** భారత ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న సంక్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపో రేటును ఏప్రిల్ 2027 నాటికి 6 శాతానికి పెంచే అవకాశం ఉందని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ బంధన్ ఏఎంసీ తన నివేదికలో అంచనా వేసింది. మార్కెట్లలో పేరుకుపోయిన అదనపు నగదు లభ్యత (లిక్విడిటీ), పెరుగుతున్న ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నేపథ్యంలో స్థిరమైన ద్రవ్య విధానాన్ని రూపొందించేందుకు ఈ పెంపు అవసరమని నివేదిక శుక్రవారం స్పష్టం చేసింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఒకవైపు, విదేశీ పెట్టుబడుల రూపంలో భారీగా వస్తున్న రూపాయి నిధుల వల్ల ఏర్పడిన అదనపు లిక్విడిటీ మరోవైపు.. ఈ రెండింటి మధ్య భారత ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఇన్వెస్టర్లు సంక్లిష్టమైన వాతావరణాన్ని ఎదుర్కొంటున్నారని నివేదిక విశ్లేషించింది. ఈ అదనపు నగదు ప్రవాహం కారణంగా ఓవర్‌నైట్ వడ్డీ రేట్లు, ఆర్బీఐ పాలసీ రేటు కంటే చాలా తక్కువ స్థాయికి పడిపోయాయని తెలిపింది. ఈ అసమతుల్యతను సరిదిద్దడానికి ఆర్బీఐ త్వరలోనే రంగంలోకి దిగాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి ఆర్బీఐ ఎంత వేగంగా చర్యలు తీసుకుంటుందన్న దానిపైనే భవిష్యత్తు ఆధారపడి ఉందని నివేదిక అభిప్రాయపడింది. ఓవర్‌నైట్ రేట్లను తిరిగి పాలసీ రేట్లతో అనుసంధానించడం, మధ్యకాలికంగా ఉన్న అదనపు లిక్విడిటీని తగ్గించడం, ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని రెపో రేటు పెంపుపై ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) నిర్ణయం తీసుకోవడం వంటి చర్యలు ఉంటాయని అంచనా వేసింది. ఎఫ్ఎక్స్ స్వాప్స్, ఎంఎస్ఎస్ బాండ్లు, ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ (ఓఎంఓ) అమ్మకాలు, అవసరమైతే నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్) పెంపు వంటి చర్యలను మార్కెట్ వర్గాలు ఆశిస్తున్నాయని తెలిపింది. మధ్యప్రాచ్యంలో మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో ఇంధన ధరలు పెరగడం, వ్యవసాయ ఉత్పత్తులతో సహా ఇతర కమొడిటీల ధరల్లో ఒత్తిడి వంటి అంతర్జాతీయ అంశాలు ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోస్తున్నాయని నివేదిక గుర్తు చేసింది. దీనికి తోడు, దేశంలో రుతుపవనాలు అస్తవ్యస్తంగా ఉండటం, జీడీపీ వృద్ధి బలంగా నమోదు కావడం, రుణ వృద్ధి సుమారు 18 శాతంగా ఉండటం వంటి స్థానిక పరిస్థితులు కూడా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను పెంచుతున్నాయని వివరించింది. ఇప్పటివరకు వెలువడిన గణాంకాలు ఆర్బీఐకి కొంత ఊరటనిచ్చినప్పటికీ, ఇటీవలి ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశపు మినిట్స్.. సభ్యుల వైఖరి కఠినంగా మారుతోందనడానికి సంకేతమని నివేదిక అభిప్రాయపడింది. ప్రపంచవ్యాప్తంగా ధరల ఒత్తిళ్లు మరింత తీవ్రమవుతున్న తరుణంలో, ప్రస్తుత పాలసీ వైఖరిపై ఎంపీసీ సభ్యులలో అసౌకర్యం పెరుగుతోందని అంచనా వేసింది.

# సరికొత్తగా హస్త కళలు

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళారూపాలను తయారు చేస్తున్న 770 మంది హస్త కళాకారులకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టనుంది. ఇందుకోసం శిక్షణా కార్యక్రమాలు ఆయా కళారూపాలను బట్టి నెల, రెండు నెలల పాటు ఇవ్వనున్నారని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన జారీ చేసింది. రాష్ట్రంలో చేతివృత్తులకు అండగా నిలవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేనేతలకు ఆర్థిక మేలు కలిగించడంతో పాటు చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇప్పుడు హస్త కళాకారులకు కూడా ఆర్థిక భరోసా కలిగేలా ఆయా కళారూపాల తయారీలో మెరుగైన శిక్షణ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకుంటోందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ప్రఖ్యాతిగాంచిన హస్త కళారూపాలను తయారీ చేస్తున్న కళాకారులను గుర్తించి మారుతున్న అభిరుచులకు అనుగుణంగా శిక్షణ ఇవ్వాలని రెండు ప్రభుత్వాలు నిర్ణయించాయన్నారు. ఈ శిక్షణల నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రూ.1,35,16, 314లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.1.01 కోటి నిధులు మంజూరయ్యాయన్నారు. రాష్ట్రంలో ఆయా క్లస్టర్లలో ఉన్న హస్త కళాకారులకు రెండు విధాలుగా శిక్షణివ్వనున్నట్లు వెల్లడించారు. గురు-శిష్యహస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్చ్‌పీ), డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా నెల, రెండు నెలల శిక్షణ ఇవ్వనున్నామన్నారు. గురు-శిష్య హస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్చ్‌పీ) రెండు నెలలు, డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) నెల రోజుల పాటు శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ)లోని కొయ్యబొమ్మల తయారీకి కూడా రెండు నెలల పాటు ఇవ్వనున్నామన్నారు.

**200 మందికి శిక్షణతో పాటు పనిముట్లు :** గురు-శిష్యహస్త శిల్ప్ ప్రశిక్షణ్(జీహెచ్చ్‌పీ) శిక్షణ కార్యక్రమంలో భాగంగా చెక్క బ్లాక్ తయారీ, కలంకారి బ్లాక్ ప్రింటింగ్, దుర్గి రాతి శిల్పం, అగరుబత్తి తయారీ, తాటి ఆకుల కళ, కొబ్బరి చిప్పల కళ, శ్రీకాళహస్తి కలంకారి వంటి హస్తకళలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ (డీడీడబ్ల్యూ) ద్వారా చెక్క శిల్పం, టెర్రకోట బొమ్మలు, లేస్/హ్యాండ్‌మేడ్ నిటెడ్ గూడ్స్, అల్లగడ్డ రాతి శిల్పం, శ్రీకాళహస్తి కలంకారి, వెదురు-చెరకు కళలు, సవర గిరిజన చిత్రకళ, బొబ్బిలి వీణ, ఇమిటేషన్ జ్యువెలరీ తదితర కళారూపాల తయారీపై మరో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. వారిలో అనంతపురం, పల్నాడు, అనకాపల్లి క్లస్టర్లకు చెందిన 50 మంది చొప్పున 200 మంది అరటి ఫైబర్, చెరకు-వెదురు, వుడ్ టర్నింగ్, ల్యాకర్‌వేర్, దుర్గి రాతి శిల్ప కళాకారులకు శిక్షణతో పాటు ఇంప్రూవుడ్ టూల్ కిట్ డిస్ట్రిబ్యూషన్ ప్రోగ్రామ్(ఐటీడీపీ) ద్వారా పనిముట్లు పంపిణీ చేయనున్నామన్నారు. ఈశిక్షణా



కార్యక్రమాలు కృష్ణా, గుంటూరు, ఎన్‌టీఆర్, అనకాపల్లి, డా. బీఆర్. అంబేద్కర్ కోనసీమ, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, తూర్పు గోదావరి, నంద్యాల, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనంతపురం, పల్నాడు తదితర జిల్లాల్లోని కళాకారులకు ఉపయోగపడనున్నాయని మంత్రి తెలిపారు.

**కళాకారుల ఆదాయం పెంపే లక్ష్యం :** ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ హస్తకళలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు, కళాకారుల ఆదాయాన్ని పెంచడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. సంప్రదాయ కళలను కాపాడుతూ ఆధునిక డిజైన్లు, మెరుగైన శిక్షణ, నాణ్యమైన పనిముట్లు అందించడం ద్వారా హస్తకళాకారులకు ఆర్థికంగా మరింత వెన్నుదన్నుగా ఉండేలా ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. త్వరలోనే ఈ శిక్షణా కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు వెల్లడించనున్నామని మంత్రి సవిత తెలిపారు.

# పోలీసు క్రీడలకు ఇక ప్రత్యేక అకాడమీ

మంగళగిరి ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌లో శుక్రవారం జరిగిన తొలి ఏపీ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 ముగింపు కార్యక్రమంలో డీజీపీ మాట్లాడారు. పోలీసుశాఖలో హోదాలు, పోస్టింగ్‌లు వేరైనా అందరూ ఒకే జట్టులోని సభ్యులేనని పేర్కొన్నారు. 'మనది ఏపీ పోలీస్ టీమ్.. మనమంతా ఒకే కుటుంబం. సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలం' అని పిలుపునిచ్చారు.

**1,900 మంది.. నాలుగు రోజుల క్రీడా సంబరం..** రాష్ట్రంలోని 15 రేంజ్‌ల నుంచి దాదాపు 1,900 మంది పోలీసు క్రీడాకారులు నాలుగు రోజులపాటు జరిగిన పోటీల్లో పాల్గొన్నారని డీజీపీ తెలిపారు. తొలిసారిగా ఇంత పెద్ద స్థాయిలో రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. పతకాలు సాధించిన వారిని అభినందిస్తూ.. విజయం సాధించని వారు నిరుత్సాహపడకుండా మరింత సాధనతో ముందుకు సాగాలని సూచించారు. గెలుపు ఉత్సాహాన్నిస్తే.. ఓటమి పాఠం నేర్పుతుందని, రెండింటినీ సమానంగా స్వీకరించడమే క్రీడాస్ఫూర్తి అని పేర్కొన్నారు. సమాజంతోపాటు నేరాల స్వరూపమూ వేగంగా మారుతోందని డీజీపీ పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఎదురయ్యే కొత్త తరహా సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు పోలీసులకు శారీరక, మానసిక దృఢత్వం అత్యంత అవసరమన్నారు. క్రీడలను ఉద్యోగ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర పోలీసు క్రీడాకారులు ఈ మీట్‌తోనే ఆగిపోకుండా ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌లో పతకాలు సాధించి ఆంధ్రప్రదేశ్‌కు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వారికి ప్రభుత్వం, పోలీసుశాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈసారి రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో మహిళా సిబ్బంది పాల్గొనడం కొత్త అధ్యాయానికి నాంది అని డీజీపీ పేర్కొన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ప్రతిభ చాటుతున్నారని, పోలీసుశాఖలోని మహిళా క్రీడాకారులు కూడా రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించేలా పూర్తి ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. స్పోర్ట్స్ మీట్‌ను



విజయవంతంగా నిర్వహించిన ఆర్గనైజింగ్ కమిటీ, విశ్వవిద్యాలయాలు, క్రీడా సంస్థలు, కోచ్‌లు, సాంకేతిక అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు, స్పాన్సర్లను డీజీపీ అభినందించారు. వచ్చే ఏడాది పోలీస్ స్పోర్ట్స్ మీట్‌ను మరింత విస్తృతంగా, మెరుగైన ప్రమాణాలతో నిర్వహిస్తామని తెలిపారు.

**విశాఖ రేంజ్‌కు ఓవరాల్ ఛాంపియన్‌షిప్...** నాలుగు రోజులపాటు హోరాహోరీగా సాగిన పోటీల్లో విశాఖ రేంజ్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐజీపీలు కె.వి.మోహన్‌రావు (స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్), ఆకే రవికృష్ణ (ఈగల్), బి.రాజకుమారి (వుమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ), సీహెచ్.శ్రీకాంత్ (టెక్నికల్ సర్వీసెస్ అండ్ ఆపరేషన్స్), సెంథిల్‌కుమార్, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, డీఐజీలు అన్బురాజన్, వకుల్ జిందాల్‌తోపాటు పలువురు సీనియర్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇథనాల్ శానిటైజర్ల దుర్వినియోగంపై ఆందోళన

ప్రస్తుతం ఈ మినహాయింపును కొందరు దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. విజయవాడ నగరంలో మద్యానికి బదులుగా ఇథనాల్ ఆధారిత హ్యాండ్ శానిటైజర్లను కొందరు వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో తనిఖీలు, దాడులు జరిపి కొన్ని రిటైల్ మెడికల్ షాపులు ఇథనాల్ ఆధారిత శానిటైజర్లను పెద్ద మొత్తంలో విక్రయించినట్లు గుర్తించామన్నారు. విజయవాడ పటమటలోని సాయి వెంకటేశ్వర ఫార్మసీ అండ్ సర్జికల్‌కు సంబంధించిన బిల్లులను స్వాధీనం చేసుకున్నామని, వాటి ప్రకారం ఏడాదిన్నర కాలంలో సుమారు 33,586 ఇథనాల్ 70 శాతం వీవీ (100 ఎంఎల్) సీసాలను కొనుగోలు చేసి విక్రయించినట్లు వెల్లడైందని పేర్కొన్నారు.
ఈ వ్యవహారంలో మూడు రిటైల్ విక్రయ కేంద్రాలపై లైసెన్స్ రద్దు చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. కొవిడ్ సమయంలో ఇచ్చిన మినహాయింపు నాలుగేళ్ల తర్వాత కూడా కొనసాగుతుండటం వల్ల ఇథనాల్ ఆధారిత శానిటైజర్ల దుర్వినియోగానికి అవకాశం ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో ఇథనాల్ లేని ప్రత్యామ్నాయ హ్యాండ్ శానిటైజర్లు అందుబాటులో ఉన్నందున.. ఇథనాల్ ఆధారిత శానిటైజర్ల నిల్వ, విక్రయాలకు సేల్ లైసెన్స్ నుంచి ఇచ్చిన మినహాయింపును ఉపసంహరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని పీ. అరుణ్‌బాబు కోరారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎస్.ఓ.245(ఈ) నోటిఫికేషన్‌ను సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### శ్రావణ చివరి శుక్రవారం వేళ ఇంద్రకీలాద్రిపై వైభవంగా

# సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



**రెండు విడతలుగా ఆర్జిత సేవ మరియు ఉచిత వ్రతాల నిర్వహణ**

**600 మందికి పైగా మహిళలకు ఉచిత అవకాశం**

**పూజా సామగ్రి, తీర్థప్రసాదాలు, ఉచిత దర్శన ఏర్పాట్లపై భక్తుల హర్షం**

ప్రజా భూమి ప్రతినిధి విజయవాడ

విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ మల్లికార్జున మహా మండపంలో నిర్వహించిన 'సామూహిక వరలక్ష్మీ వ్రతాలు' అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి.ఆలయ వేద పండితులు, అర్చకుల మంత్రోచ్ఛారణల నడుమ ఉదయం 7:00 గంటల నుండి 9:00 గంటల వరకు మొదటి విడతగా 'ఆర్జిత సేవ' రూపంలో, అనంతరం ఉదయం 10:00 గంటల నుండి 11:30 గంటల వరకు రెండవ విడతగా 'ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతం' శాస్త్రోక్తంగా నిర్వహించబడ్డాయి.ఆర్థిక స్తోమతతో సంబంధం లేకుండా నిరుపేద మహిళలు కూడా అమ్మవారి సన్నిధిలో వ్రతం ఆచరించేలా దేవస్థానం చేపట్టిన చొరవతో 600 మందికి పైగా మహిళలు ఉచిత సామూహిక వ్రతంలో పాల్గొన్నారు. వ్రతంలో పాల్గొన్న ప్రతి ఒక్క మహిళకు అవసరమైన పూజా సామగ్రిని దేవస్థానమే ఉచితంగా సమకూర్చింది. వ్రతం ముగిసిన అనంతరం పసుపు-కుంకుమలు, రవికె వస్త్రం, గాజులు, శ్రీ అమ్మవారి ప్రసాదాలను అందజేయడంతో పాటు ప్రత్యేక క్యూ లైన్ ద్వారా శ్రీ దుర్గమ్మ ఉచిత దర్శన భాగ్యాన్ని కల్పించారు. దేవస్థానం చేసిన ఈ విశేష ఏర్పాట్లపై మహిళా భక్తులు విశేష హర్షం వ్యక్తం చేశారు.ఈ సామూహిక పూజల్లో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) సతీమణి అంజలి సామాన్య మహిళలతో కలిసి భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. అనంతరం ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ మహా మండపానికి విచ్చేసి వరలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఈవో వి.కె. శీనా నాయక్ మాట్లాడు తూ.."ధనిక, పేద అనే తేడా లేకుండా భక్తులందరికీ అమ్మవారి దివ్య సేవలో భాగస్వామ్యం కల్పించాలనే సము న్నత లక్ష్యంతో మొదటి విడత ఆర్జిత సేవగా, రెండో విడతలో 600 మందికి పైగా మహిళలకు



ఉచితంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించాము. సనాతన ధర్మ పరిరక్షణకు, హిందూ ధర్మ ప్రచారానికి, భారతీయ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు ఇటువంటి సామూహిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయి" అని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్య వి. శివ ప్రసా ద్ శర్మ,వైదిక కమిటీ సభ్యులు వి. శ్రీధర్ శర్మ,ఫెస్టివల్ సహాయకార్యనిర్వహణాధికారి డాక్టర్ కె. గంగాధర్,పర్యవేక్షకులు హేమ దుర్గాంబ , సీనియర్ అసిస్టెంట్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# రూ. 1,800 కోట్ల బిజినెస్ వృద్ధి..

## పి ఎ సి ఎస్ కంప్యూటరీకరణ, యూపీఐ తో కేడీసీసీ బ్యాంక్‌లో నూతన అధ్యాయం

**శేరిలక్ష్మీపురం నూతన కేడీసీసీ బ్యాంక్ బ్రాంచిని ప్రారంభించిన మాజీ మంత్రి, బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ (కేడీసీసీ బ్యాంక్) రూ రూ రూ రూ విప్లవాత్మక మార్పులతో గ్రామీణ ప్రాంతాల్లో రికార్డు స్థాయి ప్రగతి సాధిస్తోంది. కృత్తివెన్ను మండలం లక్ష్మీ పురం గ్రామంలో ఏర్పాటు చేసిన శేరిలక్ష్మీపురం నూతన కేడీసీసీ బ్యాంక్ బ్రాంచిని మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, పెడన శాసనస భ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ తో కలిసి ఘనంగా ప్రారంభించారు.ముఖ్య విశేషాలు & ఆధునిక సంస్కరణలు:రూ. 1,800 కోట్ల మేర పెరిగిన వ్యాపారం:తాను కేడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బ్యాంక్ మొత్తం వ్యాపారాన్ని రూ. 1,800 కోట్ల మేర పెంచామని చైర్మన్ నెట్టెం రఘురామ్ వెల్లడించారు. రైతులు, ఖాతాదారులకు వేగవంతమైన, ఆధునిక సేవలందించడమే లక్ష్యంగా బ్యాంకింగ్ వ్యవస్థలో కీలక సంస్కరణలు చేపట్టామ న్నారు.PACS కంప్యూటరీకరణతో పారదర్శకత:ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (PACS) కంప్యూటరీకరణ ద్వారా రైతులకు రుణాలు, డిపాజిట్లు, ఇతర సేవలను వేగంగా, పారదర్శకంగా అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. PACSలు కేవలం రుణాలకే పరిమితం కాకుండా గ్రామీణ ఆర్థిక కేంద్రాలుగా రూపుదిద్దుకుంటున్నాయని పేర్కొన్నారు.దేశంలోనే తొలిసారిగా PACSలలో UPI సేవలు:సహకార రంగంలో డిజిటల్ విప్లవానికి నాంది పలుకుతూ PACS స్థాయిలో UPI సేవలను ప్రవేశపెట్టిన దేశంలోనే మొదటి బ్యాంక్‌గా కేడీసీసీ బ్యాంక్ ప్రత్యేక గుర్తింపు సాధించిందని హర్షం వ్యక్తం చేశారు.





**మహిళా సాధికారత - రూ. 2.50 కోట్ల రుణాల పంపిణీ:**

కార్యక్రమంలో భాగంగా బంటుమిల్లి బ్రాంచి పరిధిలోని డ్వాక్రా మహిళా సంఘాలకు రూ. 2.50 కోట్ల విలువైన రుణాలను పంపిణీ చేశారు. మహిళా సంఘాలకు స్వయం ఉపాధి, చిన్నతరహా వ్యాపారాలు, కుటుంబ అభివృద్ధికి అవసరమైన రుణ సౌకర్యాలను సకాలంలో అందిస్తూ కేడీసీసీ బ్యాంక్ కొండంత అండగా నిలుస్తోందని చైర్మన్ స్పష్టం చేశారు.

**సహకార వ్యవస్థతోనే గ్రామీణ ఆర్థికాభివృద్ధి:**

ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి, రైతుల సంక్షేమానికి PACSలు, సహకార బ్యాంకులు ఎంతో కీలకమైనవని తెలిపారు.
సహకార సంఘాల పాలకవర్గాలు బాధ్యతాయుతంగా పనిచేసి రైతులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. శేరిలక్ష్మీపురం బ్రాంచి ప్రారంభంతో లక్ష్మీపురం మరియు పరిసర ప్రాంతాల రైతులకు, ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువవుతాయన్నారు.
హాజరైన ప్రముఖులు:ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ సీఈఓ శ్యామ్ మనోహర్, జీఎం చంద్రశేఖర్, కూటమి నాయకులు, కార్యకర్తలు, సహకార సంఘాల ప్రతినిధులు, అధికారులు, రైతులు, డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## జవ్వారుపేటలో అంగరంగ వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



ఉత్సాహంగా పాల్గొన్న

**భక్తులు, జనసేన నాయకులు**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

జనసేన పార్టీ నగర అధ్యక్షుడు, శ్రీకృష్ణ కమిటీ చైర్మన్ గడ్డం రాజు నివాస ప్రాంగణంలో శ్రీ కృష్ణా ష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిం చారు. శుక్రవారం జవ్వారుపేటలో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో తొలిగా విఘ్నేశ్వర పూజతో వేడు కల ను ప్రారంభించారు. అనంతరం శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని స్వామి వారికి విశేష పూజ లు, దివ్యాలంకరణలు గావించారు.ఈ కార్యక్ర మానికి జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ, నగర ప్రముఖులు వేమూరి నాగా ర్జున, గొర్రెపాటి గోపీ చంద్, బత్తిన దాసు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కృ ష్ణాష్టమి విశిష్టతను, ఆధ్యా త్మిక ప్రాముఖ్యతను భక్తులకు వివరిం చారు.
సాంస్కృతిక కార్యక్రమాలు - అన్నదానం:పూజా కార్యక్రమాల అనంతరం భక్తులను అలరించేలా కోలాటం, శ్రీకృష్ణ లీలామృత గాన కార్యక్రమాలు నిర్వహిం చారు. మధ్యాహ్నం విచ్చేసిన భక్తులందరికీ భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు



చేశారు.ఉట్టికొట్టే పోటీలు - నగదు బహుమతులు: సాయంత్రం యువత కోసం ప్రత్యేకంగా ఉట్టికొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశామని చైర్మన్ గడ్డం రాజు తెలిపారు. విజేతలైన యువకులను ప్రోత్సహించేందుకు నగదు బహు మతులు ప్రకటించారు:ప్రథమ బహుమతి: ₹3,000/-ద్వితీయ బహుమతి: ₹2,000/-తృతీయ బహుమతి: ₹1,000/-యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని దిగ్విజ యం చేయాలని ఆయన ఆహ్వానించారు.నాయకులకు సత్కారం:కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులు బండి రామకృష్ణ, వేమూరి నాగార్జున, గొర్రెపాటి గోపీచంద్, బత్తిన దాస్ లను గడ్డం రాజు శాలువాలతో ఘనంగా సత్క రించి, శ్రీస్వామి వారి తీర్థప్రసాదాలు అందజే శారు.ఈ కార్యక్రమంలో యువ న్యాయవాది గడ్డం విజయలక్ష్మి, పిప్పళ్ళ కాంతారావు, ఫణి కుమార్, గోకుల్ శివ, అంకరాజు, వేమూరి మహర్షి, తోట రాజేష్, మహమ్మద్ సమీర్, వీరబాబు, కర్రి మహేష్, పినిశెట్టి వేణు, సుదర్శన్, మహమ్మద్ భాషి, తోట పవన్, ఉడుముల బుజ్జి, రాధిక, జన్ను నాగరాజు, గంపల కృష్ణ, కొక్కు లక్ష్మణ, రామ్ జ్యోతి, పలనియప్ప రెడ్డి, కోటి, చలమలశెట్టి రమేష్, జొన్నల ప్రసాద్, పరింకాయల లక్ష్మణ, బొమ్మసాని హరీష్, రామారావులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు జ్యోతి, సురేష్, విజయ, ఇందిర, రజిని, వాణి, సుమంత్, కృష్ణ, జనసేన పార్టీ కుటుంబ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గమ్మ వారికి స్వర్ణాభరణాలు సమర్పించిన భక్తురాలు



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారికి శ్రావణ మాసం చివరి శుక్రవారం పురస్కరించుకుని భక్తులు భక్తిశ్రద్ధలతో స్వర్ణ కానుకలను సమర్పించారు.విజయవాడ,బ్యాంక్ కాలనీకి చెందిన భక్తురాలు గుంటుపల్లి ప్రణవి శుక్రవారం దేవస్థాన కార్యాలయానికి విచ్చేసి అమ్మవారి మూలవిరాట్ అలంకరణ నిమిత్తం సుమారు 22.800 గ్రాముల బంగారు ఆభరణాలను కానుకగా చైర్మన్ శ్రీ బొర్రా రాధాకృష్ణ సమక్షంలో అందజేశారు.బంగారు బొట్టు (నవరత్నాలు, డైమండ్స్ పొదిగినది),బంగారు నత్తు (డైమండ్స్, ఎరుపు & పచ్చ రాళ్లు పొదిగినది),బంగారు బులాకి (డైమండ్స్, ఎరుపు & పచ్చ రాళ్లు, ముత్యం పొదిగినది).దేవస్థాన అధికారులు ఆలయ నిబంధనల ప్రకారం ఆభరణాలను స్వీకరించి రశీదును అందజేశారు. అనంతరం దాతకు శ్రీ అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదాలు మరియు శేషవస్త్రాలను బహూకరించారు.

## 43 వ డివిజన్ లో వైభవంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**చెవుల ఆంజనేయులు ఆధ్వర్యంలో 4వేల మందికి అన్న ప్రసాదం వితరణ**

**మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనిసరావు**



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

శ్రీకృష్ణుడు భగవత్ గీతా సారాంశాన్ని అందరూ అవలంభించాలని అప్పుడే మానవజాతి మనుగడ సన్మార్గంలో నడుస్తుందని మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 43 వ, డివిజన్ లో శ్రీకృష్ణా సేవా సమితి 17 వ వార్షికోత్సవ సందర్భంగా శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో అయన పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన పై విధంగా పిలుపునిచ్చారు.గత 12,ఏళ్లుగా నిరాటంకంగా అన్న ప్రసాదం వితరణ చేస్తున్న లక్ష్మి వెంకటేశ్వర ఏజన్సీస్ అధినేత, సామజిక సేవా కార్యకర్త చెవుల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఏడాది తనకు ఆ భగవంతుడు ఈ అవకాశం కల్పించడం తన అదృష్టం భావిస్తున్నానన్నారు. అయన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 4 వేల మందికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని



వెల్లంపల్లి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు. శ్రీ కృష్ణా సేవా సమితి అధ్యక్షులు మల్లెబోయిన కొండలరావు,కార్యదర్శి చెల్లగడ్ల దుర్గారావు, ఉపాధ్యక్షులు తాటి శ్రీకాంత్, చెన్నుబోయిన ప్రసాద్, ఎమ్ మురళి, తదితరులు ఈ వేడుకలు నిర్వహించారు.

## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు సూపర్ సక్సెస్

**కార్యక్రమాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు**

**అడ్డంకులు సృష్టించినా వెనకడుగు వేయని అభిమానులే మా బలం జనసేన నాయకుడు కొట్టే వెంకట్రావు**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మచిలీపట్నంలో నిర్వహించిన భారీ ర్యాలీ, బహిరంగ సభను దిగ్విజయం చేసిన అభిమానులు, కార్యకర్తలు మరియు నాయకులకు జనసేన పార్టీ సీనియర్ నాయకులు కొట్టే వెంకట్రావు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనసేన పార్టీ పిలుపుమేరకు వేలాదిగా తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయడం చాలా సంతోషకరమని అన్నారు. పవన్ కళ్యాణ్ వేడుకలను అడ్డుకోవడానికి కొంతమంది కావాలనే కుట్రలు, ప్రయత్నాలు చేసినప్పటికీ.. ఎన్ని అవరోధాలు ఎదురైనా చివరి వరకు క్రమశిక్షణతో, పట్టుదలతో నిలబడిన అభిమానులే జనసేన అసలైన బలమని కొనియాడారు. కార్యకర్తలు చూపిన ఉత్సాహం, అంకితభావం పార్టీపై ఉన్న చెక్కుచెదరని నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తమ ప్రయాణం ఆగదని, అధినేత పవన్ కళ్యాణ్‌కు కొండంత అండగా నిలబడటమే తమ ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. పార్టీ కోసం రాత్రింబవళ్లు కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు శాయన శివయ్య, మాదివాడ రాము, పృథ్వీ ప్రసన్న, వాలిశెట్టి మల్లి, డాక్టర్ మాధవి, అలాగే బిజెపి నాయకులు పంతం గజేంద్ర తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కూటమి పార్టీలో స్థానిక పట్లు

- 5మేయర్ సీట్లపై జనసేన కన్ను
- 14 మందితో జనసేన లోకల్ బాడీ కమిటీ
- డైలమాలో పడ్డ టిడిపి

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**


రాబోయే స్థానిక ఎన్నికలలో కూటమి పార్టీలో టిడిపి, జనసేన,బిజెపి పార్టీలకు ఎవరికి ఎన్ని సీట్లు కేటాయిస్తారనేది ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చర్చి నియాసం గా మారింది. దీనికోసం ఆయా పార్టీల నాయకులు కార్యకర్తలు లో మాకిన్ని వస్తాయి మాకు అన్ని వస్తాయి అని గొప్పలు చెప్పుకునే పరిస్థితి నెలకొంది. ఇప్పుడు స్థానిక ఎన్నికలులో సాధించిన పట్టును బట్టి రాబోయే 2029 ఎన్నికలు బలాబలాలు పెరుగుతాయని కూటమి పార్టీల్లో నేతలు భావిస్తున్నట్లు తెలిసింది.

**జనసేన పార్టీ వ్యూహం ఇలా:**

జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించినట్లు సమాచారం. ఇప్పటికే 2024 అసెంబ్లీ ఎన్నికల ఫార్ములా స్థానిక ఎన్నికల్లో కూడా అంగీకరించేది లేదని తాము కోరిన, జనసేనకు అనువైన స్థానిక సంస్థల్లో తమ అభ్యర్థుల్ని నిలబెట్టాలని ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. దీనిలో భాగంగానే గుంటూరు,విజయవాడ, తిరుపతి,ఏలూరు, తదితర మేయరు పదవులను, 35 శాతం స్థానిక సంస్థల అయిన మున్సిపాలిటీలు, జడ్పీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు జడ్పిటిసిలు సర్పంచులు పదవులను కేటాయించాలని అదేవిధంగా ఈస్ట్,వెస్ట్,కృష్ణ, విశాఖ ప్రాంతాల్లో 50% స్థానిక సంస్థల పదవులను కోరే ఆలోచనలో జనసేన ఉన్నట్లు తెలిసింది. ఈసారి స్థానిక పదవుల్లో జనసేన పార్టీ యువతకు పెద్దపేట వేసే అవకాశం కనిపిస్తుందని అంటున్నారు. జనసేన దృష్టంతా యూత్ పై టార్గెట్ పెట్టినట్టు సమాచారం. యూత్ ద్వారా పార్టీని మరింత బలవృతం చేయాలని ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. దీనికోసం జై కొట్టు కార్యక్రమాన్ని కూడా యూత్ కోసం ప్రారంభించిన విషయం తెల్సిందే.

**14 మంది సభ్యులతో జనసేన లోకల్ బాడీ ఎలక్షన్ కమిటీ నియామకం:**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్ల ద్వారా జనసేన పార్టీని పూర్తిస్థాయి బలోపేతానికి జనసేన పార్టీ అధినాయకత్వం ఎమ్మెల్యేలు ఎంపీలు మంత్రులు సీనియర్ నాయకులు తో కూడిన 14 మంది సభ్యులను జనసేన లోకల్



బాడీ ఎలక్షన్ కమిటీ నియమించినట్లు తెలిసింది. ఈ కమిటీలో ఎంపీ బాలసౌరి, మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, సీనియర్ నాయకులు కొటికలపూడి గోవిందరావు తదితరులు తో కూడిన14 మంది సభ్యులు ఉన్నట్లు తెలిసింది. మీరంతా కూడా 175 నియోజకవర్గాల్లో ఎక్క డెక్కడ జనసేన పార్టీకి గెలుపు గుర్రాలు ఉన్నారు అనే విషయం తేల్చి అధినేత పవన్ కళ్యాణ్ కు నివేదిస్తారని సమాచారం.

**డైలమాలో పడ్డ టిడిపి:**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనకు సీట్లు కేటాయింపులులో టిడిపి డైలమాలో పడ్డట్టు సమాచారం. అంగీకరిస్తే ఒక నష్టం అంగీకరించకపోతే ఒక నష్టం అన్నట్లుగా టిడిపి అధిష్టానం ఉందని తెలుస్తోంది. కూటమి ఐక్యత చెడకుండా ఉండాలంటే ఏం చేయాలని ఆలోచనలో టిడిపి అధిష్టానం పడ్డట్టు తెలిసింది.ఇప్పటికే మంత్రి నారా లోకేష్ జనసేనకు 15% సీట్లు ఇస్తానంటే, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ కూడా అసెంబ్లీ ఎన్నికల ఫార్ములా ఇక్కడ లేదని, ఎక్కడ జనసేన పట్టు ఎక్కువ ఉంటే అక్కడ తప్పక జనసేన పోటీ చేస్తుందని చెప్పడంతో ఈ రెండు పార్టీల మధ్య స్థానిక సీట్ల విషయమై కొంత కోల్డ్ వార్ కూడా జరుగుతుంది అని చెప్పక తప్పదు. టిడిపి ఉన్నచోట స్థానిక ఎన్నికల ద్వారా పార్టీని బలోపేతం చేసుకోవాలని జనసేన భావిస్తుండగా టిడిపి కూడా అదేవిధంగా జనసేన పార్టీ ఉన్నచోట్ల కూడా టీడీపీ పార్టీని బలోపేతం చేసుకోవాలని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పావులు కదుపుతున్నట్లు సమాచారం. అయితే స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడ్డాక ఏ పార్టీకి ఎన్ని సీట్లు కేటాయిస్తారు అనేది, ఎంత మేరకు ఎవరు షరతులు కు లోబడి సీట్లు ఎన్ని ఇచ్చిన తగ్గి అంగీకరిస్తారని వేచి చూడాల్సిందే మరి.

## శ్రీకృష్ణుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

-జన్మాష్టమి సందర్భంగా పలు ఆలయాల్లో మంత్రి కొలుసు పార్థసారథి ప్రత్యేక పూజలు



**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

ఆగిరిపల్లి మండలంలోని ఆగిరిపల్లి, శోభనాపురం, ఆడివినెక్కలం, వడ్లమాను గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లోని శ్రీకృష్ణ ఆలయాల్లో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీకృష్ణుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, సకాలంలో వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. దేవాలయాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు పునాదులని, ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా సమాజంలో ఐక్యత, చైతన్యం పెంపొందుతాయని పేర్కొన్నారు. దేవాలయాల అభివృద్ధితో పాటు సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం ఆలయ అభివృద్ధికి మంత్రి తన సొంత నగదు రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్నారి వైద్యం కోసం రూ.2.77 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు



**ప్రజా భూమి ప్రతినిధి-బుట్టాయగూడెం**

రాజమండ్రిలో వైద్య చికిత్స పొందుతున్న ఒక చిన్నారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక సహాయంగా రూ. 2.77 లక్షలు మంజూరైనట్లు ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ముప్పినవారి గూడెంకు చెందిన చిన్నారి మేకరబోయిన గౌతమి తీవ్ర అనారోగ్యంతో రాజమండ్రిలోని మ్యాగ్నా మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ లో చికిత్స పొందుతుంది. ఆ చిన్నారి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ. 2.78 లక్షల ఎల్ వో సి ని స్థానిక సింగన్నపల్లి కాలనీలోని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ నియోజకవర్గ ఇన్ఛార్జ్ బొరగం శ్రీనివాసులు చేతుల మీదుగా బాలిక కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా బొరగం మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య రక్షణ, అత్యవసర వైద్య సహాయం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేద కుటుంబాలకు ఎంతో భరోసానిస్తుందని శ్రీనివాసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గం ఇంచార్జ్, పోలవరం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కొండేపాటి రామకృష్ణ, పిల్లి అరవాల రాజు, మానికల శ్రీను, జిల్లా టీడీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మనెల్లి బాలు, జారం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## 1500 మందితో సామూహిక శ్రావణమాస వరలక్ష్మీ వ్రతం పూజలు



**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

పాలకొల్లు లో వేంచేసి ఉన్న శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు తేదీ 4. 9.2026 శ్రావణ మాస శుక్రవారం సామూహిక శ్రావణమాస వరలక్ష్మి వ్రతం పూజలకు భక్తులు సుమారుగా 1500 మంది హాజరైనారు.బ మిడిపాటి వెంకన్న , మద్దూరి సూరిబాబు , ప్రధాన అర్చకులు కిష్టప్ప , అనిల్ , అర్చకులు వీరబాబు , భక్తుల చేత పూజలు చేయించి వారికి తీర్థప్రసాదాలు అందజేసినారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు ఆలయ చైర్మన్ మీసాల రామచంద్ర రావు, ఆలయ ధర్మకర్తలు ఉప్పలపు దుర్గా పెద్దిరాజు హో తా ప్రవాళ నాళము నాగ వెంకట సురేఖ, పినిశెట్టి శ్రీనివాస్ కొండేటి సూర్యనారాయణ పెనుమెచ్చ శ్రీదేవి బాసిన అప్పల నాగ సత్యనారాయణ వందరపు కుమారి నీ లా పు సింహాచలం, నీలాపుమని, దాతలు, ఆలయ సూపరింటెండెంట్ వాసు, సిబ్బంది పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక కృషి

### దేవరపల్లి శివారు తిమ్మప్పదొడ్డిలో రూ.20 లక్షలతో నిర్మించిన ఎంపీపీ పాఠశాల భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు.

**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట**



కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు, విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేందుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలోని దేవరపల్లి శివారు, తిమ్మప్పదొడ్డిలో మండల ప్రజా పరిషత్ నిధులతో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన భవనంలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలపై చిన్నచూపు ఉండేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పాఠశాలలను అభివృద్ధి చేస్తోందన్నారు. అందువల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా ప్రతిభ కనబరుస్తూ మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## అవుట్సోర్సింగ్ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలి

### ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ ప్రవీణ్ కు వినతిపత్రం.

**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**

హెల్త్ మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్టుమెంటు పరిధిలో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ పారామెడికల్ ఎంప్లాయిస్ సమస్యలతో పాటు ప్రధాన డిమాండ్లు పరిష్కారం కోరుతూ రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ ప్రవీణ్ కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈమేరకు హెల్త్ మెడికల్ మరియు ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్టుమెంటు పరిధిలో డిఎంఇ, డి పి హెచ్, డి ఎస్ హెచ్ విభాగాలలో పలు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నప్పటికి సుప్రీంకోర్టు ఆదేలమేరకు సమాన పనికి సమాన వేతనం అమలుచేయాలని ఆరోగ్యశాఖలో డీఎస్సీ సెలక్షన్ కమిటీ ద్వారానే ఎంపిక చేయడం జరుగుతుందని ఇందులో కొన్ని విభాగాలలో 3 సంవత్సరాలు పూర్తయిన వారికీ రెగ్యులర్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.అదేవిధంగా అవుట్సోర్సింగ్ ఉద్యోగులు 5 సంవత్సరాలు పూర్తి అయినా వారికీ రెగ్యులర్ చేయాలని కోరారు. అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ తో పాటు సెర్ఫ్, మెప్మా, ఉద్యోగులకు అమలు పరిచే హెచ్ ఆర్ పాలసీ ని అందరికి అమలు చేయాలని కోరారు.పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలని రెగ్యులర్ ఉద్యోగుల నియామక ప్రక్రియలో అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు బదిలీల విషయంలో వెయిటేజీ కల్పించాలని అన్నారు.రెగ్యులర్ ఉద్యోగుల వలె అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా సాధారణ , మెడికల్ సెలవులు అమలు చేయాలని సంవత్సరానికి ఒకసారి ఇంక్రిమెంట్ కనీసం రెండు వేల రుపాయాలు పెంచాలని కోరారు .అవుట్సోర్సింగ్ ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబానికి 50 లక్షల ఎక్సగ్రెసివ్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు .సీనియారిటీ మేరకు అర్హతను బట్టి పదోన్నతులు కల్పించాలని అవుట్సోర్సింగ్ ఉద్యోగులకను రెగ్యులర్ చేసేంత వరకు గ్రాస్ శాలరీ ఇవ్వాలని ఓటిఎకు కొన్నిచోట్ల 18,5000 రూపాయల జీతం ఇస్తున్నారని,మరికొన్ని చోట్ల 15,000 రూపాయల జీతం ఇస్తున్నారని అన్ని చోట్ల ఒకే విధమైన జీతం అమలు చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో పలువురు అవుట్సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పెద్దమటపల్లి పంచాయతీ అగ్రికల్చర్ అసిస్టెంట్ పెన్షన్ సొమ్ముతో పరార్

**ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.**



మండలంలోని పెద్దమటపల్లి పంచాయతీలో అగ్రి కల్చర్ అసిస్టెంట్ గా పని చేస్తున్నటు వంటి సిబ్బంది, తమ్మాయిపేట గ్రామానికి సంబంధించిన 19 మంది పెన్షన్ సొమ్మును ఒకటో తారీఖున వారితో బయోమెట్రిక్ ద్వారా తంబు వేపించి సొమ్ము ఇవ్వకుండా రెండు రోజుల తర్వాత ఇస్తాను అనిచెప్పి వెళ్లిపోవడం జరిగింది. పెన్షన్ బాధితులు నాలుగు రోజులుగా ఎదురుచూస్తున్నప్పటికీ ఇంకా పంపిణీ చేయకపోయేసరికి అనుమానం వచ్చి స్థానిక ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్ దృష్టికి తీసుకురాగా, నేరుగా ఆయన గ్రామాన్ని సందర్శించి పెన్షన్ రాని బాధితులతో మాట్లాడారు. ఉన్నత స్థాయి అధికారులు తక్షణమే పెన్షన్ బాధితులకి తిరిగి పెన్షన్ సొమ్మని ఇప్పించాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ పెన్షన్ సొమ్ము మొత్తం కూడా 94 వేల రూపాయలుగా తేలిందని, ఇటువంటి సంఘటనలు మరొకసారి జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఇది ఒకటే కాకుండా చాలా మంది రైతుల దగ్గర సబ్సిడీ ఇంజన్లు ఇప్పిస్తానని ఒక్కొక్కరి వద్ద 10.వేల రూపాయలు తీసుకోవడం జరిగిందని, వారికి కూడా తగు న్యాయం చేయాలనీ ఎంపీటీసీ డిమాండ్ చేశారు. ఇటువంటి సిబ్బందిని తక్షణమే సస్పెండ్ చేసి మరొక సారి జరగకుండా చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుర్రం బాబురావు, సిక్కాల పద్మారావు, ముసురు భూపతి, పండ సుబ్బారావు, ముసుర్ రామారావు, బాధితులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా మధుర మీనాక్షి.



**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**

రామచంద్రపురంలో శ్రీమతి ఇందిరాగాంధీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, చాకలిపేట నందు పనిచేస్తున్న సుగంధం మధుర మీనాక్షి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమె ఉత్సాహంతో విద్యార్థినీవిద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చక్కగా బోధించడం వంటి తదితర విషయాల్లో ఈమె అవార్డు దక్కింది. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన సందర్భంగా ఎంఈఓ లు ఎం. శ్రీనివాస్, వి. నాగేశ్వరి, ఇందిరాగాంధీ మున్సిప ల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ వివి సత్యనారాయణ మూర్తి, ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయుడు జీ.వి.హనుమాన్, టీచర్లు జి. గిరిజామణి, కె. విజయ కుమారి, సిహెచ్. శైలజ, విద్యార్థులు, తల్లిదండ్రులు, పలువురు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

## మోడరన్ హైస్కూల్లో వైభవంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.**



రామచంద్రపురం పట్టణంలో ఎస్ ఎం టి జిఎండి మోడరన్ హైస్కూల్ నందు శుక్రవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అకాడమిక్ డైరెక్టర్ ఆర్.ఉమాదేవి ఆధ్వర్యంలో సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ప్రత్యేకించి చిన్నికృష్ణ, గోపికమ్మల వేషధారణలో చిన్నారులు చూపరులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు మాట్లాడుతూ శ్రీకృష్ణుడు ప్రేమకు, ధర్మానికి, లీలకు ప్రతిరూపమైన జగద్గురువు అని,భగవద్గీత ద్వారా కర్మయోగ రహస్యాన్ని బోధించి మానవాళికి జీవన పరమార్థాన్ని చూపాడని కొనియాడారు. బాల్యంలో వెన్నదొంగగా, యవ్వనంలో రాధామనోహరుడిగా, కురుక్షేత్రంలో పార్థసారథిగా ప్రతి రూపంలోనూ దివ్యత్వాన్ని చాటాడని కీర్తించారు. అకాడమిక్ డైరెక్టర్ ఆర్ ఉమాదేవి మాట్లాడుతూ మన ధర్మాన్ని, సాంస్కృతిక సాంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేయాలనే లక్ష్యంతో క్రమం తప్పకుండా ప్రతి పండుగను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. శ్రీకృష్ణతత్వం విశ్వవ్యాప్తమైనదని ఆమె పేర్కొన్నారు. అనంతరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచానికే తలమానికమైన ఆధ్యాత్మిక గ్రంథం భగవద్గీతను అందజేసిన శ్రీకృష్ణ పరమాత్ముడు నడయాడిన నేల మనదేశం అని పేర్కొన్నారు.అనంతరం హైస్కూల్ హెడ్మాస్టర్ ఎం.చిట్టిబాబు ఆధ్వర్యంలో ఉట్టు కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ కె.సాయిరాంచౌదరి, ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ సిహెచ్ రాజేష్, మోడరన్ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్లె పండుగ 3.0తో గ్రామీణాభివృద్ధి సాకారం

- దేవరపల్లిలో రూ.60 లక్షల బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ.
- మినీ గోకులం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.**

పల్లె పండుగ 3.0 కార్యక్రమం ద్వారా గ్రామీణాభివృద్ధి లక్ష్యాలను సాకారం చేస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా రూ.4,290 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దేవరపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. దేవరపల్లిలో గ్రామీణ పేదల జీవనోపాధికి దోహదపడే మినీ గోకులం (క్యాటిల్ షెడ్డు) నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.300 కోట్ల అంచనా వ్యయంతో మినీ గోకులాల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పశువులకు సురక్షితమైన వసతి కల్పించడంతో పాటు పశుపోషక రైతులకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అనంతరం దేవరపల్లి శివారులోని మట్టలదొడ్డి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.60 లక్షల వ్యయంతో



భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఎస్ఎన్సిఐ నిధులతో చేపట్టనున్న ఈ రహదారి నిర్మాణం పూర్తయితే మట్టలదొడ్డి పరిసర ప్రాంతాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడిన ఆయన, పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా చేపట్టి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్పష్టం చేశారు.

## వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

కొనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ క్షేత్రపాలకుడైన శ్రీ వేణుగోపాల స్వామి వారికి వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని సుందరంగా అలంకరించి విశేష నైవేద్యాలు సమర్పించి, మంగళహారతులు నిర్వహించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు శ్రీ వేణుగోపాల స్వామి వారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆలయంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తుల రద్దీ దృష్ట్యా దేవస్థాన అధికారులు తగిన ఏర్పాట్లు చేసి దర్శనం సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు.

## దాతల సహకారంతో ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

రావులపాలెం డిఎం కుమార్

వీల్ చైర్లను అందజేసిన తేజారెడ్డి దంపతులు



ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట.

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దాతల సహకారంతో కృషి చేస్తున్నామని రావులపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ వై.వి.వి.ఎన్. కుమార్ తెలిపారు. రావులపాలెం ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం ప్రముఖ పారిశ్రామికవేత్త చిన్నం తేజారెడ్డి, మణిహంస దంపతులు రెండు వీల్‌చైర్లను శుక్రవారం డిపో మేనేజర్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డీఎం కుమార్ మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌స్టేషన్‌లో పలు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీల్‌చైర్లు అందజేసిన తేజారెడ్డి, మణిహంస దంపతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యాల కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అచ్యుతాంబ, సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు నరసన్నపేట హెచ్‌ఎం విప్పర్తి సూర్యచంద్రం ఎంపిక

ఆత్రేయపురం మండలానికి దక్కిన అరుదైన గౌరవం.



ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం నరసన్నపేట శివారులోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని విప్పర్తి సూర్యచంద్రం 2026 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మకమైన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి అధికారిక ఉత్తర్వులు అందినట్లు మండల విద్యాశాఖ అధికారులు పి.వి. ప్రసాదరావు, ఎ. సత్యనారాయణ తెలిపారు. విద్యార్థుల విద్యా వికాసం, బోధనలో వినూత్న పద్ధతులు, పాఠశాల అభివృద్ధికి చేసిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు వరించినట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 5న గురుపూజోత్సవం సందర్భంగా అమలాపురం కలెక్టరేట్‌లో నిర్వహించే జిల్లా స్థాయి వేడుకల్లో ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల సమక్షంలో విప్పర్తి సూర్యచంద్రంకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రదానం చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ అవార్డు ఆత్రేయపురం మండలానికి గర్వకారణమని పేర్కొన్నారు.

## దేశ ప్రధాని మోదీ సేవలు వాట్సాప్ ద్వారా ప్రజలకు చేరవేయాలి

జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు.



ప్రజా భూమి ప్రతినిధి–కాజులూరు

రాష్ట్ర ప్రధాని నరేంద్ర మోడీ దేశానికి చేసే సేవలు, అభివృద్ధి, సంక్షేమం ,ప్రాజెక్టుల వివరాలను వాట్సాప్ ద్వారా ప్రజలకు చేరువేయాలని కోనసీమ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు బిజెపి శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు కాజులూరు మండల బిజెపి పదాధికారుల సమావేశం మండల అధ్యక్షులు పుణ్యమంతుల శివాజీ నేతృత్వంలో నిర్వహించారు. ఈమేరకు శుక్రవారం పదాధికారులు నెలవారి సమావేశం కాజులూరు మండలం అయితపూడి గ్రామంలో మండల ఉపాధ్యక్షులు పెద్దిరెడ్డి వీరభద్రం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు మండల ఇన్చార్జి సలాది శేఖర్ విచ్చేసారు నెలవారీ పదాదికారుల సమావేశంలో ఇంచార్జి సలాది శేకర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎలక్షన్లలో అందరూ పోటీకి సిద్ధంగా ఉండాలని తెలియజేశారు, జిల్లా ప్రధాన కార్యదర్శి వీరబాబు మాట్లాడుతూ, వాట్సాప్ ద్వారా నరేంద్ర మోడీ దేశానికి చేసే సేవలను ప్రాజెక్టులు వివరాలను గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల వద్దకు వివరించాలని కార్యకర్తలను ఆదేశించారు తద్వారా భారతీయ జనతా పార్టీ విజయం సాధించేగా కృషి చేయాలని కార్యకర్తలను కోరారు, అనంతరం బిజెపి సీనియర్ నాయకులు మండల ఉపాధ్యక్షులు పెద్దిరెడ్డి వీరభద్రంని బిజెపి శ్రేణులు దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ కే శ్రీనివాసరెడ్డి, ఆదినారాయణ తలాటం అమ్మాజీ, ముషిని ఏడుకొండలు, మండల ఉపాధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శిలు వాసంశెట్టి రామకృష్ణ, నిమ్మన రాజేష్ సాయి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు

## లొల్ల గ్రామంలో పోలీసుల "పల్లె నిద్ర" కార్యక్రమం

ప్రజలతో మమేకమైన సీఐ విద్యాసాగర్, ఎస్ఐ రాము.. సైబర్ నేరాలు, పోక్సో చట్టంపై అవగాహన.






ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట.

డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ఆదేశాల మేరకు, కొత్తపేట డీఎస్పీ ఎస్. మురళి మోహన్ సూచనలతో ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని లొల్ల గ్రామంలో శుక్రవారం రాత్రి "పల్లె నిద్ర" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రావులపాలెం రూరల్ సీఐ చి. విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్ఐ ఎస్. రాముతో పాటు పోలీసు సిబ్బంది గ్రామస్థులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని శాంతిభద్రతల పరిస్థితులు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రజల నుంచి సమాచారాన్ని సేకరించారు. ఈ సందర్భంగా నూతన చట్టాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలు, పోక్సో చట్టం, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసు శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటుందని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే కొత్త వ్యక్తుల అనుమానాస్పద కదలికలు, చెడు నడత కలిగిన వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసు శాఖకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వద్దిపర్రు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని గ్రామ సమస్యలపై పోలీసు అధికారులతో చర్చించారు.

## ఏలూరు ఎ పి డబ్ల్యూ జె ఎఫ్ అధ్యక్షుడిగా చదలవాడ ప్రతాప్

కార్యదర్శిగా కె.వి. సుబ్రహ్మణ్యం ఎన్నిక



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఏలూరు నియోజకవర్గ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏలూరు ఇండోర్ స్టేడియం సమీపంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా చదలవాడ ప్రతాప్, కార్యదర్శిగా కె.వి. సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా డి. దొరబాబు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా శరత్ కుమార్, సహాయ కార్యదర్శులుగా వి. మౌనిక, వినుకొండ బాబ్జి, కమిటీ సభ్యుడిగా సోమేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జి. ఆంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. నూతన కమిటీ జర్నలిస్టుల ఐక్యతకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లు, చిన్న పత్రికల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నాం

ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా



పట్టణ స్థానిక సంస్థల్లో వార్డులు / డివిజన్ల పునర్విభజనను సవాల్ చేస్తూ దాఖలైన 50 పిటిషన్లను కొట్టివేస్తూ గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును హృదయ పూర్వకంగా స్వాగతిస్తున్నామనీ,అసెంబ్లీ స్థానాల పెంపు సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పోలిమేర హరికృష్ణ అన్నారు. స్థానిక సమితి కార్యాలయంలో హరికృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలే పరిపాలకులు కాబట్టి ,పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల అభివృద్ధికి స్థానిక సంస్థల స్వపరి పాలకులు అవసరం అని,పాలన సంస్థలు ఫోర్సులో ఉంటేనే, అభివృద్ధికి నిధులు ప్రత్యేకంగా అదనంగా కేటాయించబడతాయని అన్నారు. 45 ఏళ్లలో అంటే, 1981నుండి,రాష్ట్ర స్థానిక పట్టణ సంస్థల ఎన్నికలను పరిగణలో తీసుకుంటే, 1986లో జరగాల్సిన ఎన్నికలు 1987లో 1992లో జరగాల్సిన ఎన్నికలు1995లో 2010లో జరగాల్సిన ఎన్నికలు 2014లో 2019లో జరగాల్సిన ఎన్నికలు 2021లో జరిగాయన్నారు. ఇలా సంవత్సరాలు, సంవత్సరాలు వాయిదాలు పడుతూ ఉంటే, స్థానిక స్వపరి పాలన సంస్థలు కుంటూ పడతాయని, సకాలంలో ఎన్నికలు జరగడమే, ప్రజాస్వామ్యానికి సరైన అర్థం విలువలు ఉంటాయని హరికృష్ణ తెలిపారు. జనాభా ప్రాతిపదికన, చట్ట నిబంధనల ప్రకారం ప్రభుత్వం చేపట్టిన పునర్విభజన 3,916 నుండి 4,843 వార్డులకు పెంపు న్యాయబద్ధమైనదని, హైకోర్టు స్పష్టం చేయడం హర్షణీయం అని హరికృష్ణ పేర్కొన్నారు. రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకులు చాట్ల సౌరియ్య మాట్లాడుతూ... కోర్టు తీర్పుతో నగర, పురపాలక ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం అయిందని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఈ తీర్పు పట్ల మేము కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ సమావేశంలో ఉండి నాగేశ్వరరావు, జిజ్జువరపు తంబి, సోదిమేల్ల చంద్రశీ చంద్రశీ, కొకిలిగడ్డ విజయ్, కరపాటి శ్రీనివాస్, పోలిమేర దుర్గారావు ,చింతాటి వెంకన్న, కటారి నాగేశ్వరరావు, పోలిమేర సురేష్ తదితరులు పాల్గొన్నారు

## గోపన్నపాలెం సెంటర్‌లో ఘోర ప్రమాదం.

–టిప్పర్ కింద పడి వ్యక్తి దుర్మరణం.



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా

దెందులూరు మండలం గోపన్నపాలెం సెంటర్‌లో శుక్రవారం సాయంత్రం విషాదకర ఘటన చోటుచేసుకుంది. టిప్పర్ కింద పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికుల సమాచారం ప్రకారం.. గోపన్నపాలెం సెంటర్‌లో వెళ్తున్న టిప్పర్ కిందకు వ్యక్తి పడిపోయినట్లు తెలుస్తోంది. టిప్పర్ చక్రాలు వ్యక్తిపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి , ప్రమాదం తీవ్రతకు మృతదేహం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనతో గోపన్నపాలెం సెంటర్‌లో ఒక్కసారిగా విషాద వాతావరణం నెలకొంది. ప్రమాదాన్ని చూసిన స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాద సంఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. మృతుడి పూర్తి వివరాలు, అతను ఏ ప్రాంతానికి చెందిన వ్యక్తి, ప్రమాదం ఎలా జరిగింది అనే విషయాలు ఇంకా తెలియాల్సి ఉంది. టిప్పర్ డ్రైవర్ పరిస్థితి, ప్రమాదానికి గల పూర్తి కారణాలపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. పోలీసుల దర్యాప్తు అనంతరం ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## నందగోకుల శ్రీ రాధాకృష్ణ స్వామి ఆలయంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు.

ప్రజాభూమి ప్రతినిధి–బుట్టాయగూడెం



స్థానిక కొత్తపేటలోని శ్రీ నందగోకుల రాధాకృష్ణ స్వామి ఆలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా శుక్రవారం ఆలయ ధర్మకర్తలు కూచిపూడి రామకృష్ణ, నాగమణి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు అనిపెద్ది రామకృష్ణ శర్మ అర్చకత్వంలో ఆలయంలోని రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని పూజాది కార్యక్రమాలలో పాలుపంచుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్న సమారాధన నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణులు, గోపికల వేషధారణతో అలరించారు. ఆలయం వద్ద సాయంత్రం చేపట్టిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ర్యాలిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా

గోపాల స్వామివారికి పంచామృతాభిషేకం, గోపూజ.. భక్తుల సందడి.



ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ర్యాలి గ్రామంలోని శ్రీ జగన్మోహిని కేశవ స్వామి శ్రీ గోపాల స్వామి వారి దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శుక్రవారం ఆధ్యాత్మిక వైభవం నెలకొంది. శ్రీ స్వామి వారి క్షేత్రపాలకులైన శ్రీ గోపాల స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనంతో ప్రారంభమైన కార్యక్రమంలో పంచామృతాభిషేకం, చందనం, నవనీతాలతో స్వామివారికి విశేష అలంకరణ చేశారు. అనంతరం సహస్రనామ పూజ, అమ్మవార్లకు కుంకుమ పూజ, గోపూజ నిర్వహించి నీరాజనం, మంత్రపుష్పాలతో మహామంగళహారతి సమర్పించారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు, దాతలు, గ్రామస్థులు పాల్గొని శ్రీ గోపాల స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమాన్ని దేవస్థాన ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, కార్యనిర్వాహణాధికారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

## గొల్లపాలెం హైస్కూల్లో ల్యాబ్ ఆన్ వీల్స్ బస్‌ని సందర్శించిన డీఈవో రమేష్



ప్రజాభూమి ప్రతినిధి–కాజులూరు

కాజులూరు మండలం గొల్లపాలెం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఇన్ఫోసిస్ వారిచే ఏర్పాటు చేసిన లాబ్ ఆన్ వీల్స్ బస్సుని కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ సందర్శించారు. బస్సులో విద్యార్థులతో డీఈవో రమేష్ కొంతసేపు ముచ్చటించి ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన కోడింగ్ విషయాలను ఏవిధంగా అవగాహన చేసుకున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు డీఈవో పలు సూచనలు జారీచేసి లాబ్ ఆన్ వీల్స్ ను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఈనెల 7వ తేదీ వరకూ గొల్లపాలెం హైస్కూల్లో ఈ లాబ్ ఆన్ వీల్స్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎంఈవో–1 డేవిడ్, గొల్లపాలెం హెచ్‌ఎం సుశీలామణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ద్రాక్షారామం శ్రీ చైతన్య స్కూల్ నందు

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

–చూపరులను ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ.



ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం.

శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకుని ద్రాక్షారామం శ్రీ చైతన్య స్కూల్ నందు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలు శ్రీకృష్ణుని వేషధారణ మరియు గోపికల వేషధారణతో అలరించారు .ఆటపాటల అనంతరం పిల్లలు ఉట్టిని కొట్టి శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . దీంతో స్కూల్లో నిర్వహించిన ఈ కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు వేసిన వేషధారణ సూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ వై వి సురేష్ పిల్లలతో పాటు తల్లిదండ్రులకు శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కన్నుల పండువగా కృష్ణాష్టమి వేడుకలు



ప్రజాభూమి ప్రతినిధి–వి.ఆర్.పురం.

మండలంలోని గ్రామ గ్రామానా, విధివిధిలో శుక్రవారం ఘనంగా కృష్ణాష్టమి వేడుకలను భక్తులు వైభవంగా జరుపుకున్నారు. హిందూ పంచాంగం ప్రకారం, ప్రతి ఏడాది శ్రావణ మాసంలో క్రిష్ణ పక్షంలో వచ్చే అష్టమి తిథి నాడు శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ పవిత్రమైన రోజున ప్రపంచ వ్యాప్తంగా జన్మాష్టమి లేదా గోకులాష్టమి వేడుకలను ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. కృష్ణుడు మనందరికీ గొప్ప దేవుడుగానే తెలుసు, ప్రతి యుగంలో ధర్మ సంస్థాపన కోసం శ్రీ మహావిష్ణువు అవతార స్వీకారం చేస్తాడని, అలాగే భీకర రాక్షసులను మట్టుబెట్టడానికి, ధర్మ యుద్ధంలో పాండవులను గెలిపించి ధర్మసంస్థాపన చేయడానికి ద్వాపర యుగంలో శ్రీమహావిష్ణువు శ్రీకృష్ణుడుగా అవతరించాడు అని పురాణ గాథలు చెబుతున్నాయి. అటువంటి కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని విఆర్ పురం మండల కేంద్రంలోని పలుచోట్ల, వడ్డీ గూడెం గ్రామంలోని పలుచోట్ల రేకపల్లి, రాజుపేట కాలనీ, బీసీ కాలనీ, సీతంపేట, శ్రీరామగిరి, చింతరేగుపల్లి తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. అలాగే రేఖపల్లి పంచాయతీ గొల్లగూడెం గ్రామంలోనీ (యాదవ కులస్తులు) శ్రీకృష్ణ ఆలయ కమిటీ వారు శ్రీ కృష్ణాష్టమి పండుగ సందర్భంగా బైకు ర్యాలీనీ ఘనంగా నిర్వహించారు. మండల ప్రజలు ఈ వేడుకలు సందర్భంగా భక్తులు పవిత్ర స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి కృష్ణునికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అలాగే చిన్నపిల్లలకు కృష్ణుని వేషం, గోపికల వేషధారణ చేసి, కృష్ణుని పాటలకు చిన్నారులు నృత్యాలు చేసే విధానం అందరినీ అలరించాయి.

# నీళ్లు లేక ఎండుతున్న చీనీ చెట్లు

## - అప్పుల పాలవుతున్న రైతన్న. రైతన్నను ఆదుకునే నాథుడే లేడా ?

ప్రజాభూమి, పుట్లూరు. పుట్లూరు మండల కేంద్రంలో నీరు లేక చీనీ చెట్లు ఎండిపోతూ ఉన్నాయి. వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోరులో నీరు లేక చీని చెట్లు ఎండిపోతూ ఉండడంతో రైతులు అప్పుల పాలై అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. పుట్లూరు మండల కేంద్రంలోని వై వీరశేఖర్ రెడ్డి తండ్రీవీ రారెడ్డి, తన ఐదు ఎకరాల పొలంలో చీనీ చేతులను గత ఎనిమిది సంవత్సరాలుగా సాగు చేస్తూ జీవిస్తూ ఉన్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి వర్షాలు సరిగా లేకపోవడంతో బోరులో వస్తున్న అరకొర నీరు కూడా రాకపోవడం తో రైతు చెట్లను కాపాడుకోవడానికి సుమారు 1400 అడుగులు బోర్లు వేసినప్పటికీ నీరు పడకపోవడం తో ఎనిమిది సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటూ వస్తున్న తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నీటి కోసం వేసిన బోర్లకు అప్పులు తీసుకురావడం జరిగిందని ఇప్పుడు ఆ అప్పులను ఎలా తీర్చాలని రైతు కన్నీటి పర్వతం అవుతున్నారు. గండికోట నుంచి పుట్లూరు చెరువుకు నీటిని తరలిస్తామని అప్పటి ప్రభుత్వం హామీ ఇవ్వడం జరిగిందని అయితే ఆ హామీలు కేవలం శిలాఫలకాలికే పరిమితం అయ్యాయి కానీ పనులు మాత్రం జరగలేదు. ఇచ్చిన హామీలు మాత్రం సంవత్సరాలు గడుస్తున్న కేవలం కాగితాలకు పరిమితం అయ్యాయి తప్ప ఆచరణలో పెట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. దీనికి తోడు ఇప్పుడు ఎల్ నీనో ప్రభావంతో వర్షాలు కూడా పడకపోవడంతో రైతులు పండ్ల తోటలను ఏ విధంగా కాపాడుకోవాలో అర్థం కాక ట్యాంకర్లతో నీటిని తోలుకుంటూ మొక్కలను కాపాడుకోవడానికి శతవిధాలుగా ప్రయత్నిస్తూ డీల పడిపోతున్నారు. ఒక్కొక్క ట్యాంకర్ కు సుమారుగా 700 రూపాయలు చెల్లించి ఒక ట్యాంకర్ నీరు నాలుగు చీనీ చెట్లకు కూడా రావడం లేదని ఇలా ఎన్ని రోజులు ట్యాంకర్లతో నీటిని తోలి చెట్లను కాపాడుకోవాలని భయాందోళనలకు గురి అవుతున్నాడు. ఇప్పటికైనా ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు వీర శేఖర్ రెడ్డి ఉన్నతాధికారులను కోరుకుంటున్నారు. హెచ్



ఎల్ సి కాలువల ద్వారా సుబ్బరాయ సాగర్ నుంచి పుట్లూరు చెరువుకు నీరు చేరాలంటే రైతులు అష్ట కష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. హెచ్. ఎల్.సి నీటిని వదిలినప్పుడు రైతులు రేయింబవళ్లు కాలువలపై తిరుగుతూ నీటిని పుట్లూరు చెరువుకు తీసుకురావడానికి అష్ట కష్టాలు పడాల్సిన అవసరం వస్తూ ఉన్నది. దీనికి కారణం హెచ్ ఎల్ సి కాలవ నుండి వచ్చే నీరు తాడిపత్రి నియోజకవర్గం నుండి సింగనమల నియోజక వర్గమైన పుట్లూరు చెరువుకు రావాలంటే నియోజకవర్గాలు వేరు కావడంతో ఎవరి ఆధిపత్యం కోసం వారు నీటిని వాడుకుంటున్నారని అవన్నీ దాటుకొని పుట్లూరు చెరువుకు రావాలంటే ఎన్నో నిద్రలేని రాత్రులను రైతులు కాలువలపై గడపాల్సి వస్తుందని అయినప్పటికీ అరకొర నీరు రావడంతో భూగర్భ జలాలు పెరగక ఉన్న బోర్లు ఎండిపోవడం జరుగుతూ ఉన్నది. పుట్లూరు మండలాన్ని కేవలం ఓటు బ్యాంకు గానే చూస్తున్నారు తప్ప అభివృద్ధి చేయడంలో అధికారులు పూర్తిగా విఫలం అవుతున్నారని రైతులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు మాత్రం మండలంలో ఉన్న అన్ని చెరువులకు నీటిని విడుదల చేస్తామని ఉచిత హామీలు ఇవ్వడం తప్ప వాటిని ఆచరణలో పెట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నాయని ఎప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు చెరువులకు నీటిని నింపి రైతులను ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కరువు మండలం గా ఉన్న పుట్లూరు మండలాన్ని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# గుత్తి యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ ఎంపీ అంబిక



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం జిల్లా గుత్తి మండలంలో గుత్తి యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి మహోత్సవంలో ముఖ్య అతిథిగా అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. శ్రీకృష్ణ పరమాత్ముని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు, కమిటీ సభ్యులు అందించిన తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం గుత్తి యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ చైర్మన్ వెంకట శివుడు యాదవ్ పాల్గొన్నారు. గుత్తి ప్రాంతంలో బీసీలు, యాదవులు అధిక సంఖ్యలో ఉన్న నేపథ్యంలో వారి అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు నా ఎంపీ అంబికా నిధుల నుంచి రూ.50 లక్షలు కేటాయించి, నిర్మాణానికి సహకరిస్తామని తెలియజేశారు. గుత్తి ప్రాంత అభివృద్ధితో పాటు యాదవులు, బీసీల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి నా వంతు కృషి ఎల్లప్పుడూ కొనసాగుతుందన్నారు. శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా గుత్తి యాదవ సోదరులు, సోదరీమణులు, ప్రజలందరికీ హృదయపూర్వక శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు. ఈ కార్యక్రమంలో సీఐ కృష్ణయ్య, మాజీ మార్కెట్ యార్డ్ శ్రీనివాస్, ఎక్స్-ఎన్‌పీటీసీ నరసింహులు, సీనియర్ నేత టీడీపీ నాయకులు ఏకాంతం, సినీ రెడ్డి, పల్ల సాంబశివయ్య, 108 శ్రీనివాసులు, ఆర్య కటిక చైర్మన్ హరికృష్ణ, పోస్టల్ శాఖ కృష్ణయ్య, రైల్వే సత్యరామ్, యాదవ సంఘం కమిటీ సభ్యులు కిష్టప్ప, పవన్, శీన, రామచంద్ర, స్థలదాత దడాల నారాయణ, తదితరులు, యాదవ సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేవాలయం నిర్మాణానికి 50,000 విరాళం

## మార్కెట్ యార్డ్ చైర్మన్ దండు శ్రీనివాసులు



ప్రజా భూమి శింగనమల

శింగనమల మండలం నాగులగుడ్డం తాండ గ్రామం లో నూతనశీగ నిర్మిస్తున్నా అంకాలమ్మ దేవాలయానికి యాభై వేల రూపాయలు 50000/- విరాళం అంధజెసిన శింగనమల మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు ఈ కార్యక్రమం లో టీడీపీ సీనియర్ నాయకులు దాసరి గంగాధర్,టీడీపీ అనంతపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి కాయల అనిల్ కుమార్ యాదవ్,విజయ్,నాగులగుడ్డం తాండ మాజీ డీలర్ సీనా నాయక్, రమేష్ నాయక్, రామచంద్ర నాయక్, చంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు

# చెరువులో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం



ప్రజా భూమి శింగనమల

శింగనమల మండల మరవకొమ్మ క్రాస్ శ్రీ రంగరాయల చెరువులో దూకి మహిళ ఆత్మహత్యకు పాల్పడింది అక్కడే ఉన్న కొందరు ప్రయాణికులు రోడ్డు పనులు చేసేవారు. ఓమహిళ చెరువులో దూకడం గమనించి వెంటనే ఆమెని చెరువులో నుంచి బయటకు తీసుకొచ్చి మహిళ ప్రాణాలు కాపాడారు. అనంతరం శింగనమల పోలీసులు స్టేషన్ కు సమాచారం తెలియజేశారు సమాచారం అందుకున్న ఏ ఎస్ ఐ అశోక్ కుమార్ నరేష్, గణేష్, సంపత్, ఘటన స్థలానికి చేరుకొని మహిళను పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చారు. మహిళ వివరాలు తాడిపత్రి పట్టణానికి చెందిన లక్ష్మీదేవి గా గుర్తించి వారి కుటుంబ సభ్యులను స్టేషన్ కి పిలిపించి ఆమెను కుటుంబ సభ్యులు అప్పగించడం జరిగింది కుటుంబ సభ్యులను పోలీసు వారు మందలించి వారికి ఆమెను సరిగా చూసుకోవాలని ఆరోగ్యం పట్ల సరిగా లేదని చెప్పారు

# రాయితీ పై ప్రత్యామ్నాయ పంట విత్తన పంపిణీ

## మండల వ్యవసాయ అధికారి ఎన్ అన్వేష్ కుమార్





ప్రజా భూమి శింగనమల

శింగనమల మండల లో ప్రస్తుతం నెలకొన్న తీవ్ర ఎల్ నీనో వర్షభావ పరిస్థితులలో పంట సాగు చేయకుండా ఖాళీ గా పెట్టుకున్న రైతుల కు ప్రత్యామ్నాయ పంట గా 80% రాయితీ పై ఉలవ విత్తనాలు మండలం లోని రైతు సేవా కేంద్రాలలో అందచేయబడుతుంది. ఉలవలు క్వింటా పూర్తి ధర రూ.7400, 80% రాయితీ ధర రూ.5920 పోగా, రైతు చెల్లించవలసిన ధర రూ. 1480.పది కేజీల బస్తా పై రైతు చెల్లించవలసిన ధర రూ. 148.మండలానికి 400 క్వింటాల్ల ఉలవలు కేటాయించటం జరిగింది. ప్రస్తుతానికి శింగనమల ఆర్ ఎస్ కె మరియు పెరవలి ఆర్ ఎస్ కె కి విత్తనం చేరింది.మిగిలిన ఆర్ ఎస్ కె లకు కూడా రెండు రోజులలో సప్లై చేయబడును.రైతులు మీ రైతు సేవ కేంద్రాలలోని వ్యవసాయ సిబ్బందిని సంప్రదించగలరు. అన్వేష్ కుమార్ మండల వ్యవసాయ అధికారి

# పచ్చని చెట్లను నరికి వేస్తున్న వ్యక్తులు

## నరికి వేస్తున్న వ్యక్తులను అడ్డుకున్న గ్రామస్తులు

## అటవీ శాఖ అధికారులు నరికివేతను అరికట్టాలి



ప్రజా భూమి శింగనమల

శింగనమల మండలం. అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా మండల కేంద్రంలోని దుర్గాంజనేయ స్వామి కొండపై పచ్చని చెట్లను మొదలకు నరికి వేస్తున్న కొందరు వ్యక్తులు. శుక్రవారం గ్రామస్తులు. మత్స్యకారులు గమనించి అడ్డుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా దేవాలయాలు. పాఠశాలలు. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో పెద్ద ఎత్తున మొక్కల పెంపకం చేపడుతుంటే. కొందరు స్వార్థపరులు తమ స్వలాభం కోసం కొన్ని దశాబ్దాల పాటు కాపాడిన చెట్లను నిట్ట నిలువునా మిషన్లతో కట్ చేయడంపై గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అటవీ శాఖ అధికారులు. రెవిన్యూ శాఖ అధికారులు స్పందించి చెట్లను నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# గంజాయి విక్రేతలు, వినియోగదారులపై ఉక్కుపాదం

## -ఇద్దరు విక్రేతలు, ఇద్దరు వినియోగదారుల అరెస్టు - 1.6 కిలోల గంజాయి స్వాధీనం

## -మరో కేసులో ఐదు ప్యాకెట్లలో 14.53 గ్రాముల గంజాయి పట్టివేత



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణం, రూరల్ ప్రాంతాల్లో గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు చేపట్టారు. గంజాయి విక్రయాలు, వినియోగానికి పాల్పడుతున్న పలువురిని అరెస్టు చేసి వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అడిషనల్ ఎస్పీ మహేష్ తెలిపారు. శుక్రవారం హిందూపురం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేసుల వివరాలను వెల్లడించారు. శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, హిందూపురం సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ మహేష్ పర్యవేక్షణలో పట్టణ, రూరల్ ప్రాంతాల్లో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై నిఘా ఉంచినట్లు తెలిపారు. హిందూపురం టూటౌన్ ఇన్‌స్పెక్టర్ సి.అబ్దుల్ కరీం, టూటౌన్ ఎస్ఐ వీరాంజనేయులు, రూరల్ ఎస్ఐ మునీర్ అహ్మద్, వన్‌టౌన్ ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. హిందూపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 87/2026 కేసులో ఎస్.గౌతమ్ (32), కె.అరుణ్ కుమార్ (27)లను అరెస్టు చేసినట్లు అడిషనల్ ఎస్పీ తెలిపారు. హిందూపురం పట్టణంలోని శ్రీకంఠపురం సమీపంలోని వివేకానంద పాఠశాల వద్ద వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా, తమ వాంగ్మూలంలో మోడల్ కాలనీకి చెందిన ఒక వ్యక్తి, ఆటోనగర్‌కు చెందిన మరో వ్యక్తి వద్ద నుంచి 14.53 గ్రాముల గంజాయిని ఐదు ప్యాకెట్లలో కొనుగోలు చేసినట్లు వెల్లడించారని చెప్పారు. అదే విధంగా హిందూపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన మరో కేసులో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 1.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మహేష్ తెలిపారు. గంజాయి విక్రయాలు, రవాణా, వినియోగానికి పాల్పడే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి విక్రయాలు, వినియోగం లేదా రవాణాకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం, వన్‌టౌన్ సీఐ ప్రసాద్ బాబు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు త్రాగునీరు అందించండి

## - భారతీయ జనతా పార్టీ శింగనమల నియోజకవర్గం కో కన్వీనర్ కుందు శ్రీనివాసులు రెడ్డి

ప్రజాభూమి, పుట్లూరు.

భారతీయ జనతా పార్టీ శింగనమల నియోజకవర్గం పుట్లూరు మండల కేంద్రములో కుందూ శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో ఒక సమావేశం నిర్వహించడం జరిగినది.ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యము శింగనమల నియోజకవర్గంలో ఉన్న వివిధ ప్రభుత్వ పాఠశాలలు, ముఖ్యంగా పుట్లూరు మండలంలో ని కస్తూరిబా బాలికల పాఠశాల మరియు మోడల్ స్కూల్ లలో ఈ పాఠశాలల్లో ఏటీ పైపుల ద్వారా నీరు వచ్చినప్పుడు మాత్రమే నీరు లభిస్తోంది. నీరు రాని సమయాల్లో విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. త్రాగునీరు, పారిశుధ్యం, భోజనం తయారీకి కూడా నీరు అందుబాటులో లేక విద్యాభ్యాసానికి ఆటంకం కలుగుతోంది. ఈ నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యలు దీర్ఘకాలికంగా ఉన్నాయి. అధికారిక లెక్కల ప్రకారం నియోజకవర్గంలోని 127 పాఠశాలల్లో 35 పాఠశాలలకు తాగునీటి సదుపాయం లేదు. ఇది విద్యార్థుల ఆరోగ్యానికి, చదువుకు ఎంతో ప్రమాదకరం.కావున, ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ సంబంధిత అధికారులను ఆదేశించి కింది చర్యలు తీసుకోవాలని కోరుచు



న్నాము. కస్తూరిబా బాలికల పాఠశాల, మోడల్ స్కూల్ మరియు నీటి సమస్య ఉన్న ఇతర పాఠశాలల ఆవరణలో భూగర్భ శాస్త్రవేత్త (జియాలజిస్ట్) ను సంప్రదించి, భూగర్భ జలాలు ఉన్న ప్రాంతాలను గుర్తించి తగిన లోతులో బోర్లు వేయించాలి.బోర్లు వేయించడంతో పాటు, ట్యాంకులు లేని పాఠశాలల్లో తాగునీటి నిల్వకు తగిన ట్యాంకులు నిర్మించాలి. శింగనమల నియోజకవర్గంలోని పాఠశాలల్లో తాగునీటి సమస్య పరిష్కారం అత్యవసరం. విద్యార్థుల భవిష్యత్తు కోసం, వారి ఆరోగ్యం కోసం ఈ చర్యలు తక్షణమే చేపట్టాలని, సంబంధిత అధికారులను ఆదేశించాలని,ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ నీ మేము కోరుతున్నాము. ఈ కార్యక్రమములో బిజెపి నాయకులు జిల్లా ఎస్సి మోర్చ కార్యదర్శి జంగం అయ్యప్ప,రామ్మోహన్, శ్రీనాథ్ యాదవ్, మధుసూధన్ రెడ్డి,రామశేఖర్ రెడ్డి,రామనాథ రెడ్డి మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఉల్లంఘనలపై పోలీసుల ఉక్కుపాదం

## -పురంలో ముమ్మరంగా విజిబుల్ పోలీసింగ్ ప్రధాన కూడళ్లలో విస్తృత తనిఖీలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలో విజిబుల్ పోలీసింగ్‌ను ముమ్మరం చేశారు. ట్రాఫిక్ సమస్యల నియంత్రణ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా ప్రధాన కూడళ్లు, రహదారులు, కీలక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ కేవీ మహేష్ పర్యవేక్షణలో శుక్రవారం సాయంత్రం వన్‌టౌన్ సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని ఓల్డ్ ఎన్టీఆర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, ఇందిరమ్మ సర్కిల్, రిజిస్ట్రార్ కార్యాలయం ప్రాంతం, సద్భావన, బీఎస్టీ, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో పోలీసులు విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు. ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలను పరిశీలిస్తూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సాయంత్రం వేళల్లో వాహన తనిఖీలను



విస్తృతం చేసి సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలపై జరిమానాలు విధించారు.

**మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి**

మైనర్లకు వాహనాలు అప్పగించి డ్రైవింగ్ చేయిస్తున్న వారిపై, మైనర్లు స్వయంగా వాహనాలు నడుపుతున్న సందర్భాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారులపై పోలీసులు విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ప్రాంతాలను గుర్తించి అక్కడి దుకాణ యజమానులు, తోపుడుబండ్ల నిర్వాహకులకు పోలీసులు సూచనలు చేశారు. రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ రాజేష్ హెచ్చరించారు. పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను అరికట్టడంతోపాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు విజిబుల్ పోలీసింగ్



కొనసాగుతుందని పోలీసులు తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాంటి మినహాయింపులు లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు.

# కృష్ణుడి వేషధారణలతో చిన్నారుల సందడి

## -ఇస్కాన్ ఆలయంలో కన్నుల పండువగా కృష్ణాష్టమి వేడుకలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

శ్రీకృష్ణుడి లీలలు, భక్తి భావం, సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ హిందూపురం పట్టణంలోని ఇస్కాన్ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు శ్రీకృష్ణుడి బాల్యలీలలు, గోపికలతో క్రీడలు, భక్తి భావాన్ని ప్రతిబింబించేలా వివిధ నృత్యాలను ప్రదర్శించారు. చిన్నారుల నృత్యాలకు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. చిన్నారుల ప్రతిభను చూసిన తల్లిదండ్రులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు.



కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని ఇస్కాన్ ఆలయ ప్రతినిధులు పట్టణంలోని వివిధ పాఠశాలల్లో ప్రత్యేక పోటీలు నిర్వహించారు. శ్రీకృష్ణుడి జీవితం, ఆయన బోధనలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేసేలా పలు పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేసి ఇస్కాన్ ఆలయ ప్రతినిధులు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విజేతలకు అభినందనలు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంస్కృతిక విలువలు, ఆధ్యాత్మిక భావనలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. కృష్ణాష్టమి సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలతో పాటు చిన్నారుల నృత్య ప్రదర్శనలు, విద్యార్థులకు నిర్వహించిన పోటీలు భక్తులు, విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# యువతను ఉద్దేశించి రాజకీయ విలువలు, అభిమానం, స్ఫూర్తి కలగలిపిన నారిశెట్టి సుప్రజ బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్

## రాజకీయ విలువలు -- యువతకు స్ఫూర్తిదాయక మార్గం

ప్రజాభూమి పోరుమామిళ్ల :
రాజకీయాలు అంటే కేవలం పదవులు, అధికారం, ఎన్నికలు మాత్రమే కాదు. ప్రజల కోసం పనిచేయడం, సమాజ అభివృద్ధికి కృషి చేయడం, న్యాయం కోసం నిలబడటం, ప్రజాస్వామ్య విలువలను కాపాడటం రాజకీయాల అసలైన లక్ష్యమని బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ ప్రజల పట్ల బాధ్యత, నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలి.అభిమానం ఉండాలి కానీ ఆ అభిమానం విలువలతో కూడి ఉండాలి. మనకు నచ్చిన నాయకుడిని అభిమానించడం తప్పు కాదు. అయితే నాయకుడి మంచి పనులను ఆదర్శంగా తీసుకుని, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో పాల్గొనడం నిజమైన అభిమానం. వ్యక్తులపై విమర్శలు చేయడం, ద్వేషాన్ని పెంచడం రాజకీయ అభిమానం కాదు. భిన్న అభిప్రాయాలను గౌరవిస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు సాగడమే నిజమైన రాజకీయ సంస్కారం. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు యువత రాజకీయాల్లోకి రావడం దేశ భవిష్యత్తుకు ఎంతో అవసరం. నేటి యువతలో ఉన్న శక్తి, ఆలోచనా విధానం, సాంకేతిక పరిజ్ఞానం సమాజానికి ఎంతో ఉపయోగపడతాయి. "మార్పు కోసం ఎదురు చూడటం కాదు... మార్పులో మనమే భాగస్వాములు కావాలి" అనే ఆలోచనతో యువత ముందుకు రావాలి.ఇవాళ దేశ నలుమూలల జరిగే విషయాలను నరేంద్ర మోడీ గారు మన్ కి బాత్ ద్వారా ప్రజలతో సంభాషిస్తున్నారు అంటే మన దేశంలో యువత ,ప్రజల పట్ల నరేంద్ర మోడీకి ఉన్న కమిట్మెంట్ అలాంటిది .ప్రజా సమస్యలను తెలుసుకోవాలి. గ్రామం, మండలం, నియోజకవర్గం అభివృద్ధిపై అవగాహన పెంచుకోవాలి. విద్య, ఉపాధి, వ్యవసాయం, మహిళా సాధికారత, యువతకు అవకాశాలు, పర్యావరణ పరిరక్షణ



వంటి అంశాలపై చైతన్యం కల్పించాలి. రాజకీయాల్లో ఎదగాలనుకునే యువతకు పదవి కంటే ప్రజాసేవ ముఖ్యం, ప్రచారం కంటే ప్రజల నమ్మకం ముఖ్యం, అభిమానం కంటే ఆత్మగౌరవం ముఖ్యం, అధికారం కంటే బాధ్యత ముఖ్యం. ఒక మంచి నాయకుడిని అనుసరించడం అంటే ఆయన మాటలను మాత్రమే అనుసరించడం కాదు; ఆయనలోని క్రమశిక్షణ, ప్రజాసేవా భావం, నాయకత్వ లక్షణాలను మన జీవితంలో ఆచరించడం.యువత చేతుల్లోనే రేపటి రాజకీయ భవిష్యత్తు ఉంది. విలువలతో కూడిన రాజకీయాలను బలపరచి, వ్యక్తిగత ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చినప్పుడే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుంది. అభిమానం మనకు ఉత్సాహం ఇవ్వాలి...
విలువలు మనకు దిశ చూపాలి...
ప్రజాసేవ మన లక్ష్యం కావాలి...
యువత నాయకత్వం మన భవిష్యత్తుకు బలం కావాలి.ఇదే నిజమైన రాజకీయ సంస్కృతి. ఇదే యువతకు స్ఫూర్తిదాయకమైన మార్పు.

# అక్కరెడ్డిపల్లె పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకున్న డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి

### గ్రామాభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుదామని పిలుపు -గ్రామస్తుల ఘన స్వాగతం..

ప్రజాభూమి పోరుమామిళ్ల :
కడప జిల్లా పోరుమామిళ్ల మండలం అక్కరెడ్డిపల్లె గ్రామంలోని శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో డిసిసి బ్యాంక్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ బద్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ సూర్యనారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు అక్కరెడ్డిపల్లె గ్రామానికి విచ్చేసిన ఆయనకు గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలేరమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకున్న సూర్యనారాయణ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం పూజలు నిర్వహించి, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ సర్పంచ్ యనమల సుధాకర్, చెరుకూరి రవి తదితరులు



కూడా పాల్గొని పోలేరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలతో కలిసి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామస్తులు సూర్యనారాయణతో పాటు ఇతర నాయకులకు సాదరంగా స్వాగతం పలికారు. ఆలయానికి విచ్చేసిన అతిథులను సంప్రదాయబద్ధంగా ఆహ్వానించి, పూజా కార్యక్రమాలు అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు నాయకులతో ఆత్మీయంగా ముచ్చటించి తమ గ్రామానికి సంబంధించిన పలు అంశాలను వివరించినట్లు తెలిసింది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అందరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, గ్రామాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి. డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి గ్రామానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పోలేరమ్మ అమ్మవారి భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రై డే పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

### -సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య

ప్రజా భూమి తొండూరు: మండలంలోని సంతకొవ్వూరు గ్రామంలో శుక్రవారం డ్రైడే సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు ప్రతి వారం ఒక రోజును డ్రై డే గా పాటించడం ఎంతో ముఖ్యమన్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు గుడ్లు పెట్టి వృద్ధి చెందుతాయని, అందువల్ల ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడటమే డ్రైడే ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

**డ్రై డే రోజున చేపట్టాల్సిన ముఖ్యమైన చర్యలు**

నీటి నిల్వ పాత్రలను ఖాళీ చేయాలి: ఇంట్లోని డ్రమ్ములు, బకెట్లు, కూలర్లు, పూలకుండీలు, పక్షుల నీటి గిన్నెలను ఖాళీ చేసి, వాటి లోపలి భాగాలను బాగా రుద్ది శుభ్రం చేయాలి. దీనివల్ల దోమల గుడ్లు తొలగిపోతాయి.పాత్రలను శుభ్రం చేసి ఆరబెట్టాలి: శుభ్రం చేసిన పాత్రలను కొంతసేపు ఎండలో ఆరబెట్టి, అనంతరం తాజా నీటిని నింపి గట్టిగా మూత పెట్టాలి.పాత వస్తువులను తొలగించాలి: ఇంటి పరిసరాల్లో, డాబాలపై ఉన్న కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, విరిగిన ప్లాస్టిక్ డబ్బాలు, సీసాలు తదితర వాటిలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా వాటిని తొలగించాలి. నీటి ట్యాంకులు, సంపులను మూసి ఉంచాలి: ఓవర్‌హెడ్ ట్యాంకులు, భూగర్భ నీటి సంపులను సరిగ్గా మూసి ఉంచాలి. అవసరమైన చోట గాలి రంధ్రాలకు దోమలు ప్రవేశించకుండా మెష్‌ను ఏర్పాటు చేయాలి.కూలర్లు, ఫ్రిజ్ వెనుక ట్రేలను శుభ్రం చేయాలి: ఎయిర్ కూలర్లలోని నీటిని, రిఫ్రిజిరేటర్ వెనుక భాగంలోని నీటి ట్రేలను క్రమం తప్పకుండా ఖాళీ చేసి శుభ్రం చేయాలి.





**డ్రై డే వల్ల ప్రయోజనాలు**

దోమల జీవిత చక్రాన్ని అడ్డుకోవడంలో వారానికి ఒకసారి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను పూర్తిగా ఖాళీ చేసి శుభ్రం చేయడం ఎంతో ఉపయోగకరమని సిద్దయ్య తెలిపారు. ముఖ్యంగా డెంగ్యూ వ్యాధిని వ్యాప్తి చేసే ఏడిస్ దోమలు ఇంటి పరిసరాల్లోని నీటి నిల్వల్లో వృద్ధి చెందే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "మన ఇల్లు -- మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం. వారానికి ఒకరోజు, ముఖ్యంగా ప్రతి శుక్రవారం, డ్రై డే పాటిద్దాం. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల బారిన పడకుండా మన కుటుంబాన్ని, సమాజాన్ని కాపాడుకుందాం" అని సిద్దయ్య ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రమణ్యం, పీహెచ్‌ఎన్ రాధా రుక్మిణి, ఆశా కార్యకర్త శారదతో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అమగంపల్లె వద్ద కారు బైక్ ఢీ యువకుడు మృతి

ప్రజాభూమి పోరుమామిళ్ల :
కడప జిల్లా కాశినాయన మండలం ఇటుకలపాడు గ్రామానికి చెందిన కొప్పోలు శ్రీనివాస్ రెడ్డి, లత దంపతుల రెండో కుమారుడు సురేంద్ర రెడ్డి (14) గా గుర్తింపు. మృతిచెందిన యువకుడు సురేందర్ రెడ్డి తమ గ్రామానికి బైక్ పై వెళుతూ అమగంపల్లె మెయిన్ రోడ్డు నుండి



ఇటుకలపాడు రోడ్డు క్రాస్ అవుతుండగా వేగంగా వచ్చిన ఏపీ 39 యబ1736 కారు ఢీకొని యువకుడు అక్కడికక్కడే మృతి. మృతి చెందిన యువకుడు సురేందర్ రెడ్డి 9వ తరగతి చదువుతున్నాడు. యువకుడు సురేందర్ రెడ్డిని ఢీకొన్న వెంటనే కారును అక్కడే వదిలేసి డ్రైవర్ పరారీ. పిన్న వయసులోనే కుమారుడు మృతి చెందడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు. గిద్దలూరు నుండి మైదుకూరు కు వెళుతున్న ఏపీ 39 జీబ1836 కారు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టిన కాశినాయన మండలం పోలీసులు.

# ఆర్జీయూకేటీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

### - 119 బృందాల పాల్గొనడం.. 50 ఉత్తమ బృందాలు జాతీయ స్థాయికి

ప్రజాభూమి, వేంపల్లె
దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2026లో భాగంగా ఆర్జీయూకేటీ-ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో శుక్రవారం పోటీలు నిర్వహించినట్లు క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ డా. జి. విజయ ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ విభాగాల్లో అభివృద్ధి చేసిన నూతన అప్లికేషన్లు, వినూత్న పరిష్కారాలను ప్రదర్శించారు. మొత్తం 119 బృందాలు పోటీల్లో పాల్గొన్నాయి. 119 బృందాల్లో ప్రతిభ కనబరిచిన 50 ఉత్తమ బృందాలను ఎంపిక చేసి జాతీయ స్థాయి పోటీలకు పంపనున్నట్లు క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ డా. జి. విజయ ప్రకాష్ తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ దృక్పథం, విశ్లేషణాత్మక ఆలోచనా శక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆర్జీయూకేటీ ప్రతిష్ఠను మరింత పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ అకడమిక్స్ డి. రమేష్ కైలాష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. పి. రవికుమార్, సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ (ఎస్‌పీఓసీ) ఉదయశ్రీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# డ్రోన్ బీట్‌తో నిఘా

### - జూదం, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి చర్యలు- సీఐ టి. నరసింహులు

ప్రజాభూమి, వేంపల్లె
జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేంపల్లి పట్టణం, పరిసర ప్రాంతాల్లో శుక్రవారం డ్రోన్ బీట్ నిర్వహించి పోలీసులు నిఘా చేపట్టారు. స్థానిక పట్టణంలోని ఫ్రెండ్స్ కేఫ్ ప్రాంతం, ఎన్‌టీఆర్ సర్కిల్, రాజీవ్‌నగర్ కాలనీ, అలవలపాడు రోడ్డు, హనుమాన్ జంక్షన్, కడప రోడ్డు, పార్క్ ప్రాంతం, గాజులపేట గ్రామం, గండి రోడ్డు, ఆలిరెడ్డిపల్లి రోడ్డు ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా విస్తృతంగా పరిశీలించారు. జూదం, బహిరంగ మద్యపానం, ఇతర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు డ్రోన్ బీట్ ద్వారా నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని సీఐ టి. నరసింహులు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ నరసింహులు పేర్కొన్నారు.



# ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాభూమి, చక్రాయపేట
మండలంలోని గండిక్షేత్రంలో గల శ్రీ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో వెలసిన శ్రీకృష్ణాలయంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుల నేతృత్వంలో శ్రీకృష్ణుడికి అభిషేకం, నివేదన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు సత్రం ఛైర్మన్ పచ్చిపులుసు మురళీకిషోర్ తెలిపారు. కృష్ణాష్టమి సందర్భంగా ఆలయానికి భక్తులు తరలివచ్చి శ్రీకృష్ణుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



# మామిళ్ళ మంగకు రూ.1.11 లక్షల సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం

### - చెక్కును అందిస్తున్న టిడిపి నాయకులు

సిద్దవటం, ప్రజాభూమి: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధి పార్వతీపురం గ్రామానికి చెందిన మామిళ్ళ మంగ గొంతు సంబంధిత అనారోగ్య సమస్యతో సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రూ.3 లక్షలకు పైగా ఖర్చు చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోగా, శాసనమండలి సభ్యులు చెన్నంశెట్టి రామచంద్రయ్య సిఫారసుతో రూ. 1, 11,452 ఆర్థిక సహాయం మంజూరైంది. మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం సిద్దవటం మండల టీడీపీ నాయకులు మామిళ్ళ మంగ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కూటమి పార్టీ నేతలు కడితం రామమోహన్ నాయుడు, పుత్తా శివానంద, అవ్వారు రవిశంకర్, ఉప్పల రామకృష్ణ తదితరులు మామిళ్ళ మంగ కుటుంబ సభ్యులను పరామర్శించి, చెక్కును అందించారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం మంజూరు కావడానికి సహకరించిన కుప్పాల వెంకట సుబ్బయ్యకు మామిళ్ళ సుబ్బయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.



# శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు

సిద్దవటం, ప్రజాభూమి: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సిద్దవటం మండలం మాధవరం-1 గ్రామంలోని శ్రీ భద్రావతి భావనారాయణ సమేత శ్రీ సీతారాముల దేవస్థానంలో కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారి మూలవిరాట్లకు పంచామృత అభిషేకాలు నిర్వహించి, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. శాశ్వత ఉభయ దాతలు అవ్వారు రవిశంకర్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారికి కాయకర్పూరం సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. స్వామివారి దర్శనానికి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ శెట్టి పుత్తా శ్రీనివాసులు, అవ్వారు బాబురావు, సామల చెంగయ్య, పూజారి జింకా సాంబయ్య, నరసింహ, విష్ణుతేజ, కిరణ్య తదితరులు పాల్గొన్నారు.



# శ్రీకృష్ణ, గోపికల వేషధారణ లతో అలరించిన జన్మాష్టమి వేడుకలు

ఒంటిమిట్ట, ప్రజాభూమి: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని కొండమచుపల్లిలోని ఎస్.ఎన్. వై.ఎన్. సంస్కృత హైస్కూల్లో జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారుల వేషధా రణ, ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శ్రీకృష్ణుడి బాల్య లీలలు, జన్మాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



# అమ్మవారికి ప్రత్యేక పూజలు

ప్రజాభూమి పోరుమామిళ్ల :
శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు విశ్వనాదుల ప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు పలుకూరి రాధా నిర్వహణలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ముత్యాల చిరతో మరియు కొబ్బరి గిన్నెలతో పురోహితులు కౌశిక్ శర్మ అలంకారం చేసినారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు మహిళా సంఘం సభ్యులు ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు మరియు భక్తులందరూ పాల్గొని అమ్మవారిని దర్శనానంతరం తీర్థప్రసాదాలు తీసుకోవడం జరిగినది



# అరవ రామచంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం


ప్రజాభూమి, పులివెందుల
లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలోని లీలావతి వృద్ధాశ్రమంలో అరవ రామచంద్రా రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన భార్య సుభద్రమ్మ, కుమార్తె,కుమారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. వృద్ధులకు భోజనం వడ్డించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సేవా కార్యక్రమంలో డాక్టర్ దశరథరామిరెడ్డి, సోమేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



# టీటీడీ గోశాలలో వైభవంగా గోకులాష్టమి గోపూజ

## గోమాతకు శాస్త్రోక్త పూజలు నిర్వహించిన టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
తిరుమల శ్రీవారి సన్నిధిలో గోమాతకు విశిష్ట స్థానం -- గోసంరక్షణకు టీటీడీ అత్యంత ప్రాధాన్యత. గోకులాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని టీటీడీ శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణ శాలలో శుక్రవారం ఉదయం గోపూజ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర గోశాలలోని శ్రీ వేణుగోపాల స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్ఛారణల నడుమ గోమాత, దూడలకు నూతన వస్త్రాలు, పుష్పమాలలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోమాతకు భక్తిశ్రద్ధలతో ప్రదక్షిణలు చేసి హారతి సమర్పించారు. ఈ సందర్భంగా ఈవో ముద్దాడ రవిచంద్ర గోమాత పాలను స్వయంగా పితికి, పవిత్రమైన ఆ పాలను ఆలయ అర్చకులకు అందించారు. ఆ పాలను





శ్రీ వేణుగోపాలస్వామివారికి అభిషేకం చేయడం విశేషంగా జరిగింది.

**7 కోట్ల సార్లు "ఓం నమో వేంకటేశాయ" జప సమర్పణ**

అనంతరం ''ఓం నమో వేంకటేశాయ'' మహామంత్రాన్ని 7 కోట్ల సార్లు జపించిన జప పుస్తకాలను స్వామివారికి సమర్పించే కార్యక్రమాన్ని ఈవో నందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపను కోరారు. గోమాత పూజ భారతీయ సంస్కృతి, సనాతన ధర్మంలో అత్యంత పవిత్రమైన సంప్రదాయమని ఈవో పేర్కొన్నారు. గోమాతలో సమస్త దేవతా స్వరూపాలను దర్శించే గొప్ప ఆధ్యాత్మిక విశ్వాసం మన సంప్రదాయంలో ఉందన్నారు.

గోసంరక్షణ, గోసేవకు టీటీడీ ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ గోశాలను మరింత అభివృద్ధి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, టీటీడీ బోర్డు సభ్యుడు జి. భాను ప్రకాష్ రెడ్డి, జేఈవో (విద్య, ఆరోగ్యం) ప్రభల గోపీనాథ్, గోశాల డైరెక్టర్ శివకుమార్, విజీవో గిరిధర్, ఇంచార్జి డిఎల్వో వెంకట సుబ్బానాయుడు, ఇతర అధికారులు, సిబ్బంది, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

# పూల వెంకటాద్రి యాదవ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం

ప్రజా భూమి ప్రతినిధి
రేణిగుంట.
శ్రీకృష్ణ జన్మాష్టమినీ పురస్కరించుకొని, యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని, అనాధలకు ,పేదలకు రేణిగుంట బస్టాండ్ ఆవరణంలో 300 మందికి



ఉదయం, అల్పాహారం మధ్యాహ్నంఅన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూల వెంకటాద్రి యాదవ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం సముద్రంలో ఏలీనోవా ప్రాబ్లం వలన వర్షాలు కురవకపోగా అధిక వేడితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, శ్రీకృష్ణుని చల్లనిదయ తో దేశమంతటా అధిక వర్షాలు కురవాలని, తద్వారా రైతులు, పాడి ,పంటలు దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. వెంకటాద్రి యాదవ్, బిజెపి రేణిగుంట టౌన్ ప్రెసిడెంట్ నరేష్ రాయల్, ఎంజి రాజేష్ రెడ్డి, రావణ, వేణు, అశోక్, ఉమామహేశ్వర్ రెడ్డి, వంశీ, చందు, మాధవరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రగిరి ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి
చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే పులివర్తి నాని శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని శ్రీకృష్ణ స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా





నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ అరిగిలవారిపల్లి గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నానికి గ్రామస్తులు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వినాయక స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి పట్టువస్త్రాలను తీసుకువచ్చి శ్రీకృష్ణ ఆలయంలో సమర్పించారు. ఆలయం వద్ద గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అరటి పండ్లు తినిపించారు. శ్రీకృష్ణ ఆలయం వద్ద నిర్వహించిన ఉట్లు కార్యక్రమంలో గ్రామస్థులతో కలిసి ఎమ్మెల్యే పులివర్తి నాని ఉట్టును కొట్టి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు, గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

# డ్రోన్ నిఘాతో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

## అటవీ, క్వారీ, తెలుగు గంగ కాలువ ప్రాంతాల్లో పోలీసుల ప్రత్యేక తనిఖీలు

ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ
తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు బుచ్చినాయుడు కండ్రిగ సబ్ ఇన్స్పెక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పార్లపల్లి, జోగికండ్రిగ గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతాలు, క్వారీలు, తెలుగు గంగ కాలువ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక డ్రోన్ నిఘా నిర్వహించారు



ఈ సందర్భంగా అనుమానాస్పద ప్రాంతాలను డ్రోన్ కెమెరాల ద్వారా పరిశీలించి, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించే చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గంజాయి వినియోగించడం, పేకాట నిర్వహించడం కోడి పందేలు నిర్వహించడం వంటి అసాంఘిక కార్యకలాపాలతో పాటు ఇతర చట్టవ్యతిరేక చర్యలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు వెల్లడించారు. దట్టమైన అటవీ ప్రాంతాలు, జనసంచారం తక్కువగా ఉండే ప్రదేశాలు, కాలువ పరిసర ప్రాంతాల్లో కొందరు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే సమాచారంతో డ్రోన్ సర్వైలెన్స్ చేపట్టినట్లు తెలిపారు. డ్రోన్ ద్వారా సేకరించిన దృశ్యాల ఆధారంగా అనుమానితులను గుర్తించి, అవసరమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు చట్టాలను గౌరవించి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని, ఎవరైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. డ్రోన్ సాంకేతికత ద్వారా మారుమూల ప్రాంతాల్లో కూడా సమర్థవంతమైన నిఘా సాధ్యమవుతుందని, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు ఇటువంటి చర్యలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

# బిజెపి పార్టీ సమావేశం అధ్యక్షుడు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో వాకాడు

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు
వాకాడు మండల కేంద్రంలో ని స్వర్ణముఖి అతిథి గృహంలో శుక్రవారం బిజెపి పార్టీ సమావేశం మండల బిజెపి పార్టీ అధ్యక్షులు తూపిలి చంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు ఈ కార్యక్రమానికి రాష్ట్ర జిల్లా బిజెపి పార్టీ ముఖ్య నాయకులు పనబాక కోటేశ్వరరావు, పి కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు పాపా రెడ్డి పురుషోత్తం రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ కాలావల్లి ప్రసాద్,



పాల్గొన్నారు సమావేశంలో ముఖ్య పార్టీ అజెండా గురించి తీర్మానాలు చేశారు ముఖ్యం శక్తి కేంద్రాలలో సమావేశాలు నిర్వహించడం మంకీ బాత్ గ్రామాల్లో ప్రధానమంత్రి ప్రసంగాన్ని ప్రజలకు వినిపించడం గ్రామాలలో ముఖ్యంగా మౌలిక వసతులు చూడడం ప్రజలకు ఇబ్బంది లేకుండా అభివృద్ధి సంక్షేమ నాయకులు కార్యకర్తలు కలిసి చేయాలని అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలని తీర్మానించారు ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఇరుగు శ్రీనివాసులు, సంతోష్, ప్రణీత్, రాము, శ్రీకాంత్, తదితర బిజెపి పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# తండ్రిని హత్య చేసిన కొడుకు అరెస్ట్

- హత్యకు ఉపయోగించిన కోడి కత్తి, ద్విచక్ర వాహనం, రక్తపు మరకలున్న చొక్కా స్వాధీనం
- ఒక్క రోజులోనే కేసును ఛేదించిన పెనుమూరు పోలీసులు
- పోలీసు బృందాన్ని అభినందించిన జిల్లాఎస్పీ తుషార్ డూడి

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు
తండ్రిని హత్య చేసిన కేసులో కొడుకును పెనుమూరు పోలీసులు అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన కోడి కత్తి, నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనం, రక్తపు మరకలు ఉన్న నిందితుడి చొక్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటన జరిగిన మరుసటి రోజే కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేయడంపై జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఖూరా పోలీసు బృందాన్ని అభినందించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎస్. జోకేష్ రెడ్డి ఏ బాలాజీ ఎల్లంపల్లి ప్రాంతంలో నీరజాక్షి నాయుడు వద్ద హిటాచి ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి తిరుపతి జిల్లా ఆర్.సి.పురం మండలం అనుప్పల్లి గ్రామానికి చెందిన చూడామణితో 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కుటుంబ విభేదాల కారణంగా సుమారు తొమ్మిది సంవత్సరాల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి పెనుమూరులో వేరుగా నివసిస్తున్నాడు. 2026 సెప్టెంబర్ 2 రాత్రి



సుమారు 7.30 గంటలకు నిందితుడి భార్య చూడామణి, నిందితుడి తండ్రి చెంగా రెడ్డికి ఫోన్ చేసి, జోకేష్ రెడ్డి ప్రతిరోజూ మద్యం సేవించి ఇంట్లో గొడవ చేస్తున్నాడని, గ్రామంలో అప్పులు కూడా ఎక్కువగా చేశాడని తెలిపింది. పెనుమూరులోని తమ ఇంటికి రావాలని కోరగా, చెంగా రెడ్డి మరుసటి రోజు ఉదయం వస్తానని చెప్పాడు. తండ్రి ఉదయం ఇంటికి వస్తే మద్యం సేవించే అలవాటు, అప్పుల విషయమై తనను మందలించి భార్య ముందు అవమానిస్తాడని భావించిన నిందితుడు, తండ్రిని హత్య చేయాలని ముందుగానే నిర్ణయించుకున్నాడు. తన వద్ద ఉన్న కోడి కత్తిని తీసుకుని ద్విచక్ర వాహనంపై రాత్రి సుమారు 8 గంటలకు పెనుమూరు నుంచి తన స్వగ్రామమైన మాణిక్యరాయునిపల్లిలోని తల్లిదండ్రుల ఇంటికి వెళ్లాడు. తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సమయంలో తండ్రి మద్యం సేవించడం, అప్పుల విషయమై మందలించడంతో నిందితుడు తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. ముందుగానే తీసుకెళ్లిన కోడి కత్తితో తల్లి సమక్షంలోనే తండ్రి గొంతు కోసి హత్య చేశాడు. తల్లి కేకలు వేయడంతో అక్కడి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని తీసుకుని ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు. ఈ ఘటనపై నిందితుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెనుమూరు పోలీస్ స్టేషన్‌లో జతీ.చీశీ.63/2026, సెక్షన్ 103(1) దీచీూ కింద కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఖూరా ఆదేశాల మేరకు, చిత్తూరు రాణూరా జె. వెంకటనారాయణ పర్యవేక్షణలో, చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. రామచంద్ర ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. ఇన్‌స్పెక్టర్ కె. రామచంద్ర పెనుమూరు ఎస్సై పి. శ్రీకాంత్, వి. మణికంటేశ్వర రెడ్డి, చిత్తూరు తాలూకా రా× వి. అశోక్ కుమార్, క్రైమ్ పార్టీ, పెనుమూరు పోలీస్ స్టేషన్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. సెప్టెంబర్ 3 సాయంత్రం సుమారు 6 గంటలకు పెనుమూరు మండలం పాకాల రోడ్డు, సాయినగర్ కాలనీ, శ్రీ బాలాజీ ఆయిల్ మిల్ సమీపంలో నిందితుడు ఎస్. జోకేష్ రెడ్డి ఏ బాలాజీని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి ఒప్పుకోలు మేరకు హత్యకు ఉపయోగించిన కోడి కత్తి, నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనం, రక్తపు మరకలు ఉన్న చొక్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హత్య కేసును వేగంగా ఛేదించి, ఘటన జరిగిన మరుసటి రోజే నిందితుడిని అరెస్ట్ చేసిన చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. రామచంద్ర, పెనుమూరు ఎస్సై పి. శ్రీకాంత్, వి. మణికంటేశ్వర రెడ్డి, చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్ రా× వి. అశోక్ కుమార్, క్రైమ్ పార్టీ, పెనుమూరు పోలీస్ స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఖూరా అభినందించి రివార్డులు ప్రకటించారు.

ముద్దాయి వివరాలు:
ఎస్. జోకేష్ రెడ్డి ఏ బాలాజీ, వయస్సు 38 సంవత్సరాలు, తండ్రి: లేట్ ఎస్. చెంగా రెడ్డి, లక్ష్మీనగర్ కాలనీ, పెనుమూరు టౌన్ మరియు మండలం, చిత్తూరు జిల్లా.

# కాసారంలో రూ.4 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమిపూజ

## తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కలను సాకారం చేస్తున్నాం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి -మూడు నెలల్లో సబ్‌స్టేషన్ పూర్తి చేస్తాం

ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు:
నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం కాసారం గ్రామంలో రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాసారంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు తన తండ్రి, మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి దశాబ్దాల కల, ఆశయమని తెలిపారు. తండ్రి కన్న కలను నెరవేర్చే దిశగా నేడు సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మూడు నెలల్లో సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే కాసారం పంచాయతీ పరిధిలోని గ్రామాలకు





విద్యుత్ సరఫరా మరింత పటిష్టమవుతుందని, లో-వోల్టేజ్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు తగ్గుతాయని చెప్పారు. వ్యవసాయానికి, గృహ అవసరాలకు వేర్వేరుగా విద్యుత్ సరఫరా చేసే విధంగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. దీనివల్ల రైతులకు పంటల సాగుకు అవసరమైన విద్యుత్ సరఫరా మెరుగుపడి, వ్యవసాయ రంగంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. గృహ వినియోగదారులకు కూడా నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకున్న పాపాన పోలేదని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపలేదని ఆరోపించారు. ప్రస్తుతం ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను చేపడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని సుధీర్‌రెడ్డి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నియోజకవర్గానికి మరిన్ని అభివృద్ధి పనులు తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన ధ్యేయమని, ప్రజల ప్రయోజనాలే తనకు పరమావధి అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రావేళ్ల మునిరాజ నాయుడు, గాలి చలపతి నాయుడు, గాలి మురళీ నాయుడు,రాష్ట్ర కార్యదర్శి దశరథ అచ్చారి, యమ్.సుబ్బయ్య,పేట బాలాజీ రెడ్డి, ఉన్నం ప్రసాద్ నాయుడు, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ తత్త్వం సర్వ జనులకు శిరోధార్యం!

## - బిసి విభాగం, తెలుగుదేశం పార్టీ, శ్రీకాళహస్తి

ప్రజా భూమి ప్రతినిధి
శ్రీకాళహస్తి టౌన్
శ్రీకాళహస్తి. దుష్టులైన కౌరవ సోదరులకు ఎదురు నిలిచి, వారి దురాలోచనలను సాగనీయకుండా చేయడం ద్వారా ధర్మస్థాపన చేయాలని, బంధు ప్రీతి వ్యామోహంతో ధర్మాన్ని విస్మరించేలా కనిపించిన కుంతీ పుత్రుడు, సవ్యసాచి అయిన అర్జునుడికి కర్తవ్యాన్ని తెలియ పరిచిన శ్రీకృష్ణ



తత్త్వం సర్వ జనులకు శిరోధార్యం అని తెలుగుదేశం బిసి విభాగం శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకులు పిలుపునిచ్చారు. గొప్ప రాజనీతిజ్ఞుడు, అసమాన వ్యూహకర్త, ధర్మ సంస్థాపన కోసం దుష్ట శిక్షణ మరియు శిష్ట రక్షణ చేసే శ్రీకృష్ణ పరమాత్ముని జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాల పక్కన ఉన్న శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి ఆశీస్సులతో జనులెల్లరూ సుఖసంతోషాలతో జీవించమని వేడుకోవడం జరిగింది. ఫలితాన్ని ఆశించకుండా, నిర్వర్తించవలసిన నీ బాధ్యతల పైన మాత్రమే నీ దృష్టి పెట్టి, నీ కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించమని చెప్పిన శ్రీకృష్ణుని మాట జగద్విఖ్యాతమైనదని కొనియాడారు. దుఃఖము ఎదురైనప్పుడు కుంగిపోకుండా, సంతోషం కలిగినప్పుడు పొంగిపోకుండా, స్థితప్ర రాగ ద్వేషాలను అదుపులో ఉంచుకొని స్థితప్రజ్ఞుడిలా ఉండాలని సూచించిన శ్రీకృష్ణుని మార్గదర్శనం గొప్ప సూక్తిని తెలియపరుస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, రమేష్ యాదవ్, మాస్టర్ మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన గృహ ప్రవేశంలో పాల్గొన్న తుడా ఛైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి
తిరుపతి రూరల్
తిరుపతి రూరల్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు అమిలినేని మధు నూతన గృహ ప్రవేశ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ శుభ కార్యక్రమానికి తుడా ఛైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్అఫిషియో మెంబర్, తెదేపా



తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అమిలినేని మధు దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహంలో అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలగాలని, భగవంతుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమిలినేని మధు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



# వినాయక నిమజ్జనంలో అప్రమత్తతే ప్రధానం

### డీజేలకు అనుమతి లేదు..మద్యం సేవించి సముద్రంలోకి వెళ్లొద్దు - వాకాడు ఎస్సై నిఖిల్ బాబు

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

వాకాడు మండలం లో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంతో పాటు నిమజ్జన సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వాకాడు ఎస్సై నిఖిల్ బాబు సూచించారు. శుక్రవారం వాకాడు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వినాయక మండపాల నిర్వాహకులు, భక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఎస్పీ, నాయుడుపేట డీఎస్పీ, వాకాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్ భాష ఆదేశాలు, సూచనల మేరకు వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మండపాల నిర్వాహకులు ముందుగానే కనీసం 5--6 మంది బాధ్యుల పేర్లను నమోదు చేయడంతో పాటు, నిబంధనలకు అనుగుణంగా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ వైర్లతో ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, జనరేటర్ల వినియోగంలో కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాణసంచా వినియోగం, శబ్ద కాలుష్యంపై నియంత్రణ పాటించాలన్నారు. డీజే సౌండ్‌కు అనుమతి లేదని, డీజేలు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు.సముద్రంలో నిమజ్జన సమయంలో జాగ్రత్తలు వాకాడు మండలంలోని తూపిలిపాలెం, వాడపాలెం లైట్‌హౌస్ సముద్రతీర ప్రాంతాల్లో వినాయక నిమజ్జనాలు నిర్వహించే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని ఎస్సై



సూచించారు.ముఖ్యంగా మద్యం సేవించి సముద్రంలోకి వెళ్లరాదన్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధుల విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. నిమజ్జన కార్యక్రమాలసందర్భంగా ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా భక్తులు, ప్రజలు, వాహనదారులు, డ్రైవర్లు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించి అందరూ సురక్షితంగా ఇంటికి చేరేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై నిఖిల్ బాబు హెచ్చరించారు. వినాయక చవితి ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సంతోషకరమైన వాతావరణంలో జరిగేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

# రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో అక్షర యోధుడికి అరుదైన గౌరవం

### తెలుగు భాషా సేవ, బాలల సృజనాత్మకత వికాసానికి యువశ్రీ మురళి విశిష్ట కృషి

ప్రజా భూమి ప్రతినిధి
– బుచ్చినాయుడు కండ్రిగ

తెలుగు భాషను భావితరాలకు చేరవేసే అక్షర యజ్ఞంలో రెండు దశాబ్దాలకు పైగా నిరంతర సేవలందిస్తున్న ప్రముఖ తెలుగు ఉపాధ్యాయుడు, కవి, రచయిత, సంపాదకుడు, సాహితీవేత్త యువశ్రీ మురళి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకోవడం విద్యా, సాహిత్య వర్గాల్లో హర్షాతిరేకాలకు కారణమైంది. 2003లో ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెట్టిన యువశ్రీ మురళి, విద్యాబోధనను కేవలం ఉద్యోగంగా కాకుండా సామాజిక బాధ్యతగా భావించి వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో స్ఫూర్తిని నింపుతున్నారు. తెలుగు భాషపై ప్రేమ, సాహిత్యంపై అభిరుచి, విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించే లక్ష్యంతో ఆయన చేపట్టిన కార్యక్రమాలు ప్రత్యేక గుర్తింపు పొందాయి. ప్రస్తుతం తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఆయన, తరగతి గదిని సృజనాత్మకతకు వేదికగా మలిచి విద్యార్థుల్లో పఠనాసక్తి, రచనా నైపుణ్యాలను పెంపొందిస్తున్నారు. భాషా దినోత్సవాలు, సాహిత్య సభలు, కవుల జయంతులు, వర్ధంతులు నిర్వహిస్తూ తెలుగు భాషా చైతన్యాన్ని విద్యార్థుల్లో పెంపొందిస్తున్నారు. విద్యార్థుల రచనా ప్రతిభకు వేదికగా 2023లో ప్రారంభించిన "బాలల నేస్తం" ఈ–మాసపత్రిక ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కథలు, కవితలు, చిత్రాలకు ప్రాధాన్యత కల్పించారు. "బాల నేస్తాలు", "కల్లివెట్టు బడి పిల్లల కథలు" వంటి సంకలనాలకు సంపాదకత్వం వహించి బాలల సృజనాత్మకతకు అక్షర రూపం ఇచ్చారు. డిజిటల్ రంగంలోనూ తెలుగు భాష ప్రచారానికి కృషి చేస్తున్న యువశ్రీ మురళి, "జై తెలుగు తల్లి.కామ్" వెబ్‌సైట్, "జై తెలుగు తల్లి – – యువశ్రీ మురళి" యూట్యూబ్ ఛానల్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు తెలుగు



పాఠ్యాంశాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. పాఠ్యపుస్తక రచయితగా, రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా, శిక్షణా కార్యక్రమాల నిర్వహకుడిగా, ఉపాధ్యాయ సంఘం నాయకుడిగా, సాహిత్య సంస్థల నిర్వాహకుడిగా ఆయన అందిస్తున్న సేవలు విశేషమైనవి. "మట్టిఅద్దం" కవితా సంపుటి ద్వారా సామాజిక స్పృహ, మానవీయ విలువలను ప్రతిబింబిస్తూ సాహిత్య రంగంలోనూ తనదైన ముద్ర వేశారు. తెలుగు భాష పరిరక్షణ, ప్రాచుర్యం కోసం భాషోద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ, ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు వినియోగం పెరగాలని నిరంతరం కృషి చేస్తున్నారు. విద్య, సాహిత్యం, భాషా సేవ, బాలసాహిత్యం, డిజిటల్ తెలుగు ప్రచారం వంటి అనేక రంగాల్లో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగానే రాష్ట్ర ప్రభుత్వం "ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం" ప్రదానం చేసింది. యువశ్రీ మురళికి లభించిన ఈ గౌరవం ఒక వ్యక్తికి మాత్రమే కాకుండా తెలుగు భాషకు, విద్యా రంగానికి, బాలల సృజనాత్మకతకు దక్కిన గౌరవంగా పలువురు విద్యావేత్తలు, సాహితీవేత్తలు అభిప్రాయపడుతున్నారు. తెలుగు భాషా వెలుగులను భావితరాలకు అందించాలనే ఆయన అక్షర తపన మరెంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తోందని కొనియాడుతున్నారు.

# వినాయక ఉత్సవాలు, ఎన్నికలు, సైబర్ నేరాలపై పోలీసుల విస్తృత అవగాహన

### శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం అవసరం

### డీఎస్పీ నరసింహమూర్తి

ప్రజా భూమి ప్రతినిధి
– బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ పోలీస్ స్టేషన్‌లో శ్రీకాళహస్తి డీఎస్పీ అధ్యక్షతన, సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల గ్రామ పెద్దలు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, యువత, విద్యార్థులు మరియు ప్రజలతో విస్తృత స్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రానున్న వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా సామరస్య పూర్వకంగా నిర్వహించేందుకు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. ఉత్సవ కమిటీలు సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, శబ్ద కాలుష్య నియంత్రణ, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ భద్రతా ప్రమాణాలను పాటించాలని, విగ్రహాల నిమజ్జన సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల నియమావళి, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించారు. రాజకీయ విభేదాలను వ్యక్తిగత శత్రుత్వాలుగా మార్చుకోవద్దని, ఎన్నికల సమయంలో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడరాదని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణపై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, అధిక వేగంతో వాహనాలు నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని సూచించారు. మహిళలపై నేరాల నివారణ, గృహ హింస, వేధింపులు, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాలు, స్టాకింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని వివరించారు. గంజాయి రవాణా, నిల్వ, విక్రయం, వినియోగం చట్టరీత్యా శిక్షార్హమైన నేరాలని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. మైనర్ల ప్రమేయంతో జరుగుతున్న నేరాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహితుల వర్గం, మొబైల్ ఫోన్ వినియోగంపై పర్యవేక్షణ కలిగి ఉండాలని సూచించారు. పోక్సో చట్టం నిబంధనలను వివరిస్తూ చిన్నారులపై లైంగిక వేధింపులు, దాడులు, అనుచిత ప్రవర్తనలకు కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.సైబర్ నేరాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తూ ఆన్‌లైన్ లోన్స్, ఫేక్ లోన్ యాప్స్, పెట్టుబడి మోసాలు, ఓటీపీ మోసాలు, బ్యాంకు ఖాతాల దుర్వినియోగం, సోషల్ మీడియా మోసాల గురించి వివరించారు. ఇటీవల పెరుగుతున్న "డిజిటల్ అరెస్ట్" మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్ వచ్చిన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత, మంచి అలవాట్ల పెంపొందింపు, చట్టాల పట్ల అవగాహన, ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ వంటి అంశాలపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.



# దిగువ మల్లవరం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

మండలం దిగువ మల్లవరం గ్రామ సమీపంలోని హైవే పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి ఉదయం 9 గంటల సమయంలో హైవే పక్కన అపస్మారక స్థితిలో కనిపించాడు. సమాచారం అందుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది అతడిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం 3 గంటల సమయంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించగా ఎలాంటి గాయాలు కనిపించలేదని, అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతుడి వద్ద గుర్తింపు వివరాలు లభించకపోవడంతో ఆయన ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు లేదా అతడిని గుర్తించిన వారు రేణిగుంట పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

## ఏపీ రాష్ట్ర ఆర్టిఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షులు జన్నావుల సురేంద్ర జన్మదిన వేడుకలు

ప్రజా భూమి ప్రతినిధి బంగారు పాళ్యం



చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాలెం మండలం కేంద్రంలోని ఆర్టిఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యాలయం మరియు ప్రెస్ క్లబ్ కార్యాలయం నందు బంగారుపాళ్యం ఆర్టిఐ కమిటీ సభ్యులు మండలంలోని అన్ని పత్రిక విలేకరులు సమక్షంలో అంగరంగ వైభవంగా ఏపీ రాష్ట్ర ఆర్టిఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షులు మరియు ప్రెస్ రాష్ట్ర సబ్ ఎడిటర్ జన్నావుల సురేంద్ర జన్మదిన శుభాకాంక్షలు అంగరంగ వైభవముగా బర్తడే కేకులు కట్ చేసి శాలవ లుతో ఘనముగా సత్కరించి పండగ వాతావరణం లాగా జన్నావుల సురేంద్ర జన్మదిన శుభాకాంక్షలు ఆర్టిఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర కమిటీ సభ్యులు మరియు ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ ఛానల్ బంగారు పాల్యం విలేకరులు సమక్షంలో భారీగా పెద్ద ఎత్తున జన్నావుల సురేంద్ర జన్మదిన వేడుకలు జరుపుకున్నారు ఏపీ రాష్ట్ర అధ్యక్షు లు జన్నావుల సురేంద్ర మాట్లాడుతూ ప్రజల యొక్క సమస్యలపై అలుపెరగని నిత్యము అనునిత్యము ప్రజల కోసం వారి యొక్క సమస్యలపై అధికారుల వద్ద గాని ప్రజా ప్రతినిధులు వద్ద గాని అలుపెరగని పోరాటం చేసి ప్రజలు సమస్యలకు పరిష్కారం దిశగా వారి సమస్యలను పరిష్కరించుటకు వారి కోసం ఎల్లవేళలా కష్టపడి శ్రమించి న్యాయం చేయటం కోసం మేము వారి కుటుంబ సభ్యులు లో ఒక సభ్యుడు లాగా ఉండి వారి యొక్క బాధలను సమస్యలను కడుపు కోతలను వారి యొక్క కన్నీళ్లను తుడిచి ప్రజల శ్రేయస్సుకోసం సంతోషం కోసం ఈ యొక్క ఆర్టిఐ సంస్థ కమిటీ సభ్యులు మరియు ప్రెస్ పత్రికా విలేకరులు ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉండగలరు మీకు ఏదైనా సమస్యలు ఎదురైతే మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు 94 91 48 36 0 8 మరియు 75 69 84 23 23 పైన కనబరిచిన ఫోన్ నెంబర్లు కు ఫోన్ చేస్తే వెంటనే మీ సమస్యలకు పరిష్కార మార్గం చూపుటకు ప్రయత్నించగలము అని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో రెడ్డప్ప శంకర్ నాయుడు ధరణి జయచంద్ర చిట్టిబాబు సత్యనారాయణ జ్యోతి బాబు శ్రీరాములు ఆర్ టి ఐ కమిటీ సభ్యులు సిబ్బంది బంగారు పాల్యం మండలం పత్రిక విలేకరులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శక్తి పీఠంలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

### - శ్రీ కాళికాష్టమి వేడుకలు.

ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం



రామచంద్రాపురం మండలం రాయలచెరువులోని శ్రీ శక్తి పీఠంలో శ్రీకృష్ణ జన్మాష్టమి, శ్రీ కాళికాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీ శక్తి పీఠాధీశ్వరి, మంత్ర మహేశ్వరి, శక్తి గురు శ్రీ రమ్యానంద భారతీ మహాస్వామిని వారి పర్యవేక్షణలో వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోహినీ అలంకరణలో శ్రీకృష్ణ పరమాత్మ భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం సాంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీకృష్ణ మరియు గోపికల వస్త్రధారణలో వచ్చిన చిన్నారులకు పూజ్యశ్రీ మాతాజీ వారు ప్రత్యేక కానుకలు అందజేసి ఆశీర్వదించారు. భక్తులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. పీఠంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, కార్యక్రమాల్లో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు. భక్తి, ఆధ్యాత్మికత, సాంస్కృతిక సంప్రదాయాలతో వేడుకలు వైభవంగా జరిగాయి.



# తొండవాడలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ప్రజా భూమి ప్రతినిధి
చంద్రగిరి

చంద్రగిరి మండలం తొండవాడ గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించిన వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. వేడుకల్లో భాగంగా ఉదయం 5 గంటలకు సుప్రభాతం నిర్వహించగా, ఉదయం 7:30 గంటలకు గోపూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. అనంతరం ఉదయం 11 గంటలకు శ్రీకృష్ణ కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6:30 గంటలకు ఉత్సవ ఊరేగింపు నిర్వహించడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ప్రత్యేకంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. కుల, వయస్సు, వర్గ భేదాలకు అతీతంగా చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా గ్రామస్థులంతా ఒక్కటై శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొనడం విశేషంగా నిలిచింది. భక్తి, ఆనందం, ఐక్యతను చాటుతూ నిర్వహించిన ఈ వేడుకలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపాయి. గ్రామస్తుల సమిష్టి సహకారంతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

# దుండగులు మోటార్ల చోరీ



ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం పొయ్య గ్రామం చెందిన రైతు మంగపతి అండర్ బ్రిడ్జి పక్కనే సర్వీస్ రోడ్డు దగ్గర చెంబెడు కాలవ ప్రక్కన రైతు మంగపతి కౌలు కు తీసుకుని వరి పంటను పండించుకునే వాళ్ళు, మోటార్ సహాయంతో చెంబెడు కాలవకు మోటర్ పెట్టుకుని వరి పంట పొలాలకు సాగు చేసుకునేవాళ్ళు, గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు వాటర్ పైపులు కట్ చేసి, మోటార్ ను దుండగులు దొంగిలించారు, అదేవిధంగా పది రోజుల క్రితమే ఆ రైతు ది మరో మోటార్ను కూడా దొంగిలించారు, మోటార్లను దుండగులు దొంగిలించడంతో నోటి కాడికి వచ్చిన వరి పంట పైరు ఎండిపోవడంతో రైతు కన్నీరు పాలయ్యారు ,సంబంధిత అధికారులు చొరవ చూపి, మోటార్లను దొంగిలించిన దుండగులను పట్టుకుని, నాకు న్యాయం చేయాలని రైతు కోరుతున్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సేవా కార్యక్రమం



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు

ఆ దేవదేవుడు శ్రీకృష్ణ పరమాత్ముని జన్మాష్టమిని పురస్కరించుకొని శ్రీకృష్ణ సేవా సమితి ఫౌండర్ చైర్మన్ మరియు జీవన్ దాన్ ఆర్గాన్ డోనార్ డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ దాతృత్వంతో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి 5 కుర్చీలు బహూకరించడం జరిగింది. నెల్లూరు జిల్లా గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నేత్ర వైద్యురాలు డాక్టర్ హెలెన్ గారి చేతుల మీదుగా ఈ కుర్చీలను ఆసుపత్రికి అందజేశారు. ఈ సందర్భంగా దాత, శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ – "మానవ సేవే మాధవ సేవ అని ఉపదేశించిన శ్రీకృష్ణ పరమాత్ముని జన్మాష్టమిని పురస్కరించుకొని ఈ చిన్న సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో దాత డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్, డాక్టర్ హెలెన్, మౌలాలి, ఇంచార్జ్ నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మల మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజలు



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,

గూడూరు పట్టణంలోని జడ్పీ హైస్కూల్ రోడ్డులో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో



శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకం విశేష పూజలు ఘనంగా నిర్వహించారు ఆలయ అర్చకులు మాట్లాడుతూ సెప్టెంబర్ 11వ తేదీ శ్రావణమాసం శుక్రవారం అమావాస్య సందర్భంగా శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి 1008 కేజీల కుంకుమతో అభిషేకం నిర్వహిస్తున్నామని ఒక కేజీ కుంకుమకు 250 రూపాయలు చొప్పున వారి శక్తి కొలది ఎన్ని కేజీలకైనా డబ్బులు చెల్లించవచ్చని తెలిపారు శుక్రవారం జరిగే కుంకుమభిషేకం అన్నదాన కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని విజ్ఞప్తి చేశారు

# సైదాపురం మండలములో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎం. తిరుపాల్ రాజు



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,

సైదాపురం: మండలంలోని చీకవోలు జీడబ్ల్యూ ఎంపీపీఎస్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. తిరుపాల్ రాజును సైదాపురం మండలములో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసినట్లు సమాచారం. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, వారిలో క్రమశిక్షణ, సృజనాత్మకత, సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కిందని విద్యా వర్గాలు పేర్కొన్నాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ, పాఠశాల అభివృద్ధిలోనూ తన వంతు పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మండలములో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన తిరుపాల్ రాజును తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 10
శనివారం 05 సెప్టెంబరు 2026

# ఆలయంలోనూ వెన్నుపోటు పార్టీ దిగజారుడు రాజకీయాలు

**– భ్రమరాంభ అమ్మవారికి నాంతాడు సమర్పించకుండా అడ్డుకున్న వైనం**
**– వైఎస్సార్సీపీ నాయకులపై వెన్నుపోటు పార్టీ శ్రేణుల దౌర్జన్యం.. కార్లపై దాడికి యత్నం**
**– ఎమ్మెల్యే ధూళిపాళ్ల డైరెక్షన్‌లో పోలీసుల అత్యుత్సాహం.. నేతలపై దురుసు ప్రవర్తన**
**: ఉద్రిక్తతల నడుమ శ్రీ భ్రమరాంబ అమ్మవారికి 'నాంతాడు' సమర్పించిన వైఎస్సార్సీపీ నాయకులు**

ప్రజాభూమి ప్రతినిధి,పెదకాకాని:

గుంటూరు జిల్లా పెదకాకాని శ్రీ భ్రమరాంబ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పవిత్రమైన నాంతాడు (మంగళసూత్రం) సమర్పించేందుకు వెళ్తున్న వైఎస్సార్సీపీ నాయకులను వెన్నుపోటు పార్టీ నేతలు, పోలీసులు అడుగడుగునా అడ్డుకుని దౌర్జన్యానికి దిగడం పట్ల వైఎస్సార్సీపీ తీవ్రంగా ఖండించింది. పవిత్రమైన శ్రావణ శుక్రవారం నాడు దేవాలయం వద్ద వెన్నుపోటు పార్టీ శ్రేణులు సృష్టించిన హైటెన్షన్ వాతావరణం, వారు చేసిన దిగజారుడు రాజకీయాలపై సామాన్య భక్తులు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ అమ్మవారి మంగళసూత్రం చోరీకి గురై 20 రోజులు గడుస్తున్నా.. దేవాదాయ శాఖ మంత్రి కానీ, ప్రభుత్వం కానీ కనీసం స్పందించలేదు. కేసు నమోదు చేసి తూతూమంత్రంగా దర్యాప్తు చేశారు. ఈ నేపథ్యంలో పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ.. రూ. 18 లక్షల వ్యయంతో కొత్త నాంతాడు తయారు చేయించి అమ్మవారికి సమర్పిస్తానని వారం క్రితమే ప్రకటించారు. భక్తులు కూడా విరాళాలు ఇవ్వడానికి ముందుకొచ్చారు. దీంతో తమ పరువు పోతుందని గ్రహించిన ప్రభుత్వం హడావుడిగా ఐదుగురు అర్చకులను సస్పెండ్ చేసి, రణధీర్ అనే అర్చకుడు దొంగతనం చేసినట్టు ప్రకటించింది. అయితే ఈ కేసులో రణధీర్‌ని అక్రమంగా ఇరికించారని ఆయన కుటుంబ సభ్యులే ఆరోపిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో, శుక్రవారం ఉదయం ఎంపీ అయోధ్యరామిరెడ్డి ఇంటి నుంచి వైఎస్సార్సీపీ నాయకులు నాంతాడుతో బయలుదేరగా వెన్నుపోటు పార్టీ నేతలు అడ్డుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కారును సైతం ముందుకు కదలకుండా చేసి, దాడికి యత్నించారు. రోడ్లపై బైఠాయించి హంగామా సృష్టించారు. ముందుగానే పోలీసుల అనుమతి తీసుకున్నప్పటికీ వైఎస్సార్సీపీ నాయకులను ఆలయం వైపు వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ప్రోద్బలంతోనే వెన్నుపోటు పార్టీ కార్యకర్తలు భారీగా చేరుకున్నారని వైఎస్సార్సీపీ నేతలు ఆరోపించారు. కేవలం 20 మందికే అనుమతి ఉందంటూ నిబంధనలు పెట్టి పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. వైఎస్సార్సీపీ నాయకుడు వరికూటి అశోక్ బాబు జుట్టు పట్టుకుని పోలీసులు అత్యంత దురుసుగా ప్రవర్తించారని వైఎస్సార్సీపీ నాయకులు మండిపడ్డారు. చోరీకి గురైన తాళిబొట్టు స్థానంలో అమ్మవారికి నాంతాడు సమర్పించడానికి ముందుకొస్తే.. దానిపైనా రాజకీయాలు చేయడం దుర్మార్గమని వైఎస్సార్సీపీ నేతలు అంబటి మురళీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ధ్వజమెత్తారు. దేవుడిని దర్శించుకోవడానికి కూడా ప్రభుత్వం పర్మిషన్ తీసుకోవాలా? అని వారు ప్రశ్నించారు. వైఎస్సార్సీపీ నాయకులు అమ్మవారికి నగలు సమర్పించడం నిషేధమా అని నిలదీశారు. భక్తుల మనోభావాలతో కూటమి ప్రభుత్వం ఆడుకుంటోందని, భక్తులను అడ్డుకున్న వారి కుట్రలకు ఆ భ్రమరాంబ అమ్మవారే బుద్ధి చెబుతుందని వారు హెచ్చరించారు. చివరకు తీవ్ర ఉద్రిక్తతల నడుమ ఎట్టకేలకు వైఎస్సార్సీపీ నాయకులు అమ్మవారికి నాంతాడును సమర్పించుకున్నారు. అయితే, వైఎస్సార్సీపీ నాయకులు అమ్మవారికి నాంతాడు సమర్పించి బయటకు వచ్చిన తర్వాత.. ఆ ప్రాంతం అపవిత్రమైందంటూ

# ఇన్చార్జ్ దేవర మనోహర్ ఆధ్వర్యంలో జనసేన జెండా ఆవిష్కరణ




ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలో జనసేన పార్టీ అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 55 జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దేవర మనోహర్ ఆధ్వర్యంలో జనసైనికులు, నాయకులు భారీ ఎత్తున ఈ సంబరాల్లో పాల్గొన్నారు. ఉదయాన్నే చంద్రగిరి నుంచి ఎగువ రెడ్డివారిపల్లె వరకు దేవర మనోహర్ నాయకత్వంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎగువ రెడ్డివారిపల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన పార్టీ జెండా దిమ్మెను ఇన్‌ఛార్జ్ దేవర మనోహర్, గ్రామ కమిటీ నాయకులు కలసి ఆవిష్కరించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నమూనాలో ప్రత్యేక డిజైన్‌తో ఈ జెండా దిమ్మెను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ దేవర మనోహర్ మాట్లాడుతూ.. 'ప్రజలే దేవుళ్లు.. సేవే మార్గం' అనే పవన్ కళ్యాణ్ ఆశయంతోనే పార్టీ ముందుకు సాగుతోందన్నారు. గత ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించి పవన్ కళ్యాణ్ చరిత్ర సృష్టించారని, కూటమి ప్రభుత్వంలో ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తున్నారని కొనియాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా పార్టీ శ్రేణులకు, యువ వింగ్‌కు దిశానిర్దేశం చేసేందుకు పవన్ కళ్యాణ్ సిద్ధమయ్యారని దేవర మనోహర్ తెలిపారు. చంద్రగిరి హైవేలోని కిలారీ గార్డెన్స్‌లో జరిగే పార్టీ యువజన విభాగ సమావేశానికి ఇన్‌ఛార్జ్ దేవర మనోహర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. చంద్రగిరి చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా పవన్ కళ్యాణ్ బర్త్‌డే వేడుకలను పండుగలా నిర్వహించామని జనసేన నేతలు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఏడు మండలాల అధ్యక్షులు,నియోజకవర్గ నాయకులు ,అనుబంధ విభాగాల నాయకులు,జనసైనికులు మరియు వీర మహిళలు పాల్గొన్నారు.

# తొట్టం బేడు మండలంలో మండల వైఎస్సార్సీపీ అధ్యక్షులు

## డాక్టర్ కోగిల సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలు



ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండల వైయస్సార్సిపి అధ్యక్షులు డాక్టర్ కోగిల సుబ్రహ్మణ్యం గురువారం జన్మదిన సందర్భంగా తొట్టంబేడు మండలంలో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు, ఈ జన్మదిన వేడుకలో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు,వారి సతీమణి మండల ఎంపీపీఉన్నం నిర్మలమ్మ జన్మదిన వేడుకలో పాల్గొని, మండల పార్టీ అధ్యక్షులకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మునిరాజా, పెరుమాళ్, సుబ్రహ్మణ్యం, కోగిల ముని కుమారి, మాజీ సర్పంచ్ నాగేంద్ర, వారితోపాటు, వైసిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొని వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు, పాల్గొన్నారు.

# స్వదేశీ 'కామికేజ్'కు మరో బలం

- **మ్యూనిషన్స్ ఇండియా--డ్రోగో ఏరోస్పేస్ మధ్య కీలక ఒప్పందం**
- **లోయిటరింగ్ మ్యూనిషన్, యూఏవీ వ్యవస్థల అభివృద్ధికి ఎంవోయూ**
- **వార్‌హెడ్ సాంకేతికతలో ఎంఐఎల్ నైపుణ్యం.. యూఏవీ రూపకల్పనలో డ్రోగో ఏరోస్పేస్ సామర్థ్యం**

ప్రజాభూమి ప్రతినిధి,హైదరాబాద్:

భారత రక్షణ రంగంలో స్వదేశీ సాంకేతికతకు మరింత ఊతమిచ్చే కీలక పరిణామం చోటుచేసుకుంది. రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్ (డీపీఎస్‌యూ) అయిన లిమ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్ (ఎంఐఎల్)లితో డ్రోగో ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. దేశీయంగా అభివృద్ధి చేసే మానవరహిత వైమానిక వాహనాలు (యూఏవీలు), లోయిటరింగ్ మ్యూనిషన్ వ్యవస్థల రూపకల్పన, అభివృద్ధి, సమీకరణపై రెండు సంస్థలు ఇక నుంచి కలిసి పనిచేయనున్నాయి. ఈ ఒప్పందంపై డ్రోగో ఏరోస్పేస్ నుంచి డ్రోగో ఏరోస్పేస్ వ్యవస్థాపకుడు, సీఈఓ యశ్వంత్ బొంతు ,ఎం ఐ ఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుమార్ వైభవ్ గౌర్ పూణే లో శుక్రవారం సంతకాలు చేశారు.

**రెండు సంస్థల నైపుణ్యాలు ఒక్కటిగా..**

ఈ భాగస్వామ్యంలో డ్రోగో ఏరోస్పేస్ యూఏవీ ప్లాట్‌ఫామ్ రూపకల్పన, అభివృద్ధి, తయారీతో పాటు సంబంధిత ఖాళీ పేలోడ్ హార్డ్‌వేర్ అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించనుంది. మరోవైపు ఎంఐఎల్ తనకు ఉన్న రక్షణ మందుగుండు సామగ్రి, వార్‌హెడ్ సాంకేతికతలోని నైపుణ్యాన్ని అందించనుంది. ఎంఐఎల్ భారత ప్రభుత్వ యాజమాన్యంలోని రక్షణ రంగ తయారీ సంస్థ. దీని ప్రధాన కార్యాలయం పూణేలో ఉంది. 2021 లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డును ఏడు వేర్వేరు ప్రభుత్వ రంగ సంస్థలుగా పునర్నిర్మించినపుడు దీన్ని స్థాపించారు. భారత సాయుధ దళాలు, విదేశీ మిలిటరీలు, దేశీయ పౌర అవసరాల కోసం ఇక్కడ మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాలు, రాకెట్లు, బాంబులను తయారు చేస్తారు. మ్యూనిషన్స్ డిజైన్, పేలుడు పదార్థ వ్యవస్థలు, పేలోడ్ ఫిల్లింగ్, ఫ్యూజింగ్, మాడ్యులర్ మ్యూనిషన్ అభివృద్ధి వంటి విభాగాల్లో ఎంఐఎల్ తన సాంకేతిక సామర్థ్యాన్ని ఒప్పందంలో భాగంగా వినియోగించనుంది.

**యూఏవీ--మ్యూనిషన్ సమీకరణపై ఉమ్మడి కసరత్తు**

రెండు సంస్థలు కలిసి మ్యూనిషన్--యూఏవీ సమీకరణ, స్థిర భద్రతా మూల్యాంకనం, ఫీల్డ్/రేంజ్ పరీక్షలు, నాణ్యతా ధ్రువీకరణ వంటి తదుపరి దశలపై పనిచేయనున్నాయి. దీంతో యూఏవీ ఇంజినీరింగ్, మ్యూనిషన్ సాంకేతికత, పేలోడ్ వ్యవస్థలు, రక్షణ రంగ ప్రమాణాలకు అనుగుణమైన సమీకరణ సామర్థ్యాలను ఒకే వేదికపైకి తీసుకురానున్నాయి.

విజయవంతమైన 'డెల్టా వింగ్ కామికేజ్' పరీక్ష ఈ భాగస్వామ్యానికి ఇటీవల హైదరాబాద్‌లో విజయవంతంగా పరీక్షించిన 'డెల్టా వింగ్ కామికేజ్' ప్రత్యేక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. డ్రోగో ఏరోస్పేస్ అభివృద్ధి చేస్తున్న స్వదేశీ డెల్టా-వింగ్ కామికేజ్ యూఏవీ/లోయిటరింగ్ మ్యూనిషన్ ప్లాట్‌ఫామ్ ఇది.ఇవి శత్రువుల లక్ష్యాన్ని సొంతంగా గుర్తించి, దానిపైకి వేగంగా దూసుకెళ్లి తాము కూడా పేలిపోతాయి .రక్షణ రంగంలో ఉపయోగించే 'డెల్టా వింగ్ కామికేజ్' అనే పదానికి తెలుగులో "త్రికోణాకార ఆత్మాహుతి (డ్రోన్/విమానం)" అని అర్థం.ఈ పదాన్ని పూర్తిగా విడదీసి చూస్తే సులభంగా అర్థమవుతుంది: డెల్టా వింగ్ అంటే 'డెల్టా' అనే గ్రీకు అక్షరం లాగా త్రికోణాకారంలో ఉండే రెక్కలు అని అర్థం. ఈ రకమైన డిజైన్ ఉన్న విమానాలు లేదా డ్రోన్లు గాల్లో చాలా స్థిరంగా, వేగంగా ప్రయాణించగలవు. కామికేజ్ అనేది ఒక జపనీస్ పదం. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ పైలట్లు బాంబులు ఉన్న తమ విమానాలతో శత్రువుల నౌకలను నేరుగా ఢీకొట్టి ఆత్మాహుతి దాడులు చేసేవారు. రక్షణ రంగంలో దీనిని "ఆత్మాహుతి" దాడి అంటారు. ప్రస్తుత ఆధునిక యుద్ధాల్లో ఈ పదాన్ని ఎక్కువగా "కామికేజ్ డ్రోన్లు" విషయంలో వాడుతున్నారు.త్రికోణాకార రెక్కలు కలిగి ఉండి, పేలుడు పదార్థాలతో శత్రు స్థావరాలపై నేరుగా దూసుకెళ్లి, వాటితో పాటే పేలిపోయే ఆత్మాహుతి డ్రోన్లను 'డెల్టా వింగ్ కామికేజ్' అని పిలుస్తారు. ఇవి ఒకసారి వెళ్తే తిరిగి రావు, లక్ష్యాన్ని తాకి తనను తాను నాశనం చేసుకుంటాయి. దీర్ఘశ్రేణి రక్షణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు డ్రోగో ఏరోస్పేస్ సంస్థ వెల్లడించింది. దీనికి 1,000 కిలోమీటర్ల వరకు డిజైన్ చేసిన మిషన్ పరిధి, సుమారు 20--30 కిలోల వార్‌హెడ్ మోసుకెళ్లే సామర్థ్యం ఉండేలా అభివృద్ధి చేస్తున్నట్లు సంస్థ తెలిపింది. ఎంఐఎల్‌తో కుదిరిన తాజా ఒప్పందం ద్వారా ఈ ప్లాట్‌ఫామ్‌కు అవసరమైన మ్యూనిషన్, వార్‌హెడ్ సమీకరణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు తదుపరి అభివృద్ధి, సమీకరణ, ధ్రువీకరణ దశలకు ముందుకు తీసుకెళ్లేందుకు సహకారం అందనుంది.

**'భారత రక్షణ అవసరాలకు స్వదేశీ పరిష్కారాలే లక్ష్యం'**

ఈ సందర్భంగా డ్రోగో ఏరోస్పేస్ వ్యవస్థాపకుడు, సీఈఓ యశ్వంత్ బొంతు మాట్లాడుతూ.. భారత రక్షణ అవసరాల కోసం అధునాతన స్వదేశీ మానవరహిత వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో తమ డెల్టా వింగ్ కామికేజ్ కీలక ముందడుగని పేర్కొన్నారు. డ్రోగో ఏరోస్పేస్‌కు ఉన్న యూఏవీ ఇంజినీరింగ్ సామర్థ్యాలు, మ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్‌కు ఉన్న మందుగుండు సామగ్రి, వార్‌హెడ్ సాంకేతిక నైపుణ్యాలు కలవడం ద్వారా ఈ భాగస్వామ్యానికి మరింత బలం చేకూరుతుందని తెలిపారు. ఇటీవల డెల్టా వింగ్ కామికేజ్ విజయవంతమైన పరీక్ష తమకు మంచి ఊపునిచ్చిందని, తదుపరి దశలో సమీకరణ, ధ్రువీకరణ, మిషన్ సిద్ధత దిశగా ముందుకు సాగేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఎం ఐ ఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కుమార్ వైభవ్ గౌర్ మాట్లాడుతూ "డ్రోగోతో సహకారం ద్వారా భారత రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగస్వామ్యం కల్పిస్తున్న ఈ ఎంవోయూలో భాగమైనందుకు వేము సంతోషిస్తున్నాం." అన్నారు.

**స్వదేశీ రక్షణ తయారీకి ఊతం**

భారత్‌లోనే అధునాతన రక్షణ వ్యవస్థల అభివృద్ధి, తయారీని ప్రోత్సహించాలనే లక్ష్యానికి ఈ ఎంవోయూ అనుగుణంగా ఉంది. యూఏవీ ఇంజినీరింగ్, లోయిటరింగ్ మ్యూనిషన్ టెక్నాలజీ, పేలోడ్ వ్యవస్థలు, రక్షణ రంగ సమీకరణ సామర్థ్యాలను కలిపి దేశీయ రక్షణ తయారీ వ్యవస్థను బలోపేతం చేయడమే ఈ భాగస్వామ్య ప్రధాన ఉద్దేశం. ఈ భాగస్వామ్యం ద్వారా భారత సాయుధ దళాలు, ఇతర అధీకృత రక్షణ అవసరాల కోసం తదుపరి తరం స్వదేశీ మానవరహిత వ్యవస్థల అభివృద్ధికి రెండు సంస్థలు దోహదపడాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి.

**రక్షణ రంగంలో మరో స్వదేశీ అడుగు**

యూఏవీ సాంకేతికతతో పాటు మ్యూనిషన్ సాంకేతికతను దేశీయంగా సమీకరించే దిశగా డ్రోగో ఏరోస్పేస్, మ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్ భాగస్వామ్యం ప్రాధాన్యం సంతరించుకుంది. స్వదేశీ రక్షణ ఉత్పత్తుల అభివృద్ధి, సాంకేతిక స్వావలంబన, దేశీయ తయారీ సామర్థ్యాల పెంపునకు ఇది మరో ముందడుగుగా నిలవనుంది.

# ఇది మెగా డీఎస్సీ కాదు.. మేనేజ్డ్, మానిప్యులేటెడ్ డీఎస్సీ

ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి:

'టెట్' అర్హత లేని వారికి, కనీసం పరీక్ష కూడా రాయని వారికి బ్యాక్ డోర్‌లో టీచర్ పోస్టింగులు ఇచ్చి, ఉద్యోగాల దందా చేశారని, తద్వారా మంత్రి నారా లోకేష్ వందల కోట్లు దోపిడి చేశారని వైయస్సార్‌సీపీ టీచర్ ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కల్పలతారెడ్డి ధ్వజమెత్తారు. అర్హులైన అభ్యర్థుల గొంతు కోసి, అడ్డదారిలో వెన్నుపోటు పార్టీ కార్యకర్తలకు టీచర్ ఉద్యోగాలు అమ్ముకున్నారని వారు ఆరోపించారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతూ వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరుతో మెగా కుంభకోణానికి తెర లేపిందని మండిపడ్డారు. నవీన్ అనే వ్యక్తి వ్యవహారంతో మొదలైన క్వశ్చన్ పేపర్ లీకేజీ, కోచింగ్ సెంటర్లకు చేరి, అక్కణ్నుంచి అమ్ముకోవడం జరిగిందని వైయస్సార్‌సీపీ టీచర్ ఎమ్మెల్సీలు పి.చంద్రశేఖర్‌రెడ్డి, కల్పలతారెడ్డి ఆక్షేపించారు. స్పోర్ట్స్ కోటా ముసుగులో కనీసం జరగని టోర్నమెంట్లకు సైతం నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగాలు అమ్ముకున్నారని ఆధారాలు ప్రదర్శించారు. స్వయంగా 870 నకిలీ సర్టిఫికెట్లు వచ్చాయని స్వయంగా శాప్ ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ చెప్పినా, కనీసం ఒక్కరిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేయకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. శాసనమండలిలో ఈ అక్రమాలపై చర్చకు పట్టుబడితే, దానికి బదులు చెప్పలేక సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ సభ నుంచి పారిపోయారని ఎద్దేవా చేశారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఏకంగా విద్యాశాఖ వెబ్‌సైట్‌లోని డేటాను తారుమారు చేసి, చివరకు ఆ వెబ్‌సైట్‌నే మాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక పక్క ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించాలని న్యాయబద్ధంగా పోరాడుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ, మరో పక్క టెట్ లేకుండా అక్రమంగా ఉద్యోగాలు పొందిన వారితో ప్రభుత్వం ధర్నాలు చేయించడం దారుణమన్నారు. గత 15 రోజులుగా ఈ కుంభకోణానికి సంబంధించిన అన్ని ఆధారాలను వైఎస్సార్సీపీ ప్రజల ముందు పెడుతున్నా ప్రభుత్వం నుంచి ఉలుకూ పలుకూ లేదన్నారు. తప్పు చేయకపోతే ఈ మెగా కుంభకోణంపై తక్షణమే సీబీఐ విచారణకు ఆదేశించాలని వారు డిమాండ్ చేశారు. ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని వైఎస్సార్సీపీ నేతల గొంతు నొక్కాలని చూస్తే ఊరుకునేది లేదని, నిరుద్యోగుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కల్పలతారెడ్డి ఇంకా ఏం మాట్లాడారంటే..: టీచర్ ఉద్యోగానికి టెట్ తప్పనిసరి అని కేంద్ర నిబంధనలు, విద్యాహక్కు చట్టం, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా చెబుతున్నాయి. డీఎస్సీ నోటిఫికేషన్‌లో కూడా టెట్ అర్హత తప్పనిసరి అని ప్రభుత్వం పేర్కొంది. మీరు అసెంబ్లీలో చదివిన స్టేట్‌మెంట్‌లోనూ టెట్ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. డీఎస్సీ టెట్ లేకుండా ఏవిధంగా రిక్రూట్‌మెంట్ చేస్తారు? అలాంటప్పుడు టెట్ లేదని స్పష్టంగా తేలిన ఈడిగ ప్రభాకర్ అనే వ్యక్తికి ఎస్జీటీ ఉద్యోగం ఎలా ఇచ్చారు? కెమెరా ముందు తనకు టెట్ లేదని ప్రభాకర్ స్వయంగా చెప్పిన తర్వాత తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగం నుంచి తీసేశారు. ఒక్క ప్రభాకర్ మాత్రమే కాదు.. చాలా మందికి టెట్ లేకుండానే ఉద్యోగాలిచ్చారు. ఈ విషయం బయటపడిన తర్వాత అధికారులు కూడా వాస్తవాలను నిర్ధారించారు. మరి ఆ ఒక్క కేసుతోనే చేతులు దులుపుకుంటే సరిపోతుందా? టెట్ లేని వారికి ఉద్యోగాలు ఇచ్చిన మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరగాలి. డీఎస్సీ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంలో నవీన్ పేరు మొదటి నుంచీ బయటకు వచ్చింది. ప్రశ్నాపత్రం లీక్ అయి కొన్ని కోచింగ్ సెంటర్లకు చేరిందన్న ఆరోపణలపై మేము ఆధారాలతో ప్రశ్నిస్తున్నాం. నవీన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు రాలేదని, ఎన్‌ఓసీ ఇవ్వలేదని అధికారులు చెబుతున్నారు. కానీ ఆ వాదనలోనే అనేక ప్రశ్నలు ఉన్నాయి. అతను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అయితే ఎన్‌ఓసీ ఎందుకు? అతనికి ఫస్ట్ ర్యాంక్ వచ్చినప్పటికీ ఉద్యోగం ఎందుకు ఇవ్వలేదు? ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై పూర్తి నిజాలు ప్రజల ముందు పెట్టాలి. స్పోర్ట్స్ కోటాలో 382 పోస్టులు భర్తీ చేశారు. కానీ ఆ కోటాలో ఫేక్ సర్టిఫికెట్లు, తప్పుడు మెరిట్ వివరాలు, బ్యాకప్ సర్టిఫికెట్లలో వేరే క్రీడలు, వాస్తవ రికార్డుల్లో లేని ప్లేస్‌మెంట్లు వంటి అనేక అంశాలు బయటకు వస్తున్నాయి. ఒక అభ్యర్థి మెయిన్ సర్టిఫికెట్‌లో ఒక గేమ్, బ్యాకప్ సర్టిఫికెట్‌లో మరో గేమ్ ఉండటం ఎలా సాధ్యం? మేము ఆధారాలతో ప్రశ్నించిన తర్వాత వెబ్‌సైట్‌లోని డేటానే మార్చడం, చివరకు వెబ్‌సైట్‌ను లేపేయడం ఎందుకు జరిగింది? జీరో ర్యాంకు వచ్చినప్పుడు ఖచ్చితంగా స్పోర్ట్స్ కోటా కిందనే తీసుకోవాలి.

జూడోలో పార్టిసిపేషన్ సర్టిఫికేషన్ ఉంటే ఉద్యోగం ఇస్తున్నారు. టోర్నమెంట్ జరగకుండానే ఉద్యోగాలు ఇచ్చేశారు. ఫేక్ సంతకాలతో ఉద్యోగాలు ఇచ్చారు. ఖమ్మంలో అసలు 2013లో జూడో టోర్నమెంటే జరగలేదని అసోసియేష్ లిఖితపూర్వకంగా ఇచ్చినప్పటికీ, ఆ ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు ఎలా అమ్ముకున్నారో ఈ ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ఆ సర్టిఫికెట్‌లో సంతకాలు తమవి కాదని ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ కు చెందిన కైలాష్ యాదవ్ స్వయంగా చెప్పారు. జూడోలో ఒకే కేటగిరీ, ఒకే వెయిట్ విభాగంలో ఇద్దరు అభ్యర్థులకు ఒకే రెండో స్థానం చూపించి ఫేక్ సర్టిఫికెట్లు ఎలా సష్టించి ఉద్యోగాలు ఇచ్చారు? అసలు అధికారిక రిజిస్టర్ తెప్పించి చూస్తే ఆ స్థానాన్ని దుష్యంత్ రెడ్డి సాధించినట్లు రికార్డులో ఉంది. మరి అసలు విజేత పేరును పక్కన పెట్టి మరొకరికి మెరిట్ ఎలా ఇచ్చారు? గుంటూరులో హ్యాండ్‌బాల్‌లో కనీసం ప్లేస్ కూడా రాని అమ్మాయికి మెరిట్‌లో థర్డ్ ప్లేస్ అని తప్పుడు సర్టిఫికెట్ పెట్టి స్కూల్ అసిస్టెంట్ పోస్ట్ ఎలా ఇచ్చారు? స్పోర్ట్స్ కోటాలో 870 నకిలీ క్రీడా సర్టిఫికెట్లను గుర్తించామని శాప్ ఛైర్మన్ స్వయంగా టీవీలో ఒప్పుకున్నారు. తర్వాత సమాచార హక్కు చట్టం ద్వారా అడిగితే 32 మంది ఫేక్ సర్టిఫికెట్లు సమర్పించారని సమాచారం ఇచ్చారు. 870 మంది అని మొదట ప్రకటించి, తర్వాత 32 మందికి పరిమితం చేసి బేరసారాలకు ఎందుకు దిగారు? ఆ 32 మందిపై ఇప్పటివరకు ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకున్నారు? నోటిఫికేషన్‌లో ఫేక్ సర్టిఫికెట్లపై క్రిమినల్ చర్యలు ఉంటాయని చెప్పి ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారు?

లక్షలాది నిరుద్యోగులు కష్టపడి పరీక్షలు రాశారు. మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఉద్యోగం వస్తుందని ఆశించారు. కానీ మెరిట్‌తో వచ్చిన వారిని పక్కనపెట్టి, అధికార పార్టీకి సంబంధించిన వ్యక్తులకు బ్యాక్ డోర్‌లో రెడ్ కార్పెట్ వేశారు. యువగళం పాదయాత్రలో పాల్గొన్న వెన్నుపోటు పార్టీ కార్యకర్తలకు, మీ నాయకుల పిల్లలకే ఉద్యోగాలు ఇచ్చి కోట్లు దండుకోవడం వాస్తవం కాదా? డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చారు, ఎవరు ఎక్కువ ఇస్తే వారికి ఉద్యోగాలు ఇచ్చారు. 1:1 రేషియో, నార్మలైజేషన్ పేరుతో అన్యాయం జరిగిన వారికి ఎందుకు న్యాయం చేయరు? డీఎస్సీ--2025 అక్రమాలు జరిగినట్టు మా దగ్గర ఆధారాలు ఉన్నాయి. డీఎస్సీపై చర్చ కోసం కౌన్సిల్‌లో ఎంత అడిగినా ప్రభుత్వంలో ఉలుకూ పలుకూ లేదు. ఆధారాలు ఉన్నాయని చెబుతున్నా పట్టించుకోలేదు. నాలుగు రోజుల పాటు శాసనమండలి సమావేశాలు జరిగినా డీఎస్సీ అక్రమాలపై సమాధానం చెప్పడానికి ప్రభుత్వం ముందుకు రాలేదు. లోకేష్, చంద్రబాబులు సమాధానం చెప్పలేక సభ నుంచి పారిపోయారు. బయట అసెంబ్లీలో మాత్రం రంకెలేశారు. డీఎస్సీ మీద ఎంక్వయిరీ విషయాన్ని పక్కనపెట్టి వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు. ప్రభుత్వంతో చర్చించడానికి మేం సిద్ధంగా ఉన్నాం. దమ్ముంటే చర్చకు రావాలి. అక్రమాలపై ప్రశ్నిస్తే టీచర్ల మీద కేసులు పెడతాం, సస్పెండ్ చేస్తామంటూ బెదిరించడం మీ దుర్మార్గపు ధృతరాష్ట్ర పాలనకు నిదర్శనం. డీఎస్సీ అక్రమం గురించి మాట్లాడిన వారిపై కేసులు పెడుతున్నారు. ఐఏఎస్ అధికారులే బెదిరిస్తున్నారు. ఉద్యోగాలు పొందిన వారితో ప్రభుత్వం టీచర్లతో ధర్నాలు చేయించడం ఏంటి? ప్రభుత్వ ఉద్యోగులను రాజకీయ ధర్నాలకు ఉపయోగించుకోవడం ఎక్కడైనా చూశామా? ఈ విధానాన్ని ప్రభుత్వం వెంటనే ఆపాలి. డీఎస్సీలో అక్రమాలు జరగలేదని దమ్ముంటే నిరూపించండి. ప్రశ్నపత్రం లీక్ నుంచి రిక్రూట్‌మెంట్ పూర్తయ్యే వరకు జరిగిన ప్రతి అంశంపై సమగ్ర దర్యాప్తు జరగాలని వైఎస్సార్సీపీ డిమాండ్ చేస్తోంది. మేము ఆరోపణలు మాత్రమే చేయడం లేదు. జీవోలు, ఎఫ్ఐఆర్‌లు, ఆడియో రికార్డింగ్‌లు, సర్టిఫికెట్లు, అధికారిక రికార్డులతో సహా ఆధారాలు ప్రజల ముందుంచాం. వైఎస్సార్సీపీ, డీఎస్సీ అభ్యర్థులు లేవనెత్తిన ప్రశ్నలకు కచ్చితంగా సమాధానం చెప్పాలి. వైఎస్సార్సీపీ సీబీఐ ఎంక్వయిరీ మాత్రమే అడుగుతోంది. ప్రభుత్వం నిజాయితీగా ఉంటే సీబీఐ విచారణకు ఎందుకు ముందుకు రావడం లేదు? సీబీఐ విచారణకు ఆదేశించే ధైర్యం లేదంటే డీఎస్సీలో అక్రమాలకు పాల్పడినట్లు అంగీకరించినట్లేనని ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కల్పలతారెడ్డి స్పష్టం చేశారు.

**-- స్పోర్ట్స్ కోటాలో కనీవినీ ఎరుగని రీతిలో నకిలీ సర్టిఫికెట్ల కుంభకోణం**
**-- జరగని టోర్నమెంట్ల పేరుతో దొంగ సర్టిఫికెట్ల సృష్టి.. ఫేక్ సంతకాలతో ఉద్యోగాలు**
**-- పక్కా ఆధారాలతో సహా దొరికిపోయినా ఉలుకూ పలుకూ లేని ప్రభుత్వం**
**-- అక్రమాలు దాచుకునేందుకు ఏకంగా విద్యాశాఖ వెబ్‌సైట్ గల్లంతు**
**-- డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించామని చెప్పే అర్హత ప్రభుత్వానికి లేదు**
**-- నవీన్ నుంచి ప్రభాకర్ వరకు.. డీఎస్సీలో అక్రమాల పరంపర**
**-- అర్హులైన నిరుద్యోగుల గొంతు కోసి పార్టీ కార్యకర్తలకు ఉద్యోగాలు**
**-- టెట్ లేని వారికి టీచర్ ఉద్యోగాలా?.. ఇదేం న్యాయం?**
**-- క్వశ్చన్ పేపర్ లీకేజీలో అసలు దోషులను కాపాడే కుట్ర**
**-- డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు భయమెందుకు?**
**-- కౌన్సిల్ లో చర్చకు రమ్మంటే ముఖ్యమంత్రి, మంత్రులు పరార్**
**-- ఉద్యోగాలు పొందిన వారితోనే ధర్నాలు చేయించడం సిగ్గుచేటు**
**-డీఎస్సీ అక్రమాలపై దమ్మంటే సీబీఐ విచారణ వేయాలి**
**-: వైయస్సార్‌సీపీ టీచర్ ఎమ్మెల్సీల డిమాండ్**

# తుమ్మలగుంటలో వేడుకగా శ్రీకృష్ణ జన్మాష్టమి --కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు -ఉట్టి కొట్టి సందడి చేసిన వేదపాఠశాల విద్యార్థులు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు స్వామివారి మూలమూర్తికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం దైనందిన పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. తర్వాత రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుల వారిని అలంకార మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయం ముందు నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేదపాఠశాల విద్యార్థులు ఉట్టి కొట్టి ఉత్సాహంగా సందడి చేశారు. విద్యార్థుల కేరింతలతో ఆలయ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా కల్యాణ వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ పరిసరాలు భక్తుల రాకతో సందడిగా మారాయి.



# డీఎస్సీ-2025 ఎంపికలపై కంప్యూటర్ క్రాస్ వెరిఫికేషన్‌కు ప్రభుత్వం సిద్ధమా?

**డీఎస్సీ-2025 అక్రమాల డొంక కదులుతోంది.. కర్నూలు నుంచి రాష్ట్రవ్యాప్తంగా తీగలు!**
**టెట్‌లో పాస్ కానివారికి స్పోర్ట్స్ కోటాలో టీచర్ పోస్టులా?**
**ఆధారాలతో సహా ఒక్కొక్కటిగా బయటపడుతున్న వాస్తవాలు**
**డీఎస్సీ అక్రమాలపై వెన్నుపోటు కూటమి**
**డీఎస్సీ పాపాలను ఎంతకాలం కప్పిపుచ్చుతారు?**
**కర్మ బలంతో ఒక్కొక్కటిగా బట్టబయలు!**
**టెట్ అర్హత తప్పనిసరి నిబంధనను పక్కన పెట్టిన ప్రభుత్వం**
**స్పోర్ట్స్ కోటాలో నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు ఎలా జరిగాయి?**
**మెగా డీఎస్సీ కాదు.. అది నిరుద్యోగులను ముంచిన 'దగా డీఎస్సీ':**
**టెట్ అర్హత లేకున్నా ఉద్యోగాలు.. యువగళం కోటాలో స్పోర్ట్స్ ముసుగులో కోట్ల దందా**
**బయటపడ్డ డీఎస్సీ అక్రమాలపై గోతులదొడ్డి బడుల్లో చీకటి విచారణలా?**
**డీఎస్సీ-2025 బాగోతంపై సీబీఐ విచారణ జరిపించాలి**
**అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలి:**
**మాజీ మంత్రి పేర్ని నాని డిమాండ్ .**

ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి:

కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ-2025 ఒక 'మెగా డీఎస్సీ' కాదని, అది నిరుద్యోగుల గొంతు కోసిన 'దగా డీఎస్సీ' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నారా లోకేష్ తన 'యువగళం' కోటా కింద, నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి అర్హత లేని తమ వారికి స్పోర్ట్స్ కోటా పేరుతో లక్షల రూపాయలకు టీచర్ ఉద్యోగాలు అమ్ముకున్నారని ఆరోపించారు. స్వయంగా ప్రజలే ఆధారాలతో సహా ఈ పాపాలను బట్టబయలు చేస్తున్నా, ప్రభుత్వం ఇంకా బుకాయించడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ-2025లో ఎంపికైన అభ్యర్థుల టెట్ స్కోర్, కేటగిరీ, సబ్జెక్ట్ అర్హత, కేటాయించిన పోస్టును కంప్యూటర్ ఆధారంగా క్రాస్ వెరిఫికేషన్ చేయడానికి ప్రభుత్వం సిద్ధమా? అని నాని సూటిగా ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు నాయుడు, లోకేష్ నాయుడులకు నిజాలు బయటపెట్టే దమ్ముందా? స్పోర్ట్స్ కోటాలో సమర్పించిన సర్టిఫికెట్లను, ముఖ్యంగా జరగని ఈవెంట్లకు సంబంధించినవిగా ఆరోపణలు వస్తున్న సర్టిఫికెట్లను పూర్తిస్థాయిలో వెరిఫై చేయించే ధైర్యం ఉందా? అని నిలదీశారు. ఈ వ్యవహారంపై స్వతంత్ర థర్డ్ పార్టీ ఏజెన్సీ అయిన సీబీఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకా ఏమన్నారంటే... కర్మ అనేది ఎవరినీ వదిలిపెట్టదు. అధికార బలంతో, అనుకూల మీడియా ప్రచారంతో ఎంత కాలం పాపాలను కప్పిపుచ్చగలరు? తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మా నాయకుడు జగన్ మోహన్ రెడ్డి గారు తీగ లాగితే, రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ-2025 పాపాల డొంకంతా కదులుతోంది. నిన్నటిదాకా అసలు తప్పే జరగలేదన్న ఈ పాలకులు, ఇవాళ 16 వేల మందిలో ఒక్క తప్పు జరిగిందని తప్పించుకోవాలని చూస్తున్నారు. ప్రజలే శోధించి ఆధారాలతో సహా లోకేష్ బండారాన్ని బద్దలు కొడుతున్నారు. ప్రభుత్వ జీవో నం. 15 ప్రకారం టీచర్ ఉద్యోగం రావాలంటే టెట్ అర్హత తప్పనిసరి. ఏ కోటాలో వచ్చినా ఈ నిబంధన వర్తిస్తుంది. బీసీలకు 75 మార్కులు రావాల్సి ఉండగా, కర్నూలు జిల్లా కౌతాలం మండలం ఒల్లూరు ప్రాథమిక పాఠశాలలో కేవలం 65 మార్కులు వచ్చిన ప్రభాకర్ అనే వ్యక్తికి ఎస్జీటీ ఉద్యోగం ఎలా ఇచ్చారు? 150 మార్కులకు కనీస అర్హత సాధించని అభ్యర్థి ఆన్‌లైన్ దరఖాస్తును కంప్యూటర్ ఎలా స్వీకరించింది? డీఈవోలు, ఐఏఎస్ అధికారులు ఎదురెదురుగా కూర్చుని స్క్రూటినీ చేశామని చెప్పారు కదా.. మరి ఈ అనర్హుడిని ఎలా ఎంపిక చేశారు? పైనుంచి వచ్చిన బలమైన ఒత్తిళ్లు కాక దీనికి కారణమేంటి? ఎవరూ రారు, చూడరు అనే ధీమాతో కర్ణాటక సరిహద్దున ఉన్న కర్నూలు జిల్లా కౌతాలం మండలంలో ఏకంగా 24 మంది స్పోర్ట్స్ కోటా టీచర్లను నియమించారు. ఒక్క ఒల్లూరు స్కూల్‌లోనే ఐదుగురు స్పోర్ట్స్ కోటా వాళ్లే పాఠాలు చెబుతున్నారు. 41 ఏళ్ల వయసులో 2009-10 నాటి జూడో పార్టిసిపేషన్ సర్టిఫికెట్ తెచ్చుకుంటే, 42 ఏళ్లకు టీచర్ కొలువు ఇచ్చేశారు. జూడో ఆడేవాళ్లే లేని రాష్ట్రంలో 30-40 మందికి ఎలా ఉద్యోగాలు ఇచ్చారు? ఇంత జరుగుతుంటే ఎంఈవో, డీఈవో ఆఫీసుల్లో కాకుండా 'గోతులదొడ్డి' స్కూల్లో చీకట్లో రహస్య విచారణలు ఎందుకు జరుపుతున్నారు?

"శాప్ ఇవాళ ఒక దొంగల బండిలా మారింది. శ్రీకాళహస్తిలోని ఒక ప్రైవేట్ బీఈడీ కళాశాల కేంద్రంగా ఈ స్పోర్ట్స్ సర్టిఫికెట్ల దందా నడిచింది. నోటిఫికేషన్ ఇచ్చేటప్పుడు రాత పరీక్ష నిబంధనను ఎత్తేస్తూ జీవో 4, జీవో 47 తెచ్చారు. మేము నిలదీశాక మళ్లీ జీవోలు మార్చారు. గుర్రపు స్వారీ (ఈక్వెస్ట్రియన్), ఫెన్సింగ్, రైఫిల్ షూటింగ్ వంటి సంపన్నుల ఆటలను ఏ-కేటగిరీలో పెట్టి.. సామాన్యులు ఆడే కబడ్డీ, బాడీబిల్డింగ్, చెస్, క్యారమ్స్‌లను బి-కేటగిరీకి నెట్టేశారు. అసలు జరగని టోర్నమెంట్లకు ఫేక్ సర్టిఫికెట్లు తెచ్చిన వారికి కొలువులు కట్టబెట్టారు.

చిత్తూరు జిల్లాలో ఓసీ అభ్యర్థికి 90 మార్కులు రావాల్సి ఉండగా, 79 మార్కులే వచ్చినా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లాలో తెలుగులో టెట్ రాస్తే, సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ పోస్టింగ్ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన వారి టెట్ స్కోర్, సబ్జెక్ట్ అర్హతలను కంప్యూటర్ ద్వారా క్రాస్ వెరిఫికేషన్ చేసే దమ్ము ఈ ప్రభుత్వానికి ఉందా? తక్షణమే ఈ 'దగా డీఎస్సీ'పై సీబీఐ లేదా థర్డ్ పార్టీతో విచారణ జరిపించాలి. నారా లోకేష్ వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలి

పాతికేళ్లు, ముప్పై ఏళ్లుగా నిబద్ధతతో పాఠాలు చెబుతూ సమాజానికి ఎంతో మంది ప్రయోజకులను అందించిన సీనియర్ టీచర్లకేమో టెట్ పాస్ కావాలని వేధిస్తారు. కానీ మీ యువగళం కోటాలో అర్హత లేకపోయినా, టెట్ తప్పినా పర్వాలేదంటూ అడ్డగోలుగా ఉద్యోగాలు కట్టబెడతారా? లోకేష్ తన ఆత్రంతో రాజకీయాల్లో ఒక కామెడీ పీస్‌గా మారిపోతున్నారు. డబ్బులిచ్చి సర్వేలు రాయించుకుంటూ 82 శాతం అక్షరాస్యత వచ్చిందని ట్వీట్లు వేసుకోవడం హాస్యాస్పదం. గత రెండేళ్లలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక, చదువు భారమై సుమారు నాలుగైదు లక్షల మంది పేద విద్యార్థులు బడులు, కాలేజీలు మానేశారు. వీళ్లకు ఇవ్వడానికి నిధులు ఉండవు గానీ, యోగా మ్యాట్లకు, ప్రతినెలా సీఎం పెన్షన్ ఇచ్చేందుకు తిరిగే ఆర్భాటాలకేమో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని తగలేస్తున్నారు. ఎన్నికలప్పుడు ఉద్యోగులకు ఐఆర్, పీఆర్సీ ఇస్తామని ఊదరగొట్టిన వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం.. తీరా అధికారంలోకి వచ్చాక 31 వేల కోట్ల రూపాయల బకాయిలను ఎగ్గొట్టారని నాని మండిపడ్డారు. ఒకపక్క ఉద్యోగుల జీతాల భారం అంటూనే, పాత డీఎస్సీ పాపాలను కప్పిపుచ్చుకోవడానికి రెండో డీఎస్సీ అంటూ డ్రామాలు ఆడుతున్నారని తేల్చి చెప్పారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు ఆపి, ఉద్యోగుల బకాయిలు చెల్లించి, డీఎస్సీ అక్రమాలపై పూర్తిస్థాయి నిష్పక్షపాత విచారణ జరిపించాలని నాని డిమాండ్ చేశారు.

## ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు

ప్రజాభూమి,పులివెందుల

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 5, 6 తేదీల్లో 129--పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు ఓటరు నమోదు అధికారి చిన్నయ్య తెలిపారు.ఈ ప్రత్యేక శిబిరాల్లో ప్రజలు ఓటరు నమోదు సంబంధిత ఫారం -6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను సంబంధిత బూత్ స్థాయి అధికారులు కు సమర్పించవచ్చని ఆయన తెలిపారు . కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారు ఫారం-6 ఓటరు జాబితాలో పేరు తొలగింపు లేదా అభ్యంతరాల కోసం ఫారం-7, ఓటరు వివరాల్లో మార్పులు, సవరణలు తదితర అవసరాల కోసం ఫారం-8 దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు.ప్రత్యేక శిబిరాల సందర్భంగా సంబంధిత బి ఎల్ వోలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమకు కేటాయించిన ప్రదేశాల్లో అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, అవసరమైన దరఖాస్తులను సంబంధిత బి ఎల్ ఓ లకు సమర్పించాలని ఆయన కోరారు.

## చౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో కొలువైన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి ప్రీతికరమైన శ్రావణ మాసము 4వ శుక్రవారము పురస్కరించుకుని ఉదయస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ విశేష పంచామృతాభిషేకం,కుంకుమార్చన ,మహా మంగళహారతి తదితర పూజా కైంకర్యాలు అనంతరం విశేష అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకించి శ్రావణ శుక్రవారము కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారన్నారు.ఆలయున ఉదయం 10.30 గంటలకు సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించడం జరిగిందన్నారు.ఈ సందర్భముగా ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ దేవస్థానము ప్రాముఖ్యత ప్రత్యేకత గురించి మాట్లాడుతూ శుక్రవారము లేదా మంగళ వారము పౌర్ణమి అమావాస్య రోజున 108 ప్రదక్షిణములు చేసి అమ్మని వేడుకుంటే కోరిన కోరికలు తప్పకుండా నెరవేరుతాయని భక్తుల నమ్మకము అని తెలిపారు. కుంకుమార్చనలు అభిషేకాలు ఇతర పూజలు చేపించుకోదలచినవారు ఆలయ అర్చకులు మఠం.ప్రవీణ్ స్వామి వారిని సంప్రదించాలని తెలిపారు.ఆలయ ప్రాంగణం మొత్తము అమ్మవారి నామస్మరణతో జై చౌడమ్మ తల్లి కాపాడమ్మ అని మార్మోగాయి..ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ,భక్తదులందరూ పాల్గొన్నారు.

## వినాయక చవితి పండుగ సందర్భంగా శాంతి భద్రతలు, ప్రజల భద్రతపై పోలీస్ శాఖ సమీక్ష సమావేశం

ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి

చంద్రగిరి మండల పరిధిలో వినాయక చవితి పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటు మరియు నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా నిర్వహించేందుకు మండపాల కమిటీ సభ్యులు మరియు ప్రజలకు సంబంధిత అధికారులు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా చంద్రగిరి పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ సురేష్ కుమార్ సబ్‌ఇన్‌స్పెక్టర్ అరుణాచలం , ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన కళ్యాణ్ డ్యామ్ సుదీప్ రెడ్డి , విద్యుత్ శాఖ నాగరాజు తొండవాడ పంచాయతీ సెక్రటరీ పాల్గొని ప్రజలకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా అధికారులు సూచించిన ముఖ్యమైన అంశాలు:వినాయక మండపాలను ఏర్పాటు చేసే ప్రదేశంలో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మండపాల వద్ద ఏర్పాటు చేసే సౌండ్ సిస్టం కారణంగా చుట్టుపక్కల నివసించే ప్రజలకు ఇబ్బంది కలగకుండా శబ్ద పరిమితులను పాటించాలి. మద్యం సేవించి నిమజ్జన కార్యక్రమానికి ఎవరూ వెళ్లకూడదు. నిమజ్జన సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. నిమజ్జనం జరిగే చెరువులు, బావులు, కుంటలు తదితర నీటి వనరుల వద్దకు చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలను తీసుకెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని సాయంత్రం 7:00 గంటలలోపు పూర్తి చేయాలి.వినాయక మండపాల వద్ద భక్తి పాటలు, భజనలు మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాలు మాత్రమే నిర్వహిస్తూ, అసభ్యకరమైన పాటలు, నృత్యాలు వంటి కార్యక్రమాలకు దూరంగా ఉండాలి.రాత్రి 10:00 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ సౌండ్ సిస్టమ్‌ను వినియోగించరాదు. వినాయక విగ్రహాల ఎత్తును సాధ్యమైనంత తక్కువగా ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. నిమజ్జనం సమయంలో విద్యుత్ వైర్లు, చెట్లు మరియు ఇతర అడ్డంకులకు విగ్రహం



తగలకుండా, సురక్షితంగా నిమజ్జనం చేయడానికి వీలుగా విగ్రహం ఎత్తును నిర్ణయించుకోవాలి. వినాయక విగ్రహం ఏర్పాటు చేసుకునే కమిటీ సభ్యులు తప్పనిసరిగా చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో అనుమతి (పర్మిషన్) తీసుకోవాలి.వినాయక మండపం వద్ద రాత్రి సమయంలో కాపలాగా ఒక వ్యక్తిని తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలి. వినాయక మండపాల వద్ద ఎటువంటి గొడవలు, ఘర్షణలు లేదా వివాదాలకు పాల్పడరాదు. ప్రతి ఒక్కరూ సంయమనంతో వ్యవహరించాలి. మండపాల నిర్వాహకులు అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన ఎమర్జెన్సీ నంబర్లను మండపం వద్ద అందుబాటులో ఉంచుకోవాలి. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడిన వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం అందించాలి. వినాయక మండపాల వద్ద డీజేలను ఉపయోగించడానికి అనుమతి లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలను వినియోగించరాదు. టపాకాయలు కాల్చడానికి ఎటువంటి అనుమతి లేదు. మండపాల వద్ద లేదా నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా టపాకాయలు కాల్చరాదు.ప్రజలు, మండపాల నిర్వాహకులు మరియు కమిటీ సభ్యులు పై సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ పోలీస్ శాఖ మరియు సంబంధిత అధికారులకు సహకరించాలని అధికారులు కోరారు.భక్తిశ్రద్ధలకు ప్రాధాన్యతనిస్తూ, శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా, ప్రశాంతమైన మరియు సురక్షితమైన వాతావరణంలో చంద్రగిరి మండలంలో వినాయక విగ్రహ ప్రతిష్ఠ, నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించుకోవాలని చంద్రగిరి పోలీస్ శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. "భక్తితో పండుగ జరుపుకుందాం...బాధ్యతతో భద్రతను కాపాడుకుందాం."

## అధికారుల్లో కానరాని చలనం..!!

### -ఆరోపణలున్నా నర్సింగ్ హోమ్‌లో ప్రసూతి సేవలు
### -డీఎంహెచ్ఓ తనిఖీ చేసినా చర్యలు శూన్యం

ప్రజాభూమి,
హిందూపురం టౌన్



హిందూపురం పట్టణంలోని పరిగి రోడ్డులో నిర్వహిస్తున్న ఓ నర్సింగ్ హోమ్‌లో ప్రసూతి వైద్య సేవల నిర్వహణపై పలు ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత ప్రత్యేక వైద్య అర్హతలు లేని వైద్యురాలు స్త్రీ వైద్య నిపుణురాలిగా వ్యవహరిస్తూ గర్భిణులకు వైద్య సేవలు అందించడంతోపాటు కాన్పులు, సిజేరియన్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఈ ఆసుపత్రిలో నిర్వహించిన ఓ ఆపరేషన్ అనంతరం మహిళ మృతి చెందిన ఘటనపై బాధితులు ప్రజా సంఘాల సహకారంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయినప్పటికీ ఇప్పటికీ అదే ఆసుపత్రిలో ప్రసూతి సేవలు కొనసాగుతుండటం పలు ప్రశ్నలకు తావిస్తోంది.

**సాధారణ వైద్యం నుంచి.. ప్రసూతి సేవల వరకు...**

సంబంధిత నర్సింగ్ హోమ్‌ను నిర్వహిస్తున్న వైద్యురాలు ఎంబీబీఎస్ విద్యార్హత కలిగి ఉన్నప్పటికీ, ప్రత్యేక స్త్రీ వైద్య నిపుణురాలిగా పనిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గర్భిణులకు పరీక్షలు నిర్వహించడం, కాన్పులు చేయడం, సిజేరియన్ ఆపరేషన్లు నిర్వహించడం వంటి సేవలు అందిస్తున్నట్లు స్థానికుల నుంచి సమాచారం వస్తోంది. అయితే ప్రసూతి వైద్య సేవలు, ముఖ్యంగా శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు సంబంధిత ప్రత్యేక అర్హతలు, ఆసుపత్రికి అవసరమైన అనుమతులు, నిపుణుల పర్యవేక్షణ తదితర అంశాలు కీలకం. ఈ నేపథ్యంలో సదరు ఆసుపత్రిలో ఏ వైద్యులు ఏ అర్హతలతో సేవలు అందిస్తున్నారు, ప్రసూతి, శస్త్రచికిత్సలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా, అనే విషయాలను వైద్యశాఖ అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

**ఆపరేషన్ వికటించి మహిళ మృతి....**

గతంలో ఇదే ఆసుపత్రిలో ఓ మహిళకు ఆపరేషన్ నిర్వహించిన అనంతరం పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన చోటుచేసుకుందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై బాధితులు ప్రజా సంఘాల ప్రతినిధులతో కలిసి ఉన్నతాధికారులను ఆశ్రయించి ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. ఒక మహిళ మృతి చెందిన ఘటనపై ఫిర్యాదు అందినప్పుడు వైద్యశాఖ అధికారులు సమగ్ర విచారణ నిర్వహించి, వైద్య సేవల్లో ఏమైనా లోపాలు ఉన్నాయా, ఆపరేషన్ నిర్వహించిన వైద్యులకు తగిన అర్హతలు ఉన్నాయా, ఆసుపత్రికి అవసరమైన అనుమతులు ఉన్నాయా, వంటి అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. అయితే ఆ ఫిర్యాదులపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటన్నది అధికారికంగా వెల్లడికాలేదు.

**డీఎంహెచ్ఓ తనిఖీ చేసినా..**

ప్రస్తుత జిల్లా వైద్యాధికారిణి గత ఏడాది ఆ నర్సింగ్ హోమ్‌ను పరిశీలించినట్లు సమాచారం. ఆసుపత్రిలోని వైద్య సేవలు, సిబ్బంది అర్హతలు, అనుమతులు, ప్రసూతి సేవలకు సంబంధించిన సదుపాయాలు, ఆపరేషన్ థియేటర్ తదితర అంశాలను అధికారులు పరిశీలించినట్లు తెలుస్తోంది. అయితే తనిఖీ జరిగి ఏడాది దాటుతున్నా ఆసుపత్రిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారన్నది స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. తనిఖీలో ఎలాంటి లోపాలు గుర్తించలేదు అనుకుంటే ఆ విషయాన్ని అధికారులు వెల్లడించాలి. నిబంధనలకు విరుద్ధంగా సేవలు అందిస్తున్నట్లు తేలితే చర్యలు ఎందుకు తీసుకోలేదో చెప్పాలి.

ఇప్పటికీ ఆగని ప్రసూతి సేవలు. అధికారుల తనిఖీ అనంతరం కూడా ఆ నర్సింగ్ హోమ్‌లో గర్భిణులకు వైద్య సేవలు అందుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కాన్పులతో పాటు సిజేరియన్ ఆపరేషన్లు కూడా జరుగుతున్నట్లు సమాచారం. ఇదే అంశం ఇప్పుడు ప్రజల్లో ఆందోళనకు కారణమవుతోంది. గతంలో ఒక మహిళ మృతి చెందిన ఘటనపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో, సంబంధిత వైద్య అర్హతలు మరియు ఆసుపత్రి అనుమతులపై స్పష్టత లేకుండానే ప్రసూతి సేవలు కొనసాగుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సమగ్ర విచారణకు డిమాండ్ ఆ నర్సింగ్ హోమ్‌పై వచ్చిన ఆరోపణలన్నింటిపైనా జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ నిర్వహించాలని ప్రజలు, ప్రజా సంఘాలు కోరుతున్నారు. ఆసుపత్రి రిజిస్ట్రేషన్, వైద్యుల అర్హతలు, ప్రసూతి సేవలకు సంబంధించిన అనుమతులు, ఆపరేషన్ థియేటర్ నిర్వహణ, గతంలో జరిగిన మహిళ మృతి ఘటనకు సంబంధించిన వైద్య రికార్డులు తదితర అంశాలను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణల్లో వాస్తవం ఉంటే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే అధికారికంగా స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

## భక్తిపరవశంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

### -కృష్ణ పరమాత్మ కృపకు జీవితం ధన్యం, -ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి. పుష్ప రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి రూరల్,

శ్రీకృష్ణ పరమాత్మ జన్మదినమైన శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు శ్రీ విజయ గణపతి ఆలయ ధర్మకర్త, బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు పుష్పరెడ్డి కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. పలు ఆలయాల్లో పూజలు నిర్వహించి శ్రీకృష్ణ పరమాత్మను దర్శించుకున్నారు.ఉదయం తిరుచానూరు నేతాజీ నగర్‌లోని శ్రీ విజయ గణపతి ఆలయంలో శ్రీకృష్ణుడి వేషధారణలో ఉన్న చిన్నారులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం మధ్యాహ్నం చిగురువాడ పంచాయతీ కొత్తూరులోని శ్రీకృష్ణ ఆలయంలో ఆలయ ధర్మకర్త, సీనియర్ టీడీపీ నాయకులు శివా యాదవ్ ఆహ్వానం మేరకు పుష్ప మునిరామ్ రెడ్డి దంపతులు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు, కళ్యాణోత్సవంలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, శివా యాదవ్ కుటుంబ సభ్యులు పుష్ప మునిరామ్ రెడ్డి దంపతులను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా తిరుపతి టీడీపీ సీనియర్ నాయకులు, డిస్ట్రిక్ట్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు జగన్నాథం, భగవద్గీత,సనాతన ధర్మ ప్రచారకులు రామ్ జీ ,ఇతర సభ్యులు కలిసి పుష్ప మునిరామ్ రెడ్డి దంపతులను సత్కరించి గోమాత ప్రతిమను ఆత్మీయ కానుకగా అందజేశారు. సాయంత్రం తిరుపతి ఇస్కాన్ శ్రీ కృష్ణ స్వామిని దర్శించుకుని రోజంతా శ్రీ కృష్ణ భక్తిపరవశంలో గడిపారు.ఈ సందర్భంగా పుష్ప మునిరామ్ రెడ్డి దంపతులు





భావోద్వేగంతో మాట్లాడుతూ.."శ్రీకృష్ణాష్టమి రోజున శ్రీకృష్ణ పరమాత్మను పూజించి, దర్శించుకోవడం అందరికీ సాధ్యం. అయితే,మొన్న శ్రీ కృష్ణ పరమాత్మ లోకానికి మార్గదర్శి ఐన భగవద్గీతను అందుకోవడం ,నేడు ఆయనకు అత్యంత ప్రీతిపాత్రమైన గోమాత ప్రతిమను కానుకగా అందుకోవడం ఓ వరం!!! మా జీవితంలో మరపురాని ఆధ్యాత్మిక అనుభూతి. యాదృచ్ఛికంగా ఈ శ్రీకృష్ణాష్టమికి మా జీవితం ధన్యం అయ్యింది. మాకు శ్రీకృష్ణ పరమాత్మ ప్రసాదించిన మార్గం ,ఆశీస్సులుగా భావిస్తున్నాం" అని తెలిపారు. ప్రేమాభిమానాలతో సత్కరించిన పెద్దలు ,సన్నిహితులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములను చేసిన వారందరికీ జీవితాంతం రుణపడి ఉంటాం" అని పుష్ప మునిరామ్ రెడ్డి దంపతులు అన్నారు. "శ్రీకృష్ణుడు అర్జునుడికి అందించిన భగవద్గీత సందేశం యుగయుగాలకూ మానవాళికి మార్గదర్శకం. ధర్మాన్ని ఆచరించి,శ్రీకృష్ణ పరమాత్మ కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, శాంతిసౌభాగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం అంటూ ప్రజలందరికీ శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పులివెందులకు రైలు కూత మోగనుంది - కల సాకారానికి జగన్, అవినాష్ కృషే కారణం

ప్రజాభూమి, పులివెందుల



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాట ఫలితంతో పులివెందుల ప్రజల చిరకాల స్వప్నమైన రైలు మార్గం సాకారం కానుందని వైకాపా నేతలు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రత్యేక చొరవతో పులివెందులకు రైలు మార్గం సుగమం కానుందని తెలిపారు.పులివెందులలోని జగన్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్ఆర్సీపీ రాష్ట్ర నూర్ భాషా సంఘం అధ్యక్షులు రసూల్, మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి మాట్లాడారు.ముద్దనూరు - పులివెందుల మీదుగా ముదిగుబ్బ - పుట్టపర్తి రైల్వే లైన్‌కు సంబంధించి అధికారులు రూ.2,505 కోట్ల అంచనా వ్యయంతో 105.31 కిలోమీటర్ల మేర సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు ( డి పి ఆర్ ) సిద్ధం చేసి రైల్వే బోర్డుకు సమర్పించారని తెలిపారు.వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే పులివెందుల మీదుగా ప్రత్యామ్నాయ రైల్వే అలైన్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అధికారికంగా ప్రతిపాదించిందని, అప్పటి ప్రధాన కార్యదర్శి కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖతో పలుమార్లు చర్చలు జరిపారని గుర్తు చేశారు. అప్పటి నుండి ఇప్పటివరకు ఎంపీ అవినాష్ రెడ్డి పలుమార్లు కేంద్ర రైల్వే మంత్రిని కలిసి లిఖితపూర్వక వినతులు సమర్పించారని, దాని ఫలితంగానే సర్వేకు అనుమతి వచ్చి ఇప్పుడు డిపిఆర్ దశకు చేరిందన్నారు.ఈ రైల్వే లైన్ వల్ల పులివెందుల ప్రజలకే కాక రాయలసీమ మొత్తానికి ప్రయోజనం చేకూరుతుందని, ప్రయాణ, వ్యాపార, విద్య, వైద్య, పారిశ్రామిక అభివృద్ధితో పాటు బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు మెరుగైన కనెక్టివిటీ లభిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో దశరథరామిరెడ్డి, హాఫీజ్, దాసరి ఈశ్వరయ్య, మహేశ్వర్ రెడ్డి, వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

జనరల్

శనివారం, సెప్టెంబర్ 05, 2026 12


## ఇంద్రకీలాద్రిపై ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**ఆశీర్వచన మండపంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు**

**చిన్న రాజగోపురం వద్ద శాస్త్రోక్తంగా గోపూజ నిర్వహించిన ఈవో వి.కె. శీనా నాయక్**



జాభూమి ప్రతినిధి,ఇంద్రకీలాద్రి: శ్రీకృష్ణ జన్మాష్టమి (గోకులాష్టమి) పర్వదినాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం ఉదయం శ్రీకృష్ణ పూజా మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా నిర్వహించబడ్డాయి.ఉదయం 8:00 గంటలకు ప్రధానాలయ ప్రాంగణం లోని ఆశీర్వచన మండపంలో వేద పండితులు, అర్చకుల మంత్రోచ్ఛారణల నడుమ శ్రీకృష్ణ భగవానునికి విశేష పూజలు,పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ మరియు ఆలయ స్థానాచార్యులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు జరి పించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని ఆలయ చిన్న రాజగోపురం సమీపంలో దేవస్థానం ఆధ్వర్యంలో పవిత్ర గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ పాల్గొని గోమాతకు పసుపు-కుంకుమలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం గోవులకు స్వయంగా గ్రాసం తినిపించి ఆశీస్సులు అందుకున్నారు.సనాతన ధర్మంలో గోసంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఉందని, శ్రీకృష్ణావతార విశిష్టతను చాటుతూ ప్రతి ఒక్కరూ గోసేవను కర్తవ్యంగా భావించాలని ఈ సందర్భంగా ఈవో పేర్కొన్నారు.ఈ పూజా కార్యక్రమాలలో స్థానాచార్యులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత ప్రమాణాలు పాటించని హోటళ్లకు జరిమానాలు

**లోపాలను సరిదిద్దకుంటే తదుపరి చర్యలు తప్పవు**



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు, శుక్రవారం ఉదయం ప్రజారోగ్య విభాగం అధికారులు 37వ డివిజన్ పరిధిలోని కెనాల్ రోడ్ ప్రాంతంలో పలు హోటళ్లను తనిఖీ చేశారు.ఈ తనిఖీలలో భాగంగా కెనాల్ రోడ్ ప్రాంతంలోని స్వీట్ మ్యాజిక్, తాజ్ హోటల్, హోటల్ సాయి సరోవర్, మంగమ్మ కిచిడీ సెంటర్‌లను అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా హోటళ్లలోని వంటగదులను పరిశీలించగా, కిచెన్ గదులకు టైల్స్ లేకపోవడం, గోడలు మరియు ఇతర ప్రదేశాల్లో బూజు ఏర్పడటం, గోడలు అపరిశుభ్రంగా ఉండటం, ఆహార పదార్థాలను మూతలు లేకుండా నిల్వ చేయడం, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను గుర్తించడం, పరిసరాల్లో అపరి శుభ్ర వాతావరణం నెలకొని ఉండటం వంటి పలు లోపాలు గుర్తించారు.అదేవిధంగా, నాణ్యమైన తాగునీటిని వినియోగించకపోవడం, మరుగు దొడ్లు సరిపడా లేకపోవడం, ఉన్న మరుగుదొడ్లను సక్ర మంగా నిర్వహించకపోవడం, పరిశుభ్రత ప్రమాణాలను పాటించకుండా అపరిశుభ్ర వాతావరణం లో ఆహార పదార్థాల తయారీ మరియు విక్రయాలు నిర్వహించడం వంటి అంశాలను అధికారులు గుర్తించారు.ప్రజారోగ్యానికి విఘాతం కలిగించే విధంగా అపరిశుభ్ర పరిస్థితుల్లో హోటల్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నందుకు సంబంధిత మూడు హోటళ్లకు ఒక్కొక్కదానికి రూ.5,000 చొప్పున జరిమానా విధించి నోటీసులు జారీ చేశారు.నోటీసులు అందుకున్న హోటల్ యాజమాన్యాలు నిర్ణీత గడువులోగా గుర్తించిన లోపాలను పూర్తిస్థాయిలో సరిదిద్దుకోవాలని, పరిశుభ్రత మరియు ప్రజారోగ్య నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు ఆదేశించారు. నిర్ణీత గడువులోగా లోపాలను సరిచేయని పక్షంలో సంబంధిత యాజమాన్యాలపై చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టడంతో పాటు, అవసరమైతే ట్రేడ్ లైసెన్సులను రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఆహార విక్రయ కేంద్రాల నిర్వాహకులు పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యమైన ఆహారం మరియు సురక్షితమైన తాగునీటిని ప్రజలకు అందించాలని అధికారులు సూచించారు.ఈ తనిఖీలలో సర్కిల్-1 శానిటరీ సూపర్వైజర్ డి. సోమరాజు, శానిటరీ ఇన్స్పెక్టర్లు బి. యోగేంద్ర కుమార్, ఎం. రవిశంకర్ మరియు ప్రజారోగ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## రానున్న మున్సిపల్ ఎన్నికలపై శాఖాధిపతులతో టెలికాన్ఫెరెన్స్

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఉదయం నగరపాలక సంస్థ శాఖాధిపతులతో రానున్న మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై టెలికాన్ఫరెన్స్ నిర్వ హించారు.ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అదనపు కమిషనర్ జనరల్‌ను నోడల్ అధికారిగా నియమించగా, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గత మున్సి పల్ ఎన్నికల్లో అనుసరించిన విధానాలను పరిశీలించి, అవసరమైన మేరకు ఈ ఎన్నికల్లో కూడా సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. CDMA వారు కోర్టు ప్రొసీడింగ్స్ అమలు చేయాలని ఆదేశించగా వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, ఆదేశాలకు అనుగుణంగా వార్డుల డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేసి, తదనంతర చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డీలిమిటేషన్ ప్రక్రియ అనంతరం ప్రతి వార్డులో ఏర్పాటు చేయాల్సిన పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించాలని, పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, ర్యాంపులు తదితర సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన ఓటర్ల సంఖ్య, ఇతర అవసరమైన వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో నగరపాలక సంస్థకు చెందిన ప్రతి శాఖకు బాధ్యత ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో అప్పగించిన బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా నిర్వహిస్తూ, పరస్పర సమన్వయంతో పనిచేసి మున్సిపల్ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

## రాజకీయాల్లో 'ఓటుకు నోటు' విష సంస్కృతి తెచ్చిందే చంద్రబాబు

**అధికారం కోసం ప్రజల ఓటుకే వెల కట్టిన చరిత్ర చంద్రబాబుది**

**1996లో రూ.50తో మొదలైన ఓటుకు నోటు రాజకీయాలు**

**ప్రజలు డబ్బులు తీసుకోవద్దనడం కాదు నాయకులు డబ్బులు పంచడం మానేయాలి**

**రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నుంచే శ్రీకారం చుట్టండి**

**మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి**

ప్రజాభూమి ప్రతినిధి,నర్సారావుపేట: రాష్ట్ర రాజకీయాలు భ్రష్టు పట్టిపోవడానికి ముమ్మాటికీ వెన్నుపోటు పార్టీ అధినేత చంద్రబాబు నాయుడే కారణమని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ధ్వజమెత్తారు. దేశ స్వాతంత్ర్యానంతరం, రాష్ట్రావతరణ తర్వాత 1947 నుంచి ఎన్నో ప్రభుత్వాలు మారినా ఎక్కడా లేని 'ఓటుకు నోటు' సంస్కృతి లేదని ఆయన వెల్లడించారు. చంద్రబాబు సీఎం అయ్యాకే 1996లో రూ.50తో ఓటుకు నోటు అనేది మొదలైందని ఆయన తెలిపారు. ఆ తర్వాత అది ఇప్పుడు వికృతంగా మారి, వేల రూపాయలకు చేరిందని గుర్తు చేశారు. ఎన్నికల్లో ప్రజలు డబ్బు లు తీసుకోవద్దని చంద్రబాబు సుద్దులు చెప్పడం మానే యాలని కో రారు. ఎన్నికల్లో పార్టీలు ఓట్లకు నోట్లు పంచడం ఆపేలా అఖిలపక్షాన్ని పిలిచి నిర్ణయం తీసుకోవాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నుంచే ఈ మార్పునకు శ్రీకారం చుట్టాలని నర్సారావుపేటలో మీడియాతో మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, సీఎం కు సూచిం చారు.

ప్రెస్‌మీట్‌లో కాసు మహేష్‌రెడ్డి ఇంకా ఏం మాట్లాడారంటే..:1947 నుంచి 1995 వరకు రాష్ట్రంలో, దేశంలో అనేక ఎన్నికలు జరిగాయి. ఎన్టీఆర్, ఇందిరాగాంధీల ప్రభంజనాలు వచ్చాయి. ఎక్కడా ఓటుకు డబ్బులిచ్చే అలవాటు ప్రజలకు లేదు. 1994లో ఎన్టీ రామారావు గారి ప్రభంజనం ఏంటో ఈ రాష్ట్ర ప్రజలు చూశారు. 1995లో అడ్డదారిలో సీఎం అయ్యాక, 1996 పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని, తనను తాను నిరూపించుకోవాలని చంద్రబాబు నాయుడే మొదటిసారి ఓటుకు రూ.50 ఇచ్చి ఈ విష సంస్కృతిని ప్రవేశపెట్టారు. అలా ఎన్నికల్లో ప్రజల తీర్పును డబ్బుతో ప్రభావితం చేసే ప్రయత్నం చంద్రబాబు నుంచే మొదలైంది. అంతకు ముందు జరిగిన ఎన్నికల్లో ఘర్షణలు, రిగ్గింగ్‌లు ఉండి ఉండొచ్చేమో గానీ, ఓటును డబ్బుతో కొనే దౌర్భాగ్యం ఏనాడూ లేదు.

1996లో ఓటుకు రూ.50 ఇస్తూ చంద్రబాబు నాటిన విషబీజం ఆ తర్వాత మొక్కగా, మారి చివరకు పెద్ద చెట్టుగా మారింది. ఇప్పుడు ఓటుకు వేల రూపాయలు చెల్లిస్తున్నారు. ఒక్కో ఓటుకు రూ.2 వేల వరకు ఇస్తూ, ఒక్కో నియోజకవర్గంలో ఏకంగా రూ.50 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. అలా ఎన్నికల్లో ఒక్కో నియోజకవర్గంలో రూ.50 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు ఖర్చు పెడుతున్నారు. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఏకంగా రూ.17 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల వరకు డబ్బు చేతులు



మారుతోంది.గెల్చాక, తాము ఎన్నిక ల్లో చేసిన ఖర్చు రికవరీ చేసుకోవడానికి ఎమ్మెల్యేలు ఇసుక, మైనింగ్, లిక్కర్, సిమెంట్ దోపిడీలకు దిగుతున్నారు. చివరికి మాంసం దుకాణాల దందాలు, తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను సైతం తాకట్టు పెట్టే స్థాయికి దిగజారారు. ఎ న్నిక ల్లో ప్రజలు డబ్బు తీసుకోవడం మానేయలేరా' అని చంద్రబాబు సెలవిస్తున్నారు. నేను సూటిగా అడుగుతున్నా.. 'రాజకీయ నాయకులు ఓట్లకు డబ్బు ఇవ్వడం మానేయలేరా?' 1996లో ప్రజలేమైనా మాకు డబ్బులివ్వండి అని అప్లికేషన్లు పెట్టుకున్నారా? నాయకులే తమ స్వార్థం కోసం ప్రలోభపెట్టి ఈ అలవాటు చేశారు. దేశంలో మోదీ కంటే సీనియర్ అని చెప్పుకునే చంద్రబాబుకు ఈ జాడ్యాన్ని ఆపే సంకల్పం ఎందుకు లేదు? పక్క రాష్ట్రం తమిళనాడు లో కనీసం అనుభవం కూడా లేని సినీ నటుడు విజయ్ ఒక్క రూపాయి ఖర్చు పెట్టకుండా చరిత్ర సృష్టించాడని అనేక కథనాలు వింటున్నాం. ఏ లిక్కర్, శాండ్ మాఫియా వెల్లినా నేరుగా ప్రభుత్వానికి చెల్లించమంటున్నాడు. ఈ రోజు ఆంధ్రప్రదేశ్ లో ఆ పరిస్థితి ఉందా?. ఏపీలో అవినీతి తారాస్థాయికి చేరుతుంది. కారణం ఓటుకు డబ్బులిచ్చాం, మరలా ఎన్నికలకు వెళ్లాలి కాబట్టి.. మరలా కలెక్షన్లు. ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు ఆ మాత్రం చిత్తశుద్ధి ఎందుకు లేదు? రేపు చరిత్ర మిమ్మల్ని తీవ్రంగా ప్రశ్నిస్తుంది.అయ్యా, చంద్ర బాబు మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఆచరణలో చూపండి. వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేయండి. ఏ ఎన్నికలో కూడా ఓటుకు డబ్బు పంచే విష సంస్కృతికి మంగళం పాడేలా అందరినీ ఒప్పించండి. మీరూ ఆచరించి చూపండి. రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నుంచే దాన్ని అమలు చేయండి. మీరు మొదలుపెట్టిన విష సంస్కృతికి మీరే మంగళం పాడండి ఈ ధన ప్రవా హం వల్ల స్థానిక సంస్థల్లో సర్పంచ్ అభ్యర్థులు కూడా రూ.50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు అప్పు చేసి మరీ ఖర్చు చేస్తున్నారు. గెల్చిన తర్వాత, అంతకు ముందు ఎన్నికల్లో చేసిన ఖర్చును తిరిగి రాబట్టుకోవడం కోసం, అప్పులు తీర్చుకోవడానికి దొంగ బిల్లులు పెట్టుకోవాల్సి వస్తోంది. దీంతో ప్రజాసేవ చేయాలనే తపన ఉన్న నిజమైన నాయకులు కనుమరుగైపోయింది. మరోవైపు ఎక్కడెక్కడో వ్యాపారాలు, కాంట్రాక్టులు చేసి బాగా సంపాదించిన వారు, ఎన్నారైలు వచ్చి వాలు తున్నారు. అలా స్థానిక ఎన్నికల్లో పోటీ కోసం డబ్బు మూటలతో వస్తున్నారని, ఏ విధంగానూ ఇది మంచి సంస్కృతి కాదని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి స్పష్టం చేశారు.

## కృష్ణాష్టమి సంబరాల్లో పరవశించిన బందరు





**గోపాలుని సేవలో మంత్రి కొల్లు రవీంద్ర**

**ధర్మాన్ని మనం రక్షిస్తే.. మనల్ని ఆ పరమాత్ముడే కాపాడుతాడు**

**మచిలీపట్నంలో ఆధ్యాత్మిక శోభ..**

**ఉట్టి కొట్టి, బాల గోపాలురతో అలరించిన మంత్రి**

**రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా మచిలీపట్నం ఆధ్యాత్మిక చైతన్యంతో పులకించిపోయింది. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని బందరు పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో ఈ వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో సాగాయి.ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలుమంత్రి కొల్లు రవీంద్ర ఉదయం నుంచే బందరులోని పలు ప్రాంతాల్లో పర్యటించి వేడుకల్లో చురుగ్గా పాల్గొన్నారు.

భక్తి పారవశ్యం: బందరుకోట రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, భక్తులతో కలిసి కోలాటం, కర్రసాము ఆడటంతో పాటు ఉట్టి కొట్టి ఉత్సాహపరిచారు.

బాలకృష్ణులతో సందడి: గొడుగుపేటలో శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలో ఉన్న చిన్న పిల్లల సాంస్కృతిక నృత్యాలను తిలకించి, వారితో కాసేపు సరదాగా గడిపారు.

ఆలయాల సందర్శన: సర్కిల్ పేట సంతాన వేణు గోపాలస్వామి వారిని, నిజాంపేట బొమ్మల మెడ ఆలయాన్ని దర్శించుకుని ప్రార్థ నలు చేశారు.

గోసేవ - అన్నదానం: ఆర్.గొల్లపాలెంలో భక్తులకు స్వయంగా అన్నదానం వడ్డించారు. అనంతరం సర్కిల్ పేటలోని తన సొంత గోశాలతో పాటు రామాలయంలోనూ గోవులకు నైవేద్యం, పలాహారాలు అందించారు.అధర్మంపై ధర్మం సాధించిన విజయమే జన్మాష్టమిఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లా డుతూ "కృష్ణాష్టమి అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, అది మానవాళికి భగవంతుడు ఇచ్చిన గొప్ప ఆధ్యాత్మిక సందేశం. సమాజంలో అధర్మం పెరిగినప్పుడు ధర్మాన్ని రక్షించడానికి, దుష్టు లను శిక్షించడానికి పరమాత్ముడు అవతరిస్తాడు. 'పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దు ష్కృతామ్' అనే భగవద్గీత సూక్తికి ప్రతీక ఈ రోజు. మనం ధర్మమార్గాన్ని పాటిస్తే, మనల్ని రక్షించే బాధ్యత ఆ శ్రీకృష్ణుడే తీసుకుంటాడు" అని పేర్కొన్నారు. వేణుగాన లోలుని కృపతో రాష్ట్రం లోని ప్రతి ఇంటా సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.

## ఇంద్రకీలాద్రిపై ఉత్సాహభరితంగా 'ఉట్టి కొట్టే' వేడుకలు

**శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని రాజగోపురం ఎదుట ఘనంగా వేడుకల నిర్వహణ**

**భక్తిపారవశ్యంతో పాల్గొన్న చిన్నారులు,భక్తజనం**



ప్రజాభూమి ప్రతినిధి,ఇంద్రకీలాద్రి: శ్రీకృష్ణ జన్మాష్టమి (గోకులాష్టమి) పర్వదినాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం సంప్రదాయ 'ఉట్టి కొట్టే' (ఉట్లోత్సవం) వేడుక అత్యంత వైభవంగా, కోలాహలంగా జరిగింది.ఆలయ రాజగోపురం ముందు భాగంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకకు పెద్ద సంఖ్యలో భక్తులు, చిన్నారులు తరలివచ్చారు. మొదటగా ఆలయ అర్చకులు పూజాదికములు నిర్వహించగా, ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వికె శీనానాయక్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఉట్టి కొట్టే వేడుకల్లో చైర్మన్, ఈవో, అధికారులు, ట్రస్ట్ బోర్డు మెంబెర్స్ తో పాటు భక్తులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టిని కొట్టేందుకు పోటీపడ్డారు. మంగళవాయిద్యాల చప్పుళ్లు, వేద మంత్రాలు,'గోవిందా.. గోపాల..' నామస్మరణలు మరియు భక్తుల కేరింతల నడుమ ఉట్టి సంబరం ఆద్యంతం కనులవిందుగా సాగింది. కృష్ణుని బాల్య లీలలను గుర్తుచేసే విధంగా ఉత్సాహపూరిత వాతావరణాన్ని సిబ్బంది కల్పించారు. ఉదయం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక అభిషేకాలు, గోపూజల అనంతరం సాయంత్రం జరిగిన ఈ ఉట్టి ఉత్సవంతో ఇంద్రకీలాద్రిపై కృష్ణాష్టమి సంబరాలు పరిపూర్ణ ఆధ్యాత్మిక శోభతో ముగిశాయి.ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు పి.రాఘవరాజు, ఎ. శ్రీనివాసరావు, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకర బాబు,ఉప ప్రధాన అర్చకులు బి. శంకర శాండిల్య,ఉప కార్యనిర్వహణాధికారి కిషోర్ కుమార్, సహాయకార్యనిర్వహణాధికార్లు ఎస్. రమేష్ బాబు, డాక్టర్ కె. గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమం తిలకించారు.

## ఇంటింటికి తెలుగుదేశం – 2 ఏళ్ల నమ్మకం

**అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం సూపర్ హిట్**

**కోటి మైలురాయిని దాటిన ఇంటింటికి తెలుగుదేశం**

**2026కోటి ఇల్లును సందర్శించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు అభినందనలు**

**పల్లా శ్రీనివాసరావు**

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేసేందుకు తెలుగుదేశం పార్టీ ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తున్న ''ఇంటింటికి తెలుగు దే శం - 2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షే మం'' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుంది. నాయకులు, కార్యకర్తల పట్టుదలతో కేవలం 40 రోజుల్లోనే కోటి ఇళ్లను సందర్శించి రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనను, ప్రజలకు అందిన సంక్షేమ వివరాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతోపాటు సూపర్ సిక్స్ హామీ అమలు తీరును ప్రజలకు వివరించారు. పార్టీ కేడర్ ప్రజలతో మమేకం కావాలనే సంకల్పానికి ఈ కోటి ఇళ్ల సందర్శన మైలు రాయి ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి రోజూ లక్షలాది కుటుంబాలను నేరుగా కలుస్తూ, ప్రజలతో మమేకం అవుతూ.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, రెండేళ్ల కూటమి పాలన విజయాలను వివరించడంతో





పాటు ప్రజల అభిప్రాయాలను సేకరిస్తూ వారి సమస్యల పరిష్కార దిశగా పార్టీ శ్రేణులు కృషి చేశారు. ఈ మైలురాయి చేరుకోవడం పార్టీ నాయ కులు, కార్యకర్తలదే క్రెడిట్. కార్య క్రమా న్ని విజయవంతంగా ముందుండి నడి పి స్తున్న కార్యకర్తలకు అభినందనలు. ప్రజల నుంచి లభిస్తున్న విశేష స్పందన ఈ కార్యక్రమం విజయానికి నిదర్శనం. పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంతో, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని పల్లా శ్రీనివాసరావు తెలిపారు.


Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Sri Lakshmi Offset Printers, R.S. No.268/2;D.No. 8/180,Surampalli Village, Gannavaram Mandalam, Krishna district, Andhra Pradesh and Published from D.NO. 32-26-85/6, MSR Street Marutinagar, Eluru Road, Vijayawada-520004,Krishna district, Andhra Pradesh, Editor :A.RAMAMOHANREDDY, RNI NO. APTEL/2011/41440, Phone No. Cell : 9502116677

## నల్లచెరువుపల్లి వైఎస్ఆర్సీపీ కార్యకర్త మృతి పట్ల వైకాపా నేతల సంతాపం



ప్రజాభూమి ప్రతినిధి-వేముల

వేముల మండలం నల్లచెరువుపల్లికి చెందిన వైఎస్ఆర్సీపీ ఎస్సీ కార్యకర్త కంబటి శ్రీనివాసులు మృతి చెందడం పట్ల వైఎస్ఆర్సీపీ నాయకులు సంతాపం తెలిపారు. వేముల మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ నాగెళ్ల సాంబశివారెడ్డి, ఎంపీటీసీ నరసింహా రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులు కుమారుడు ప్రభాకర్, భార్య అంజనమ్మ, మాజీ సర్పంచ్ వెంకటేష్ లను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు చిన్నారెడ్డి, జనార్ధన్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎస్సీ నాయకులు గంగులయ్య, రామాంజనేయులు, వెంకటరమణ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముక్కంటీ సేవలో రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మెన్ సీఎం రమేష్



ప్రజా భూమి ప్రతినిధి-శ్రీ కాళహస్తి టౌన్

శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా దేవి సమేత శ్రీకాళహస్తీశ్వరా స్వామి వారి సేవలో పాల్గొనడానికి కుటుంబ సమేతంగా రైల్వే స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ మరియు అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు " సి.యం. రమేష్ కి శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, గుడి ఛైర్మెన్ కొట్టె సాయి కలిసి సాదర స్వాగతం తెలియజేయడం జరిగింది. స్వామి అమ్మవార్ల దర్శనం చేసుకున్న అనంతరం వేదతో పాటు వాయు లింగేశ్వరుని తీర్థప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధేర్ రెడ్డితో పాటు భారతీయ జనతా పార్టీకి చెందిన రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్, జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్. హరీష్ రెడ్డి పాల్గొన్నారు.

## శ్రీ సాయి ధ్యాన మందిరంలో భక్తిశ్రద్ధలతో జన్మాష్టమి వేడుకలు



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి గ్రామంలోని విరుపా టౌన్షిప్లో ఉన్న శ్రీ సాయి ధ్యాన మందిరంలో శుక్రవారం జన్మాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయమే శ్రీకృష్ణుడు, సాయిబాబా వార్లకు పంచామృత అభిషేకం, స్నపన అలంకరణ, అర్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో నారాయణీయం పారాయణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. జన్మాష్టమి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీకృష్ణుడు, సాయిబాబా వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

# భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు - భక్తులకు అన్నదానం

ప్రజాభూమి ప్రతినిధి-పులివెందుల

పులివెందులలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని శ్రీకృష్ణ ఆలయంలో తెల్లవారుజాము నుంచే ఆలయ అర్చకులు గోపూజ, గణపతి పూజ, మూలవిరాట్టుకు పంచామృత అభిషేకం, ప్రత్యేక అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతి, కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో క్యూలైన్లలో నిలబడి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. అనంతరం ఆలయ కమిటీ



ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**శ్రీకృష్ణుని సేవలో ప్రముఖులు:**

మున్సిపల్ వైకాపా ఇన్చార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి, వైఎస్ సునీతా రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ లు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఆలయ చైర్మన్ ధరణి రమణ దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

**కృష్ణుడు, రాధా వేషధారణలో చిన్నారులు**



కృష్ణాష్టమి సందర్భంగా ఇళ్లలో పండుగ శోభ సంతరించుకుంది. మహిళలు తమ చిన్నారులకు కృష్ణుడు, రాధ వేషాలు వేసి సంబరంగా జరుపుకున్నారు. ఇంటి ముందు పిండితో చిన్ని కృష్ణుడి పాదాలు వేసి బాలకృష్ణుడిని ఇంటిలోకి ఆహ్వానించారు.

### గురుపూజోత్సవం ఉత్తమ ఉపాధ్యాయ

# అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎంపీ అంబిక





ప్రజాభూమి ప్రతినిధి-అనంతపురం

అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్లో ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ, మేరా యువ భారత్, యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవం మరియు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొని, డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ప్రపంచంలో ఉపాధ్యాయ వృత్తిని మించిన గొప్ప వృత్తి మరొకటి లేదని నేను విశ్వసిస్తాను. ఉపాధ్యాయులు విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను మాత్రమే బోధించకుండా, వారి జీవితాలకు మార్గదర్శకులుగా నిలుస్తూ, సమాజానికి ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విశిష్ట సేవలు అందిస్తున్న 65 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించడం ఎంతో ఆనందంగా అనిపించింది. ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించిన ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్ ని ఈ సందర్భంగా అభినందించాను. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారిని సత్కరించే ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షిస్తున్నాను. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు అంకితభావంతో పనిచేస్తున్న ప్రతి ఉపాధ్యాయుడికి హృదయపూర్వక గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు సిబ్బంది, సత్య రామ్, వెంకటేశ్వర రెడ్డి, బంధువుకు రాజా, లవ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లు మరోసారి తప్పులు సరి చేసుకునేందుకు అవకాశం

**తహసిల్దార్ శ్రీనివాస్**

ప్రజా భూమి ప్రతినిధి-వేలేరుపాడు.

రాష్ట్ర చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్ అమరావతి, ఆంధ్రప్రదేశ్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్, ఏలూరు జిల్లా, వారి ఆదేశముల మేరకు వేలేరుపాడు మండల పరిధిలోని 23 పోలింగ్ కేంద్రాలలో రీ షెడ్యూల్ అనుసరించి ది.05-09-2026 మరియు 06-09-2026 లలో సంబంధిత పోలింగ్ కేంద్రాలలో బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లతో ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 05.00 గంటల వరకు వారి వారి పోలింగ్ కేంద్రాలలో స్పెషల్ కాంపెయిన్ డేస్ (ప్రత్యేక ప్రచారపు రోజులు) నిర్వహించెదరు. సదరు స్పెషల్ డ్రైవ్ నందు, కట్ ఆఫ్ తేది 01.10.2026 నాటికి 18 సంవత్సరములు నిండిన వారు కొత్త ఓటర్ గా నమోదు చేసుకోవటం, ఓటర్ ఐడి లోని పేరు, జెండర్ సవరణ కొరకు, ఓటును ఒక పోలింగ్ స్టేషన్ నుంచి వేరొక పోలింగ్ స్టేషన్ కు లేదా వేరొక నియోజకవర్గం నకు బదిలీ మొదలగు వాటి సంబంధిత ఫారమ్ ల ద్వారా దరఖాస్తు చేసుకొనవచ్చును. కావున సదరు అవకాశమును వేలేరుపాడు మండలం లోని అన్ని గ్రామముల ప్రజలు వినియోగించుకొనవలసినదిగా వేలేరుపాడు తాసిల్దార్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు.

## విజయవాడలో ఎంపీ చిన్ని సుడిగాలి పర్యటన

- ఒకే రోజు 10 కృష్ణాలయాలను సందర్శించిన ఎంపీ కేశినేని చిన్ని
- కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది -ఎంపీ (చిన్ని)

ప్రజాభూమి ప్రతినిధి-విజయవాడ

విజయవాడ(తూర్పు సెంట్రల్ పశ్చిమ నియోజకవర్గాలు)శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని విజయవాడలో ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని ఒకే రోజు 10 కృష్ణాలయాలను సందర్శించి, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయాల్లో స్వామివారిని దర్శించుకుని, ప్రజలందరికీ శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రజలు శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారని అన్నారు. ఈ పవిత్ర పర్వదినాన కృష్ణాలయాలను సందర్శించి, భక్తులతో కలిసి వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కృష్ణాష్టమి వంటి పండుగలు మన ఆధ్యాత్మిక సంప్రదాయాలను, సంస్కృతిని, కుటుంబ విలువలను భావితరాలకు అందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఎంపీ చిన్ని పేర్కొన్నారు. పండుగల ద్వారా మన సంస్కృతిలోని గొప్పతనాన్ని పిల్లలకు తెలియజేయడంతో పాటు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ కలిసి ఆనందాన్ని పంచుకునే అవకాశం లభిస్తుందని అన్నారు. శ్రీకృష్ణుడు భగవద్గీత ద్వారా సమాజానికి అందించిన సందేశం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని ఎంపీ చిన్ని తెలిపారు. ధర్మాన్ని ఆచరించడం, కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించడం, కష్టసుఖాలను సమానంగా స్వీకరించడం వంటి విలువలు శ్రీకృష్ణుడి బోధనల్లో ఉన్నాయని చెప్పారు. భగవద్గీత సందేశాలను జీవితంలో ఆచరిస్తే వ్యక్తిగతంగా, సామాజికంగా మంచి మార్పు తీసుకురావచ్చని అన్నారు. విజయవాడలోని కృష్ణాలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుంటున్నారని, ఆలయాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొందని ఎంపీ చిన్ని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు, భక్తులు, సేవా సిబ్బంది చేస్తున్న ఏర్పాట్లను ఆయన అభినందించారు. ప్రజలందరూ శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ధర్మమార్గంలో నడుస్తూ, సమాజంలో ప్రేమ, శాంతి, సోదరభావం, మానవతా విలువలను పెంపొందించాలని ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని ఆకాంక్షించారు. శ్రీకృష్ణాష్టమి పర్వదినం ప్రతి కుటుంబంలో ఆనందాన్ని, భక్తిని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ బుద్ధా వెంకన్న సీనియర్ టిడిపి నాయకులు బొప్పన భవ కుమార్, మరియు ఆయా నియోజకవర్గాల టిడిపి నాయకులు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# డోకిపర్రు మహాక్షేత్రంలో కన్నుల పండువగా సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు

- డోకిపర్రు మహాక్షేత్రంలో కన్నుల పండువగా సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు
- భారీ సంఖ్యలో హాజరైన మహిళలు
- పాల్గొన్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సుధ, కుటుంబసభ్యులు

ప్రజాభూమి ప్రతినిధి-డోకిపర్రు

డోకిపర్రు మహాక్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ భూసమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు కన్నుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమైన వ్రత పూజ సుమారు రెండు గంటలకు పైగా జరిగింది. పూజలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సుధ, నిర్వాహకులు కె. బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ, కుటుంబసభ్యులతో పాటు మహిళా భక్తులు వేల మంది పాలు పంచుకున్నారు. వరలక్ష్మీ పూజను పురస్కరించుకుని డోకిపర్రు మహాక్షేత్రాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులందరికీ పూజా సామాగ్రి, ద్రవ్యాలను ఆలయ ధర్మకర్తలు కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు ఉచితంగా అందించారు. పూజలో పాల్గొన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పలు వరుసల్లో కూర్చొని ఆచరించేలా ఏర్పాట్లు చేశారు. ఆలయ మండపం, వెయ్యి కాళ్ళ మండపం నిండిపోవటంతో ఆరు బయట ఉన్న ఖాళీ స్థలంలో మహిళా భక్తులు పలు వరుసల్లో కూర్చొని పూజల్లో పాల్గొన్నారు. వరలక్ష్మి వ్రత ప్రాశస్త్యాన్ని వేద పండితులు సోదాహరణంగా వివరించారు. స్త్రీలు సకల సౌభాగ్యాలతో ఉండాలని వారు ఆశీర్వదించారు. మహిళలకు స్త్రీమూర్తి ఐనటువంటి విష్ణు వక్షస్థల నివాసి, శ్రావణ మాస లక్ష్మీ ఐన వరలక్ష్మికి ప్రతి ఏడాది శ్రావణ మాసం నాలుగో శుక్రవారం డోకిపర్రు మహాక్షేత్రంలో పూజలు చేయటం ఆనవాయితీగా వస్తోంది. తమ కోరికలు నెరవేరటంతో పాటు పుత్ర, పౌత్రాభివృద్ధి కోరుకుంటూ, సుమంగళిగా



ఉండాలని మహిళలు ఈ విశేష పూజలు చేయటం జరుగుతుంది. శ్రావణ మాసంలోని నాలుగు శుక్రవారాల్లో తొలి మూడు శుక్రవారాలు ఏవైనా అవాంతరాల వల్ల వరలక్ష్మి పూజల్లో పాల్గొనలేని స్త్రీలు నాలుగో శుక్రవారం నాడు ఆలయంలో జరిగే పూజల్లో పాల్గొంటే మళ్లీ వచ్చే శ్రావణ మాసం వరకూ పూజలు చేసినంత పుణ్యం లభిస్తుందని ఆలయ వేద పండితులు వివరించారు. సాధారణంగా మనం ఇంట్లో ఒకసారి పూజచేస్తే అప్పటికి మాత్రమే ఫలం సిద్ధిస్తుంది. నిత్యం పూజలు జరిగే ఆలయంలో నిర్వహించే వరలక్ష్మీ వ్రతంలో ఒకసారి పాల్గొన్నా, ఆ చుట్టు పక్కల ఉన్నా అనంతమైనన్ని విడతలు పూజలో పాల్గొన్న ఫలం లభిస్తుంది. వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని ఆలయంలో శుక్రవారం ఉదయం లక్ష్మీ యాగం, మహాశాంతి హటరీమం నిర్వహించారు. పూజ అనంతరం భక్తులకు అన్న ప్రసాదం అందించారు.

**కృష్ణాష్టమి వేడుకలు**

మహాక్షేత్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. యువతీ యువకులు , భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కళకళలాడింది.

## శివకాశి పురంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు.



ప్రజాభూమి ప్రతినిధి-వేలేరుపాడు.

వేలేరుపాడు మండలం శివకాశి పురం గ్రామంలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఘనంగా వుట్టి కొట్టు పండగను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో ఏర్పాటుచేసిన శ్రీకృష్ణుని చిత్రపటానికి ఉదయం నుంచి భక్తులు పూజలు చేసుకున్నారు. శ్రీకృష్ణునికి ప్రియమైన వంటకాలను గ్రామస్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో మందిరంలోని కృష్ణునికి సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమాలను తిలకించేందుకు మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి తిలకించారు. ఈ కార్యక్రమాన్ని శివకాశి పురం గ్రామానికి చెందిన భక్తులు కునారపు సత్యనారాయణ, బొల్ల రంగారావు, నిమ్మల కాశయ్య, చెమడబోయిన మురళి, సాధనాల యేసు, లిఖిత్, నాగరాజు, నవదీప్, ముత్తయ్య తదితరులంతా ఉన్నారు.

## విద్యార్థుల విజయాల వెనుక.. ఉత్తమ ఉపాధ్యాయుడిగా రామిశెట్టి వెంకటేశ్వరరావు

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



2026 జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల్లో భాగంగా ఏలూరు జిల్లా తరపున జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఈదర మెయిన్ మోడల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రామి శెట్టి వెంకటేశ్వరరావుకు రాష్ట్రోపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు అంకం వెంకటే శ్వరరావు, ప్రధాన కార్యదర్శి రామెళ్ల సాంబశివరావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా సహాయ అధ్యక్షుడు తాడి నరసింహారావు, ఉమ్మడి కృష్ణాజిల్లా మాజీ ప్రధాన కార్య దర్శి చౌటపల్లి సురేష్ కుమార్ మాట్లాడుతూ రామిశెట్టి వెంకటేశ్వరరావు అంకితభావం, నిబద్ధతతో పనిచేస్తూ విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ఏలూరు, కాకినాడలో నిర్వహించిన వివిధ పోటీలకు విద్యార్థులను తీసుకువెళ్లి బహుమతులు సాధించేలా ప్రోత్సహించారని, విద్యార్థుల అభివృద్ధికి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డుకు ఆయన పూర్తిగా అర్హుడని పేర్కొన్నారు.

### నేషనల్ ఎడ్యుకేషన్ శిరోమణి అవార్డుకు

## భవాని ప్రసాద్ రాయపూడి ఎంపిక

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు



ఉత్తమ ఆదర్శ ఉపాధ్యాయుడు, రాయపూడి భవాని ప్రసాద్ కు మరొక అరుదైన గౌరవం దక్కింది. దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన, అయోధ్యకు చెందిన స్వదేశ్ సంస్థాన్ ఇండియా తరపు న అందజేసే.. నేషనల్ ఎడ్యుకేషన్ శిరోమణి అవార్డుకు రాయపూడి ఎంపికయ్యారు. దేశంలో ఉత్తమ సేవలందిస్తున్న 70 మందికి మాత్రమే ఈ అవార్డును వీరు అందిస్తుంటారు. ఇంత అత్యున్నతమైన అవార్డు, పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లు జి వి ఎస్ వి ఆర్ ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా, విద్యార్థులకు సేవలు అందిస్తూ.. విద్యార్థుల సేవలో తరిస్తున్న రాయపూడి కి రావడం విశేషం. రాయపూడి కి నేషనల్ ఎడ్యుకేషన్ శిరోమణి అవార్డు రావడం పట్ల పాలకొల్లు పట్టణంలోని పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. దేశంలో గరిష్టంగా కేవలం 70 మందికి మాత్రమే, ఉత్తమ సేవలు అందించిన వారిని వెతికి గుర్తించి ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందిస్తారు. రాయపూడి మాస్టారు అవార్డు అందుకోవ డానికి నూటికి నూరు శాతం నిజమైన అర్హులని, సమర్థత, నిజమైన విద్యా సేవకుడికి అవార్డు చేరిందని, పట్టణ ప్రజలు కొనియాడుతున్నారు. ఈ విషయమై ఉత్తమ ఉపాధ్యాయుడు రాయ పూడి భవాని ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు సేవ చేయడంలో కలిగే ఆనందం వెలకట్టలేని దన్నారు. గతంలో తనకు ఎన్నో అవార్డులు అందాయని, ఈ అవార్డు తనకొక ప్రత్యేకమైన గౌరవాన్ని కల్పించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇకపై తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. తన సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తానని హామీ ఇచ్చారు.

### ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

## శ్రీకృష్ణుడిగా స్వామివారి అలంకరణ.. చిన్నారులతో ఉట్టి కొట్టే కార్యక్రమం



ప్రజాభూమి ప్రతినిధి-వేంపల్లె

స్థానిక పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న శ్రీ వృషభాచలేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించామని ఆలయ కార్యనిర్వహణాధికారి కె. సుభాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తిరుమల వేణు నేతృత్వంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారిని శ్రీకృష్ణుడిగా ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఛైర్మన్ పి.వి. రమణ పర్యవేక్షణలో సాయంత్రం ఆలయ ముఖ్య అర్చకులు హరిప్రవీణ్, తిరుమల వేణు నేతృత్వంలో స్వామివారికి ఆరాధన, ప్రత్యేక పూజలు, హారతి నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉట్టి ఏర్పాటు చేసి చిన్నారులతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో సందడి చేశారు. వారి వేషధారణలు, ఉట్టి కొట్టే కార్యక్రమం భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు సునీల్, రామాంజనేయులు, వరాలు, జ్యోతి, రాజమ్మ, మారుతి ప్రసన్న, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి



# వేలేరుపాడులో ఘనంగా టిడిపి అధ్యక్షుడు అశోక్ జన్మదిన వేడుకలు.



ప్రజాభూమి ప్రతినిధి-వేలేరుపాడు.

వేలేరుపాడు మండల టిడిపి అధ్యక్షుడు అమరవరపు అశోక్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ విధంగా మండల పార్టీ కార్యాలయంలోనూ కమ్మరగూడెంలోను జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు అభిమానులు మధ్య కేకులు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి పలువురు మాట్లాడుతూ అహర్నిశలు ప్రజల కోసం పని చేసే అశోక్ ఆయురారోగ్యాలతో మరెన్నో జన్మదిన వేడుకలు నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విరివిగా పాల్గొన్నారు.

# నాయుడుపేటలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు.

-శ్రీకృష్ణ గోపికల వేషదారుల్లో చిన్నారులు.





ప్రజా భూమి ప్రతినిధి-నాయుడుపేట.

తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని రాజగోపాలపురం లోని శ్రీరామ మందిరంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని చిన్నారులు శ్రీకృష్ణుడు,గోపికల వేషధారణలో పాఠశాలల్లో సందడి చేశారు. సాంప్రదాయ నృత్యాలు, కోలాటాలతో అందరిని అల్లరించారు.అలాగే కృష్ణుడు ప్రతిమకు పూజలు చేసి కృష్ణుడికి ఇష్టమైన అటుకులు,బెల్లంతో కలిపిన ప్రసాదం పిల్లలకు రచిపెట్టారు.

# రామలింగేశ్వర నగర్ ఇస్కాన్ ఆలయంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

## పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని, టిడిపి సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్

ప్రజాభూమి ప్రతినిధి-విజయవాడ



విజయవాడ( రామలింగేశ్వర నగర్ ఇస్కాన్ టెంపుల్) రామలింగేశ్వర నగర్‌లోని ఇస్కాన్ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని, టిడిపి సీనియర్ నాయకులు బొప్పన భవకుమార్ తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ప్రజలు కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారని తెలిపారు. శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ఇస్కాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.శ్రీకృష్ణుడి బోధనలు మానవాళికి శాంతి, ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను అందిస్తున్నాయని ఎంపీ అన్నారు. భగవద్గీత ద్వారా శ్రీకృష్ణుడు సమాజానికి అందించిన సందేశాలు నేటికీ ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కృష్ణాష్టమి వంటి పండుగలు మన ఆధ్యాత్మిక సంప్రదాయాలను, సంస్కృతిని, కుటుంబ విలువలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో టెంపుల్ టూరిజం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, పుణ్యస్థలాలను మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.ఆధ్యాత్మిక కేంద్రాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయడం ద్వారా భక్తులకు సౌకర్యాలు కలగడమే కాకుండా, స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఎంపీ పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధి, పరిసరాల పరిశుభ్రత, భక్తుల సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

### సంప్రదాయాలను కాపాడుతూ పండుగల నిర్వహణ

హిందువుల పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకునేలా ప్రభుత్వం సెలవులు కూడా ఇస్తోందని ఎంపీ అన్నారు. మన పండుగలు కేవలం ఆచారాలు మాత్రమే కాకుండా, సమాజాన్ని ఒక్కతాటిపైకి తీసుకువచ్చే సాంస్కృతిక వేడుకలని పేర్కొన్నారు.కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి కార్యక్రమాలను నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. ఇలాంటి వేడుకల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలు మరింత బలపడతాయని తెలిపారు. కృష్ణాష్టమి వంటి పండుగలు ప్రజల్లో ఐక్యతను పెంచుతాయని ఎంపీ కేశినేని శివనాథ్ చిన్ని అన్నారు. కులమత భేదాలకు అతీతంగా ఊరు, వాడా కలిసి అందరూ ఇలాంటి పండుగలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పండుగల సమయంలో పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకోవడం, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం, సమాజ శ్రేయస్సు కోసం కలిసి పనిచేయడం ద్వారా సోదరభావం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలందరూ శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో పండుగలను జరుపుకోవాలని కోరారు.

భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కృషిపండుగల సందర్భంగా భక్తులకు అవసరమైన సదుపాయాలు, సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ తెలిపారు. ఆలయాల వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు, పరిశుభ్రత, తాగునీరు, ఇతర అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు, భక్తులు, ప్రజలు సహకరించాలని ఎంపీ కోరారు. భక్తి, సంస్కృతి, సేవాభావంతో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. ఆ శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రతి ఒక్క కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని ఎంపీ చిన్ని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు బొప్పన భవకుమార్, మాజీ కార్పొరేటర్ బహదూర్, టిడిపి సీనియర్ నాయకులు కరీముల్లా, చరణ్ సాయి యాదవ్, ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు...

# ఉపాధ్యాయులే సమాజ నిర్మాణానికి మార్గదర్శకులు..

- జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)
- జే ఆర్ సి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ప్రజా భూమి ప్రతినిధి-జగ్గయ్యపేట



ఉపాధ్యాయులే సమాజ నిర్మాణానికి మార్గదర్శకుడని శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ అన్నారు. పట్టణంలోని జేఆర్సి కళాశాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.భవిష్యత్ తరాలకు జ్ఞానాన్ని అందిస్తూ, వారి ఆలోచనలకు దిశానిర్దేశం చేస్తూ, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయుల సేవలను స్మరించుకుంటూ జే ఆర్ సి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.భారతదేశ మాజీ రాష్ట్రపతి, మహోన్నత తత్వవేత్త, విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమానికి జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ, "ఒక విద్యార్థి జీవితాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయుడి చేతుల్లో ఉంటుంది. తరగతి గదిలో పాఠాలు బోధించడం మాత్రమే కాదు.. విలువలు, బాధ్యత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని విద్యార్థుల్లో పెంపొందించడం ద్వారా ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాణానికి పునాదులు వేస్తున్నారు" అని అన్నారు.సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర అమోఘమైనదని, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో అధ్యాపకుల మార్గదర్శకత్వం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. తరతరాల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను భుజాన వేసుకున్న ఉపాధ్యాయుల సేవలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యాసంస్థల అధ్యాపకులను ఘనంగా సన్మానించి, వారి సేవలను అభినందించారు. కార్యక్రమంలో జే ఆర్ సి విద్యాసంస్థల చైర్మన్ రంగాపురం నరసింహారావు, , సెక్రటరీ ఉ కరెస్పాండెంట్ పెనుగొండ వెంకట రాజీవ్ , జే ఆర్ సి విద్యాసంస్థల నిర్వాహకులు కె ఎన్ రమేష్ , జె. తిరుపతిరావు , పి. సుధీర్ , టి. వెంకటేశ్వర రాజు , జే ఆర్ సి కళాశాలలకు చెందిన అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. "విద్యార్థి విజయం వెనుక తల్లిదండ్రుల ఆశీర్వాదం ఉంటే.. ఆ విజయానికి దిశ చూపే గురువు ఉంటాడు." అనే సందేశంతో సాగిన ఈ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు, గురువుల పట్ల గౌరవాన్ని చాటుతూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో జే ఆర్ సి విద్యాసంస్థలు చూపిస్తున్న నిబద్ధతను మరోసారి ప్రతిబింబించాయి.

# పోలవరం క్రెడిట్ చంద్రబాబుదే... అది ప్రజలకు తెలుసు

- సాగునీటి ప్రాజెక్టుల పేరు ఎత్తే హక్కు అర్హత జగన్ రెడ్డికి లేదు
- వెలిగొండకు రూ.5,233 కోట్లు చంద్రబాబు ఖర్చు చేస్తే... జగన్ ఖర్చు చేసింది కేవలం రూ.841 కోట్లు
- రాయలసీమ లిఫ్ట్ పేరుతో తెలంగాణ వాసులకు రాయలసీమపై వ్యతిరేక భావన నింపిన దుర్మార్గుడు జగన్
- వైఎస్ఆర్, జగన్ రెడ్డిల వల్లే పోలవరం ఇంత ఆలస్యం అయింది
- ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి

రాయలసీమ మొదలుకుని ఉత్తరాంధ్ర వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా శ్రమిస్తున్న ఏకైక నాయకుడు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. సామాజిక, ఆర్థిక రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని ఆయన పేర్కొన్నారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రతిసారీ రాష్ట్రంలో సాగునీటి రంగానికి కొత్త కళ, కొత్త వెలుగులు వస్తాయి. నిలిచిపోయిన ప్రాజెక్టులను పరుగులు పెట్టించే సమర్థత, సంకల్పం ఆయనకే సొంతం. ఎందరో ముఖ్యమంత్రులను చూశాం కానీ, ప్రాజెక్టులపై ఇంతటి అంకితభావం ఉన్న నాయకుడు మరొకరు లేరు. రాయలసీమకు అదనపు జలాలు తీసుకురావాలని సంకల్పించిన మహనీయుడు నందమూరి తారక రామారావు. ఆ మహానుభావుడి ఆశయాలను, ఆకాంక్షలను నేడు క్షేత్రస్థాయిలో నిజం చేసి చూపిస్తున్న నాయకుడు చంద్రబాబు నాయుడు రాయలసీమలోని కర్నూలు, అనంతపురం, చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాల దాహార్తిని, సాగునీటి కష్టాలను తీర్చే జీవనాడి హంద్రీ-నీవా ప్రాజెక్టు. 2024లో అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలోనే దాదాపు ?8,000 కోట్లు ఖర్చు పెట్టి పనులను శరవేగంగా ముందుకు తీసుకెళ్తున్నాం. 2014-2019 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసమే ?12,484 కోట్లు ఖర్చు చేశాం. ఆ తర్వాత వచ్చిన జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తిగా గాలికొదిలేసి, ఐదేళ్లలో కేవలం ?2,000 కోట్లు మాత్రమే విదిల్చింది. సీమ ప్రజల ప్రయోజనాలను వైఎస్సార్సీపీ తుంగలో తొక్కింది. రాయలసీమను సస్యశ్యామలం చేసి, కరవును శాశ్వతంగా తరిమికొట్టేందుకు చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు.

**సాగునీటి ప్రాజెక్టుల పేరు ఎత్తే అర్హత జగన్‌కు లేదు**

ఉమ్మడి ప్రకాశం జిల్లా (నేటి మార్కాపురం ప్రాంతం) ప్రజల 30 ఏళ్ల చిరకాల స్వప్నాన్ని నిజం చేస్తూ కృష్ణా జలాలను అందించిన ఘనత, అలాగే ఉత్తరాంధ్ర ప్రజల దాహార్తి, సాగునీటి అవసరాలు తీర్చేందుకు గోదావరి జలాలను అక్కడికి తరలించిన తొలి నాయకుడు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడునని కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. శతాబ్దాలుగా కరువుతో అల్లాడుతూ, కనీసం తాగడానికి గుక్కెడు నీరు లేక, పంటలు పండక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులకు పవిత్ర గోదావరి, కృష్ణా జలాలను మళ్లించి ఆయా ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి చంద్రబాబు బాటలు వేశారు. మొన్న వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభించి కృష్ణా జలాలు విడుదల చేస్తే, నిన్న పోలవరం నుంచి గోదావరి నీళ్లను ఉత్తరాంధ్రకు తరలిస్తే... ఓర్వలేక జగన్మోహన్ రెడ్డి అండ్ కో విషం జిమ్ముతోంది. తామేదో చేసేశామని, చంద్రబాబు గారు క్రెడిట్ చోరీ చేస్తున్నారని అవాకులు చవాకులు పేలడం హాస్యాస్పదం. ఈ రాష్ట్రంలో రాయలసీమ అయినా, కోస్తా అయినా, ఉత్తరాంధ్ర అయినా సాగునీటి ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత, నైతిక హక్కు ఒక్క చంద్రబాబు నాయుడుకి మాత్రమే ఉన్నాయి. జగన్మోహన్ రెడ్డి పాలనలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా పడకేశాయి. ఏ ఒక్క ప్రాజెక్టుకూ సరైన నిధులు విడుదల చేయకుండా, పనులను స్తంభింపజేసి రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారు. 1996లో వెలుగొండ ప్రాజెక్టుకు భూమిపూజ చేసింది చంద్రబాబు నాయుడు మళ్లీ 2026లో ఆయన చేతుల మీదుగానే ఉమ్మడి ప్రకాశం/మార్కాపురం ప్రాంతానికి కృష్ణా జలాలు విడుదలయ్యాయి. చంద్రబాబు హయాంలో మొత్తం రూ. 5,233 కోట్లు వెచ్చించింది. 1996 నుంచి 2004 వరకు: రూ. 430 కోట్లు, 2014 నుంచి 2019 మధ్య: రూ. 1,814 కోట్లు, 2024 నుంచి ఇప్పటివరకు: రూ. 2,989 కోట్లు ఖర్చుపెట్టారు. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో రూ. 1,126 కోట్లు, ఐదేళ్ల జగన్మోహన్ రెడ్డి హయాంలో కేవలం రూ. 841 కోట్లు విదిల్చింది. రూ. 5,233 కోట్లు ఖర్చు పెట్టి, ప్రాజెక్టును రాత్రింబవళ్లు పరుగులు పెట్టించి, రైతులకు, ప్రజలకు కృష్ణా జలాలు అందించిన చంద్రబాబు నాయుడు గొప్పా? లేక తన ఐదేళ్ల పాలనలో కేవలం రూ. 841 కోట్లు ఖర్చు చేసి, పనులు పూర్తి కాకుండానే ఏదో జాతికి అంకితం చేశామని కల్లబొల్లి మాటలు చెప్పిన జగన్మోహన్ రెడ్డి గొప్పా? ఇందులో అసలైన "క్రెడిట్ చోరీ" ఎవరిదో ప్రజలే ఆలోచించాలని విజ్ఞప్తి



చేస్తున్నాం. ప్రాజెక్టుల విధాత చంద్రబాబు నాయుడు పై బురదజల్లే కుట్రలను ప్రజలు ఎప్పటికీ నమ్మబోరని కాలవ శ్రీనివాసులు తేల్చిచెప్పారు.

చంద్రబాబు కష్టాన్ని తమ ఖాతాలో వేసుకోవడమే వైకాపా నైజం.. అసలైన 'క్రెడిట్ చోరులు' జగన్మోహన్ రెడ్డి అండ్ కోనే రాష్ట్రంలో ఎక్కడ ఏ మంచి జరిగినా దాన్ని తమ ఖాతాలో వేసుకోవడం వైఎస్సార్సీపీకి అలవాటైపోయిందని కాలవ శ్రీనివాసులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైకాపా నేతల ద్వంద్వ వైఖరిని, జగన్మోహన్ రెడ్డి సాగునీటి రంగ ద్రోహాన్ని లెక్కలతో సహా ఎండగట్టారు. మంచి చేయడం చేతకాదు, మంచి పనుల గురించి కనీస ఆలోచన కూడా చేయరు. కానీ చంద్రబాబు నాయుడు గారు నిరంతరం శ్రమించి చేసిన, చేస్తున్న అభివృద్ధిని మాత్రం సిగ్గులేకుండా తమ ఖాతాలో వేసుకోవాలని చూస్తున్నారు. తమ ఖాతాలో వేసుకోవడానికి ఉన్న తాపత్రయంలో కనీసం 10 శాతమైనా అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టులపై పెట్టి ఉంటే రాష్ట్రానికి ఈ గతి పట్టేది కాదు. ఐదేళ్ల జగన్ పాలనలో ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేయడమే కాకుండా, వివాదాస్పదంగా మార్చారని మండిపడ్డారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పేరుతో జగన్మోహన్ రెడ్డి చేసిన నాటకాల వల్ల రాయలసీమకు ఒక్క పైసా ప్రయోజనం కలగలేదు. తీవ్ర కరవు పీడిత ప్రాంతాలైన కర్నూలు పశ్చిమ తాలూకాలకు గానీ, అనంతపురానికి గానీ బొట్టు నీరు రాలేదు. పైగా, 'కృష్ణా జలాలన్నీ తోడేస్తున్నారంటూ' అనవసర రాద్ధాంతం సృష్టించి, తెలంగాణ వాసుల్లో రాయలసీమ ప్రాంతంపై, ప్రజలపై తీవ్ర వ్యతిరేక భావాన్ని, విషబీజాలను నాటిన చరిత్రహీనుడు జగన్మోహన్ రెడ్డి. మరి అదే చంద్రబాబు నాయుడు 2014లో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎలాంటి వివాదాలు లేకుండా, ఎవరితోనూ గొడవలు పడకుండా చాలా చాకచక్యంగా వ్యవహరించారు. ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీల కృష్ణా జలాల్లో సింహభాగం 512 టీఎంసీలను నవ్యాంధ్రకు సాధించి తెచ్చారు (తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించారు). మల్యాల నుంచి హంద్రీ-నీవా ఎత్తిపోతల ఉంటే.. నీటి మట్టం 800 అడుగులకు పడిపోయినా నీళ్లు తోడే అద్భుతమైన సాంకేతికతతో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి సీమ దాహం తీర్చిన ఘనుడు చంద్రబాబు గారు కాదా? ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ రాయలసీమకు సాగునీరు, తాగునీరు ఇవ్వాలని చంద్రబాబు తపనపడితే.. రాయలసీమ పేదరికాన్ని చూపించి వేల కోట్ల రూపాయలు దోచుకున్న చరిత్ర వైకాపాది కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు విషయంలో ఎవరు ఎంత చిత్తశుద్ధితో పనిచేశారో లెక్కలే చెబుతున్నాయి. చంద్రబాబు నాయుడు గారి హయాంలో 2014 - 2019 మధ్య రూ. 11,178 కోట్లు, 2024 - 2026 మధ్య కూటమి పాలనలో రూ. 8,322 కోట్లు మొత్తం కలిపి చంద్రబాబు గారు వెచ్చించింది రూ. 19,500 కోట్లకు పైమాటే. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో ఖర్చు రూ. 2,239 కోట్లు , జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ఖర్చు కేవలం రూ. 792 కోట్లు తండ్రీకొడుకులు ఇద్దరూ కలిపి పోలవరంపై పెట్టింది కేవలం రూ. 3,021 కోట్లు మాత్రమే. దాదాపు 20 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ప్రాజెక్టును పరుగెత్తించిన చంద్రబాబు నాయుడు గారు గొప్పా? లేక తండ్రీకొడుకులు ఇద్దరూ కలిసి పదేళ్లలో కేవలం రూ. 3 వేల కోట్లు విదిల్చిన వీళ్లు గొప్పా? చంద్రబాబు గారు రేయింబవళ్లు కష్టపడి రాష్ట్రాన్ని బాగు చేస్తుంటే.. ఆయన చేసిన పనులను తామే చేశామంటూ అవాకులు చవాకులు పేలుతున్న జగన్మోహన్ రెడ్డి అండ్ కోనే అసలైన క్రెడిట్ చోరులు. వైకాపా అసత్యాలను, తప్పుడు ప్రచారాలను రాష్ట్ర ప్రజలు ఏనాడూ నమ్మరని స్పష్టం చేశారు.

చంద్రబాబు నాయుడు తోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడానికి నిరంతరం శ్రమిస్తున్న విజనరీ నాయకుడు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారని కాలవ శ్రీనివాసులు కొనియాడారు. ఆయన కష్టపడే తత్వం, నిబద్ధత వల్లే ఐదు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో తిరుగులేని ప్రజా నాయకుడిగా, జాతీయ స్థాయిలో అత్యంత ప్రభావవంతమైన నేతగా వెలుగొందుతున్నారని, అలాంటి మహానాయకుడు తెలుగువాడు కావడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే ఓర్వలేక, ఈర్ష్యతో, దుగ్ధతో వైఎస్సార్సీపీ నాయకులు విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరి హయాంలో ప్రాజెక్టులు శరవేగంగా పరుగెత్తాయి? ఎవరి పాలనలో పడకేశాయి? అనేది ప్రజలు స్పష్టంగా బేరీజు వేసుకుంటున్నారని, వైసీపీ చేస్తున్న క్రెడిట్ చౌర్యాన్ని ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారని అన్నారు. నాడు డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోలవరం హెడ్ వర్క్స్ పనులు చేస్తున్న 'మధుకాన్' సంస్థను అర్ధాంతరంగా తప్పించి ప్రాజెక్టు పనుల్లో తీవ్ర జాప్యానికి ఆద్యుడయ్యారు. ఆ తర్వాత వచ్చిన జగన్మోహన్ రెడ్డి 'నవయుగ' సంస్థను తప్పించి, రివర్స్ టెండరింగ్ పేరుతో కొత్త కాంట్రాక్టర్‌ను నియమించడంలో ఏళ్ల తరబడి తీవ్ర జాప్యం చేసి ప్రాజెక్టును దశాబ్దాల వెనక్కి నెట్టారు. జరుగుతున్న పనులను ఆపేసి.. కేవలం రాజకీయ కక్షతో, ఫలానా వర్గం వాళ్లు పనులు చేయకూడదనే ఒక అహంకారంతో మీరు తీసుకున్న తుగ్లక్ నిర్ణయాల వల్లే పోలవరం పనుల్లో తీవ్ర జాప్యం జరిగిందన్నది పచ్చి నిజం కాదా? వాస్తవాలు కళ్లముందు ఇంత స్పష్టంగా కనిపిస్తుంటే.. పోలవరం, వెలుగొండ ప్రాజెక్టులను మీరు క్రెడిట్ చోరీ చేయాలనుకుంటే ప్రజలు నమ్ముతారా జగన్మోహన్ రెడ్డి? అని నిలదీశారు. చంద్రబాబు నాయుడు గారు అధికారంలో ఉంటేనే సాగునీటి ప్రాజెక్టులు పూర్తవుతాయని, రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్ని వర్గాల ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదిస్తున్నారు. ప్రజలకు వెంటనే ఫలితాలు అందించి, ఆయా ప్రాంతాల రూపురేఖలు మార్చాలనే నిర్దిష్టమైన భవిష్యత్ ప్రణాళికతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే ?3,800 కోట్లు ఖర్చు పెట్టి హంద్రీ-నీవా కాలువ తొలి దశ విస్తరణ పనులను పూర్తి చేశాం. రెండో దశను కూడా దాదాపు పూర్తి చేసి, చిట్టచివరి ప్రాంతమైన కుప్పం వరకు నీటిని తరలించి రికార్డు సృష్టించాం. పోలవరాన్ని అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుగా చేపట్టి, యుద్ధప్రాతిపదికన పనులను పరుగులు పెట్టిస్తున్నాం. 30 ఏళ్ల ప్రకాశం జిల్లా వాసుల చిరకాల స్వప్నమైన వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి కృష్ణా జలాలను అందించిన ఘనత చంద్రబాబు గారిదే. రాష్ట్రంలో జరుగుతున్న మంచిని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు పెట్టే శాపనార్థాలను, చేసే ఏడుపులను ఎవరూ పట్టించుకోరు. వారి ఏడుపులు కేవలం రోదనలుగానే మిగిలిపోతాయి తప్ప ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపవు. రానున్న మూడేళ్ల కాలంలో ప్రాధాన్యతా క్రమంలో మిగిలిన అన్ని ప్రాజెక్టులనూ శరవేగంగా పూర్తి చేసి రాష్ట్ర రైతాంగానికి, ప్రజలకు అంకితం చేస్తాం. చంద్రబాబు నాయుడు గారి నాయకత్వానికి, కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు, అండదండలు ఎల్లప్పుడూ మెండుగా ఉంటాయని విశ్వసిస్తున్నామని కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు.